16-2Pg1exHMNWJQE.qxd:16-2Pg1exHMNWJQE.qxd 1/1/02 6:56 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-2-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 16 పేజీలు: 16 వెల: 6.50

ఆధార్‌తో మరింతగా వ్యక్తిగత భద్రత

5లో

రేపు బంగ్లాలో కొత్త సర్కార్

# స్టూడెంట్లకు 'నీట్' శిక్షణ



## పాక్ చిత్తు చిత్తు

టి-20 వరల్డ్ కప్‌లో భారత్ ఘన విజయం

61 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8కి చేరిన భారత్ జట్టు

ఆట లో



ఆదివారం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు తదితరులు

ఎస్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.9వేల కోట్లు

సంత్ సేవాలాల్ స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధి

బంజారాలలో చైతన్యం తెచ్చిన సేవాలాల్

గిరిజన ప్రాంతాల్లో మరిన్ని మౌలిక సౌకర్యాలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** నీట్, ఐఐటీల్లో సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుల్లో ముందుంటున్నారని, ఉన్నత కొలువులు సాధించాలనే పట్టుదల వారిలో పెరిగిందన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకుంటారనడంలో ఎటువంటి సందేహం లేదని అభిప్రాయపడ్డారు. సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. రూ.50లక్షలు కేటాయించి సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్రపండుగగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించిన అనంతరం ప్రసంగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, గుత్తి మండలం, రామ్‌జీ నాయక్ తండాలో భీమా నాయక్, ధర్మణి మాత దంపతులకు సంత్ శ్రీ సేవాలాల్ జన్మించారు. సేవాలాల్ దూరమై శతాబ్దాలు గడుస్తున్నా బంజారాల గుండెల్లో ఆరాధ్యదైవంగా నిలిచారు. బంజారాలలో సేవాలాల్ చైతన్యాన్ని తీసుకొచ్చారు. ఆయన సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శంగా ఉంటాయి. దేశమంతా తిరిగి బంజారాలాను ఒకతాటిపైకి తీసుకొచ్చారు. సేవాలాల్ సేవలను నెమరువేసుకునే బాధ్యత >>2



శ్రీశైలంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల ప్రభోత్సవం దృశ్యం

# 'హరోంహర' నామస్మరణతో వైభవంగా మహాశివరాత్రి

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు



విజయవాడలో శివరాత్రి సందర్భంగా పున్నమి ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

2లో



## చేనేతలకు ఉచిత విద్యుత్

ఏప్రిల్ 1 నుంచి అమలు: మంత్రి సవిత

**విజయవాడ,ఫిబ్రవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత వృత్తిలో కొనసాగే వారందరికీ ఈ పథకం వర్తింపజేయనున్నామన్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. పోగును వస్త్రంగా మార్చి మనుష్యుల ఆత్మగౌరవాన్ని కాపాడే మహనీయులు నేతన్నలని కొనియాడారు. చేనేతలకు అన్న ఎన్టీఆర్ తొలుత అండగా నిలుస్తే, 2014-19లో సీఎం చంద్రబాబు నాయుడు పాలన నేతన్నలకు స్వర్ణయుగంలా గడిచిందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నామన్నారు. చేనేతవృత్తిలో ఉన్న వారందరూ ఉచిత విద్యుత్‌కే అర్హులేనన్నారు. మగ్గం నేసే నేతన్నలకు 200యూనిట్ల అందజేయ బోతున్నామని,దీనివల్ల ఆయా నేతన్నల >>2

# కృత్రిమ మేధకు కొత్త అడ్రస్

దేశంలో మొదటి ఎఐ డేటా నగరంగా విశాఖ

ప్రపంచ ఎఐ రేసులో ప్రస్తుతం అమెరికా, చైనా ముందంజ

విశాఖ నుంచి 100 కి.మీ మేర సమగ్ర డేటా అభివృద్ధికి సర్కార్ నిర్ణయం



**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరమైన విశాఖపట్నం భారతదేశ కృత్రిమ మేధస్సు ఆశయాలకు కేంద్రంగా మారనుంది. దేశంలో మొట్టమొదటఏఐ కేంద్రీకృత డేటా నగరాన్ని ఇక్కడ అభివృద్ధి చేయడానికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతర్జాతీయ ఇంటర్నెట్ కనెక్టివిటీ కారణంగా ఈ సముద్ర తీరప్రాంత నగరం వ్యూహాత్మకంగా ముఖ్యమైనదిగా మారబోతుంది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026ఈ దిశలో బలమైన పునాది వేయగలదని నిపుణులు భావిస్తున్నారు.ప్రపంచ ఏ ఐ రేసులో అమెరికా, చైనాలు ప్రస్తుతం ముందంజలో ఉన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏఐ ని స్వీకరించాలా !వద్దా?అనేది కాదు, భారతదేశం ఎంత త్వరగా ముందుకు సాగగలదనేదే అని ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టంగా పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026 కి ముందు ఒక ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సీఈఓలు, దేశాధినేతలు పాల్గొంటున్నారు. తత్ఫలితంగా, విశాఖపట్నంలో జరిగే ఈ ప్రాజెక్ట్ ప్రపంచ >>2



## నేడు అమరావతికి బిల్ గేట్స్ రాక

ముఖ్యమంత్రితో భేటీ

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:**మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈనెల 16న రాష్ట్రానికి రానున్నారు. తన గేట్స్ ఫౌండేషన్ తరఫున రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల్ని సందర్శించడంతో పాటు ప్రభుత్వ పెద్దలతో భేటీ కానున్నారు. బిల్‌గేట్స్ రాకకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదలచేసింది. ఇందులో ప్రభుత్వం కీలకంగా భావిస్తున్న సంజీవని ప్రాజెక్టును కూడా బిల్ గేట్స్ పరిశీలిస్తారు. 16 తేదీ ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ అమరావతిలోని రాష్ట్రసచివాలయానికి రానున్నారు. అక్కడి ఆర్టీజీఎస్ కేంద్రానికి వెళ్లి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ విధానాలు, ఫలితాలను బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రి >>2

# 'కల్తీ నెయ్యి'లో అధికారులే కీలకమా!

గత బోర్డు పెద్దలు నిమిత్తమాత్రమేనా?

అన్నీ తమపై నెట్టేస్తున్నారని ఉద్యోగుల ఆవేదన



**తిరుమల,పిబ్రవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు 235కోట్ల రూపాయల విలువైన 60లక్షల కిలోల కెమికల్స్ వాడారనే కల్తీనెయ్యి వివాదంలో కర్త, కర్మ, క్రియ టిటిడి అధికారులేననే పెద్ద దుమారం ఇప్పుడు సంచలనంగా మారింది. కల్తీ నెయ్యి సరఫరా అయినా వినియోగించేందుకు తొమ్మిదిమంది టిటిడి ఉద్యోగులు సహకరించారనే అభియోగంతో కొందరు ఉద్యోగులకు షాక్ తగిలిందనే దుమారం టిటిడిలో గుప్పుమంటోంది. ధార్మికసంస్థ టిటిడిలో బోర్డు పెద్దలు పాలన ఉన్నంత కాలం సుప్రీమ్ బోర్డునేననేది జగమెరిగిన సత్యం. ఇలా 2019-2024 మధ్యకాలంలో తిరుమల లడ్డూలకు అవసరమైన ఆవునెయ్యి సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్లు ఖరారుచేయడం వంటివి కూడా పూర్తిగా అప్పటి బోర్డు పెద్దల ఆదేశాల మేరకే జరిగిందనేది అధికారులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు గత బోర్డు పెద్దలు కొందరు ఏకంగా కల్తీనెయ్యి అభాండాలు ఉద్యోగులపై నెట్టేసేలా ప్రచారం మొదలుపెట్టారని ఉద్యోగవర్గాల సమాచారం. కల్తీనెయ్యిలో అధికారుల పాత్రేనని చెబుతున్న గత బోర్డు పెద్దలు తమ ప్రమేయం నామమాత్రమేనని పొక్కడం ఎంతవరకు సమం జసమని అధికారులు బోరుమంటున్నారు. ఇప్పటికే ఈ కేసులో మొత్తం 36మంది నిందితులుగా సిబిఐ సిట్ పేర్కొనగా అందులో 12మంది టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ కమిటీ విభాగంలో జిఎంలు, సీనియర్ అసిస్టెంట్‌లు, కొందరు ఉద్యోగులు కీలకమనేది సిట్ నివేదికలు. ఏడుగురు టిటిడి అధికారులు సీనియర్ ,జూనియర్ అసిస్టెంట్‌లు కల్తీ నెయ్యి వ్యవహారంలో జోక్యముందనేది సిట్ నివేదిక. వీరివెనుక కీలకంగా కడూరు చిన్నఅప్పన్న ఆర్థికలావాదేవీలు నడిపారనేది కూడా ప్రధానంగా పేర్కొంది. డెయిరీ విభాగంకు సంబంధించి మాజీ జిఎం పేరూరు జగదీశ్వర్‌రెడ్డి, పి.వెంకటరామ సుబ్రమణ్యం, పి.మురళీకృష్ణ ,టిటిడి ఎస్వీగోశాల మాజీ డైరెక్టర్ డాక్టర్ హరినాధరెడ్డి, డెయిరీ టెక్నాలజీ నిపుణులు డాక్టర్ ఎం.మహేందర్, డాక్టర్ వి.వెంకటసుబ్రమణియన్, ఎం.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ బత్తులసురేంద్రనాథ్, డాక్టర్ కె.జయరాజారావును దోషులుగా పేర్కొంది. అయితే ఇదిలా ఉండగా ఇప్పుడు ఈ వివాదంలో టిటిడి డిప్యూటీ ఇఒ పద్మావతి,విఎస్ సురేశ్‌కుమార్, జ్యోతీశ్వరుడు, పార్థసారధి, మురళి, వెంకటరమణ పేర్లు గుప్పుమంది. నెయ్యికొనుగోళ్ళు సమయంలో గోడన్లలో విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించారనేది ప్రధాన ఆరోపణ. వీరిపై కూడా సిట్ నివేదికల్లో శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేయడంతో >>2

## ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే ఒక భరోసా.. నమ్మకం

విద్యా మంత్రి లోకేష్



**విజయవాడ,ఫిబ్రవరి 15.ప్రభాతవార్తప్రతినిధి:**ఎన్టీఆర్ ట్రస్ట్‌అంటే ఒక భరోసా, నమ్మకమని.. ఏపీ విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి ద్వారా ఈ ట్రస్ట్ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు.ఈ ట్రస్ట్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తోందని వివరించారు.సామాజిక సేవే పరమావధిగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఆదివారంతో 30వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ట్రస్ట్‌కు లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారాయన. ఇదే సామాజిక మాధ్యమంలో మరో పోస్టులో ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు మంత్రి లోకేశ్. భోళా శంకరుడు లింగోద్భవం చెందిన పవిత్రమైన రోజు ఈ మహా శివరాత్రి అని ఆయన పేర్కొన్నారు. ఉపవాసం, జాగరణతో నీలకంఠుడి కృపకు ప్రజలు పాత్రులు కావాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

# పేషెంట్లను పిప్పి చేస్తున్న రిఫరల్ దందా

ఆసుపత్రుల్లో హద్దులు దాటుతున్న కమీషన్లు

ప్రైవేటు పిడికిలిలో రోగులు విలవిల

**పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 15:** ఏ వ్యాపారానికైనా కమీషన్లు ఉండడం సహజమైనప్పటికీ మనిషి అనారోగ్యాన్ని తగ్గించి ప్రాణాలను కాపాడే వైద్య వ్యవస్థలో కూడా ఈ కమీషన్లు హద్దులు దాటడంతో రోగులు ఆర్థికంగా తట్టుకోలేక వీధి పాలవుతున్నారు. ప్రాణభయం ఉన్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లడానికి భయపడే పరిస్థితిలోకి రోగులు చేరుకున్నారంటే ఇందుకు దారి తీసిన అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ల్యాబ్ పరీక్షలు, చికిత్స, సర్జరీల ధరలు ఆసుపత్రి గోడల మీద బోర్డు మీద రాసిన దానికి, వసూళ్ళు చేస్తున్న మొత్తానికి సంబంధం లేకుండా ఉంటున్నాయి. దీనికి కారణాలు అనేకమని, ముఖ్యంగా వైద్య కిట్లు రేట్లు పెరిగాయని వైద్యులు చెబుతున్నప్పటికీ ఖి రిఫరల్స్ఖి ప్రధాన కారణమనే ప్రచారం ఉంది. రిఫరల్స్ పేరుతో రోగులను ఆసుపత్రికి పరిచయం చేసిన వ్యక్తులకు 30 నుంచి 40 శాతం వరకూ చెల్లించడం అనేది ఉభయ గోదావరి జిల్లాల్లో సర్వసాధారణం అయిపోయింది. ఆధునిక వైద్యం ఆశించి ప్రైవేటు మినీ కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే రోగుల దగ్గర నిర్దాక్షిణ్యంగా అధిక బిల్లులు వసూలు చేసి దాని నుంచి వారిని ఆసుపత్రికి సిఫార్సు చేసిన వ్యక్తికి అధిక మొత్తంలో కమీషన్లు ఇవ్వడం తెలిసి కూడా వైద్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం పలు విమర్శలకు దారితీస్తుంది. గ్రామీణ



వాతావరణం నుంచి వచ్చే రోగుల వద్ద ఒక్కోసారి 50 కూడా అదనంగా వసూలు చేసే సంబంధిత ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లకు ముట్ట చెప్పడం ఆ వ్యవస్థలో ఉన్న దోపిడీని అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా దీనివల్ల అనవసర టెస్టులు, ఆపరేషన్లు పెరుగుతున్నాయని గుర్తించిన వైద్యశాఖ కొన్ని ఆసుపత్రులకు నోటీసులు కూడా జారీచేసిన సంఘటనలున్నాయి. నగరాల్లో వెలిసిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో అయితే ఒక ఆసుపత్రి నుంచి >>2

16-2Pg2exHNWMJQE.qxd:16-2Pg2exHNWMJQE.qxd 1/1/02 7:00 AM Page 1





ఆదివారం శ్రీశైలం వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## 'హరోంహర' నామస్మరణతో వైభవంగా మహాశివరాత్రి

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హర.హర మహాదేవ. శంభోశంకర అంటూ శివనామస్మరణలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగుతున్నాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తులు పరమ శివున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి.పలు క్షేత్రాల్లో నదీ స్నానాలు అనంతరం గట్టునున్న శివలింగాలకు స్వయంగా అభిషేకాలు నిర్వహిస్తున్నారు., రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిర్వహిస్తున్నారు. ఆలయ పరిసరాలను అధికారులు విద్యుత్ దీపాలు, పూలతో అందంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు లక్షలాది భక్తజనం తరలివచ్చింది. భక్తులతో శ్రీశైలం మహా క్షేత్రం కిక్కిరిసింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా పోలీస్, రెవెన్యూ, దేవాదాయ శాఖలతో పాటు వివిధ శాఖల సమన్వయంతో శివ క్షేత్రంలో మునుపెన్నడూ లేని విధంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శ్రీశైలం దేవస్థానం సమీపంలో 626 కెమెరాల ద్వారా ప్రతి కదలికను ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. పంచారామ శైవ క్షేత్రమైన పల్నాడు జిల్లా అమరావతి అమరేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మూడు గంటలకు బిందె తీర్థంతో తొలి పూజ మహోత్సవం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేషాలంకరణలో అమరేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ రుత్విజులు, అర్చకులు బాలచాముండికా సమేత అమరేశ్వరుని విశేషంగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, మహారుద్రాభిషేకం, విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృష్ణానదిలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి క్షేత్ర పాలకుడైన బాల చాముండికా సమేత అమరేశ్వరుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవారికి అర్చకులు అభిషేకాలు, పూజలు చేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో శివరాత్రి సందర్భంగా విజయవాడ నగరంలోని కృష్ణానది తీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు చేసి, ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరుని దర్శించి పూజలుచేసారు.కూడలి సంగమేశ్వరాలయంలో మూడు ఉపనదులు సంగమించే ప్రాంతంలో స్నానాలు చేసిన అనంతరం పూజలు జరిపారు.ఇబ్రహీంపట్నంలో గోదావరి- కృష్ణ సంగమ స్థలి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసారు.రాజమహేంద్రవరం, ధవళేశ్వరమహాశివరాత్రి వేళ శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శ్రీ వాయు లింగేశ్వర స్వామి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవిని దర్శించుకునేందుకు వేకువజామున 2 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయానికి చేరుకునే భక్తులకు ఉపయుక్తంగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి అధికారులు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఆలయంలో శేష వాహన సేవను ఘనంగా నిర్వహించారు. సోమ స్కంద మూర్తి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబ దేవి శేష , యాళి వాహనాలపై భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వర్ణాభరణ అలంకరణలో ఉన్న దేవతామూర్తులు స్వర్ణ వాహనాలపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి తొలిపూజ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. తెల్లవారుజామున 12గంటల 30నిమిషాలకు త్రికోటేశ్వరునికి పలు అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. త్రికోటేశ్వరునికి నిర్వహించేఅభిషేకాల వేడుకను తిలకించేందుకు భక్తులు శనివారం రాత్రి నుంచే ఆలయంలో బారులు తీరారు. తొలిపూజ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు.

## తమిళ బిజెపి నేత నైనార్ నాగేంద్రన్‌పై సత్వరం సస్పెన్షన్ వేటు వేయాలి

### - జాతీయ సిపిఐ నేత నారాయణ డిమాండ్



చిత్తూరులో విలేకరులతో మాట్లాడుతున్న జాతీయ సిపిఐ నాయకులు నారాయణ

**చిత్తూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్ర బిజెపి నాయకుడు నైనార్ నాగేంద్రన్‌పై కేంద్ర బిజెపి నాయకత్వం సత్వరం పార్టీ నుండి సస్పెండ్ చేయాలని జాతీయ సిపిఐ కంట్రోల్ ఛైర్మన్ నారాయణ డిమాండ్ చేశారు. చిత్తూరులో ఆదివారం జాతీయ సిపిఐ కంట్రోల్ ఛైర్మన్ నారాయణ విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు టివికే అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని నైనార్ చేసిన వాఖ్యలను నారాయణ తీవ్రంగా ఖండించారు. తమిళనాడు టివికే అధినేత విజయ్‌పై రాజకీయంగా తగాదాలు పెట్టుకోవచ్చు కానీ వ్యక్తిగతంగా దూషణలు చేయడం సమంజసం కాదన్నారు. టివికే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితంను ప్రస్తావిస్తే అతనికి సినిమా హీరోయిన్‌తో సంబంధాలు వున్నాయని చెప్పడానికి నైనార్ నాగేంద్రన్ ఎవరని ప్రశ్నించారు. నైనార్ చేసిన వాఖ్యలు మహిళలను కించపరిచే విధంగా వున్నాయన్నారు. రాజకీయ విమర్శలు చేయాల్సిన చోట నటుడిపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడటం తగదని ఆయన మండిపడ్డారు. బిజెపి అధిష్టానం నైనార్ నాగేంద్రన్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## చేనేతలకు ఉచిత విద్యుత్

>> కుటుంబాలకు నెలకు రూ.720లు, ఏడాదికి రూ.8,640లు ఆదా కానుందన్నారు. మర మగ్గం నేసే నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా సరఫరా చేయనున్నామని, దీనివల్ల ఆయా కుటుంబాలకు రూ.1,800లు, ఏడాదికి రూ.21,600 ఆర్థికంగా మేలు చేకూరనుందన్నారు. 2014- 19 మాదిరిగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కూడా త్రిఫ్ట్ ఫండ్ నిధులు అందజేస్తున్నామన్నారు. గతంలో చేనేత సహకార సంఘాలకు పెట్టిన బకాయిలు కూడా చెల్లిస్తున్నామని వెల్లడించారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్లు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత నేతన్నలకు ఇచ్చే పెన్షన్ల మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని, నేటి వరకూ రూ.495 కోట్లు పెన్షన్ల రూపంలో అందజేశామని వెల్లడించారు.

## నేడు అమరావతికి బిల్ గేట్స్ రాక

>> చంద్రబాబు వివరిస్తారు. అనంతరం గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల అధికారులు సమావేశమవుతున్నారు. ఇందులో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై ముఖ్యమంత్రి ప్రజంటేషన్ ఇస్తారు.మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టుల గురించి సీఎం చంద్రబాబు గేట్స్ కు వివరిస్తారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి ఆయనకు వివరిస్తారు. అనంతరం అమరావతిలో ఉండవల్లి గ్రామం వద్ద ఓ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లనున్న బిల్ గేట్స్ బృందం, అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపట్టే సాగు విధానాన్ని పరిశీలిం చను న్నారు. అక్కడితో గేట్స్ టీమ్ పర్యటన పూర్తవుతుంది.

## స్టూడెంట్లకు 'నీట్' శిక్షణ

>> మనందరిపై ఉంది. ఆయన మన రాష్ట్రంలో జన్మించడం మన అదృష్టం. చిన్నతనం నుంచే సేవాలాల్ సామాజిక సేవతో మెలిగారు. ఎవరైనా ఆకలితో ఉంటే ఆయన వద్దనున్న ఆహారాన్ని పక్కవారికి ఇచ్చి ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి. జంతుబలిని వ్యతిరేకించారు. జంతువులను బలివ్వాలనుంటే ముందు నన్ను బలి ఇవ్వండని చెప్పారు. కానీ ఈ రోజుల్లో ఫోటోలకు జంతువులను బలిఇచ్చి హింసను సమర్థించుకునంటున్నార్తు అని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళా సమానత్వం గురించి మనం ఇప్పుడు మాట్లాడుకుంటున్నాం. ఆనాడే స్త్రీ సమానత్వ ఆవశ్యకతను సేవాలాల్ చెప్పారు. తన జీవితాన్ని అరణ్యవాసులు, సంచార జాతులకోసం కేటయించారు. సంచార జీవనం కాకుండా తండాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించారు. సాయం చేయడం, ప్రకృతిని ప్రేమించడంతో పాటు ధర్మాన్ని పాటించాలని హిత బోధ చేశారు. ఆయన అందరికీ ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తారు. అదే విధంగా పేదల కోసం పని చేసిన వ్యక్తి ఎన్టీఆర్. గిరిజన పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి ఉన్నత విద్యను అందించాలని గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత తండాలను అభివృద్ధి చేయాలని ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాం. గిరిజన ప్రాంతాలు మరింత అభివృద్ధి చేసేందుకు వారి ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నాం. అరకు కాఫీ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించింది. గిరిజన ప్రాంతాల్లో వనరులకు కొదవలేదు..వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసుతలు కల్పిస్తున్నాం. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించాం. సంత్ శ్రీ సేవాలాల్ లాంటి మహనీయుణ్ని నిత్యం తలచుకుని సమాజ హితం కోసం ప్రతి ఒక్కరం పని చేయాల్తి అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు మిరియాల శిరీషా దేవి, తోయక జగదీశ్వరి, చిర్రి బాలరాజు, గిరిజన నేతలు, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు శివరాత్రికి ఒక రోజు అదనంగా శెలవు సదుపాయం కల్పించింది.మహా శివరాత్రి పర్వదినం ఆదివారం వచ్చింది. ఆ మరుసటి రోజు సోమవారం ప్రభుత్వం ఉద్యోగులకు ఆప్షనల్( ఐచ్ఛికశెలువు) హాలిడేగా ప్రకటించింది రాష్ట్ర ప్రభుత్వం. ఈమేరకు సాధారణ పరిపాలనా శాఖ ఇవాళ జీవో విడుదల చేసింది. శివరాత్రి భక్తులు జాగారం చేయనున్న కారణంగా మరునాడు సెలవు తీసుకునేలా కూటమి ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించింది.హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. ఈ రోజును హిందువులు అత్యంత ఘనంగా జరుపుకుంటారు. శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా చెబుతుంటారు. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. శివరాత్రి రోజున రాత్రి జాగారం చేస్తుంటారు. అందువల్ల మరునాడు సెలవు తీసుకునేలా ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించింది.

## ఒడిశా ఆర్టీసి బస్సు బోల్తా ఏడుగురికి తీవ్ర గాయాలు

**సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా) :** ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :సాలూరు పట్టణ సమీపంలో ఒరిస్సా రాష్ట్రం నవరంగ్ పూర్ నుండి విజయవాడ వెళ్తున్న ఒరిస్సా ఆర్టీసీ బస్సు గత రాత్రి తెల్లవారుజాము 4 గంటల సమయంలో బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. ఆ వివరాలు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలియజేస్తూ ఈ ప్రమాద సమయంలో ఆర్టిసి డ్రైవర్ కండక్టర్ తో పాటు 31మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. అలాగే ఇందులో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయని హుటాహుటి న 108 వాహనంలో సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.అంతేకాకుండా ఇంకా ఇందులో ఒరిస్సా నుండి విశాఖకు భవన నిర్మాణ పనులకు వెళ్తున్న కూలీలలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## జాతీయ రహదారిపై బైక్ రైడర్ దుర్మరణం

### బాపట్ల ఈవెంట్‌లో పాల్గొని హైదరాబాద్ వస్తుండగా

### పెద్ద కాపర్తి వద్ద బైక్‌ను ఢీకొన్న వాహనం

**చిట్యాల రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సెలవు దినాల్లో దూర ప్రాంతాలకు బైక్ రైడింగ్ చేస్తూ తమ అభిరుచిని పంచుకుంటున్న బైక్ రైడర్స్ గ్రూప్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికంగా కలచివేసింది. చిట్యాల మండలం పరిధిలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బైక్ రైడర్ దుర్మరణం చెందాడు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ కు చెందిన చదురుప్పల రితీష్ రెడ్డి (40) ఏపీలోని బాపట్లలో హార్లే డేవిడ్సన్ మోటార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవెంట్‌కు హైదరాబాద్‌కు చెందిన ముప్పై రెండు మంది బైక్ రైడర్స్‌తో కలిసి రెండు రోజుల క్రితం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపుకు వస్తుండగా పెద్దకాపర్తి గ్రామ శివారులోని 7 హోటల్స్ సమీపంలో గుర్తుతెలియని వాహనం రితీష్ రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రితీష్ రెడ్డికి తలకు, శరీరానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రోహిత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. రూ. 25 లక్షల విలువ గల బీఎండబ్ల్యూ బైక్‌పై ప్రయాణిస్తున్న రితీష్ రెడ్డి హెల్మెట్ ధరించినప్పటికీ ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణాలను కోల్పోయాడు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, నియమిత వేగంతోనే ప్రయాణించాలని సూచించారు.

## మాజీ ఎంఎల్‌సి ఐలాపురం వెంకయ్య మృతి

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** బిసి నేత, సీనియర్ రాజకీయవేత్త, మాజీ ఎంఎల్‌సీ ఐలాపురం వెంకయ్య అనారోగ్యంతో కన్నుమూసారు.సుదీర్ఘకాలం కాంగ్రెస్‌పార్టీ నేతగా విజయవాడ నగరంలో పలు ఉద్యమాలకు వెంకయ్య సారథ్యం వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఆయన సన్నిహితునిగా పేరుపొందారు.రాజకీయంగా ఆయన కాంగ్రెస్ వాదిగా వ్యవహరించిన సందర్భంలోను ఇతర పార్టీల నేతలు, ప్రముఖులతో సత్సం బంధాలు కలిగి ఉన్నారు.1999లో విజ యవాడ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్పతేడా ఓడిపోయారు.బిసి ఉద్యమాల్లో వెంకయ్య అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. విజయవాడలో స్టార్ స్థాయి గుర్తింపుగా పొందిన ఐలాపురం హోటల్‌ను వెంకయ్య నిర్మాణం చేసారు.ఆయన కు మారుడు రాజా సమాచార హక్కు చట్టం కమీషనర్‌గా పనిచేసారు. ఐలాపురం వెంకయ్య మృతి పట్ల మాజీ సీఎం జగన్,జనసేన ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్,ప్రజాశాంతి పార్టీ నా యకుడు కెఏపాల్ కాంగ్రెస్‌నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, గుర్నాథంతదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.



ఐలాపురం వెంకయ్య (ఫైల్)

**ఐలాపురం వెంకయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి:** మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం వెంకయ్య నిరంతరం పనిచేశారని ముఖ్యమంత్రి అన్నారు. నిరాడంబర జీవితాన్ని గడు పుతూ, అందరితో సత్సంబంధాలు కలిగిన వెంకయ్య మృతికి చంద్ర బాబు సంతాపం తెలిపారు. వెంకయ్య కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఐలాపురం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవం తుడిని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పారు.

## పేషెంట్లను పిప్పి చేస్తున్న రిఫరల్ దందా

>> మరొక ఆసుపత్రికి వైద్యులు చేస్తున్న రెఫరెన్స్ ద్వారా 10 నుంచి 30 శాతం వరకూ కమిషన్లు ఇస్తూ ఉండగా, గ్రామీణ ప్రాంతంలో మటుకు 30 శాతం నుంచి 50 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నారు. సాధారణంగా ఒక రోగికి అయ్యేఖర్చులో పిఎంపి, ఆర్ఎంపీలకు ఇచ్చే కమిషన్ సొమ్మును అద నంగా చేర్చి వసూలు చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలకు ప్రతి ఆసుపత్రికి ఒక పిఆర్ఓఉంటారు. ఆసుపత్రుల పబ్లిసిటీబోర్డుల మీద సోషల్ మీడియాలో సైతంపిఆర్ఓల నంబర్లు మాత్రమే పొందుపరుస్తారు. గతంలో పీఎం పీలు మాత్రమే రిఫరెన్స్ ఇస్తూ ఉండగా గత పదేళ్ల నుంచి సమా జంలో గుర్తించబడిన కీలక వ్యక్తులు కూడా తమ సర్కిల్లో ఉన్న రోగులను రిఫరెన్స్ గాపంపించడం ద్వారా రోగులనుంచిసొమ్మును అడ్డంగా దండుకుంటున్నారు.

**పరీక్షలకు 40 శాతం కమీషన్:** గతంలో అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన రోగిని వైద్యులు పలు విధాలుగా పరీక్షి ంచి మెడిసిన్ రాసేవారు, అయితే ప్రస్తుత కాలంలో చిన్న అనారోగ్యానికి సైతం సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ అంటూ అత్యధిక ధరగల టెస్టులను రాసి వాటి నుంచి 40 శాతం వరకూ కమీషన్ సొమ్మును సంబంధిత రిఫరల్ కు ఇస్తున్నారని పలువురు సిబ్బంది బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వ వైద్యులు కూడా ప్రైవేటుగా ప్రాక్టీసు చేసుకోవచ్చు అనే షరతులకు లోబడిన స్వేచ్ఛ ఉన్న కారణంగా కొందరు వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను తమ ప్రైవేటు ఆసుపత్రికి తరలించుకోవడం అందరికీ తెలిసిన వాస్తవమే అంటున్నారు.

**కంప్యూటర్ వైద్యం:** చిన్న నలత వచ్చినా పరీక్షల మీద ఆధారపడుతున్న వైద్యులు 90శాతం వరకూ ఉన్నారని, వచ్చిన రిపోర్టుల ఆధారంగా అప్పటికే సిస్టంలో పొందుపరిచిన మందుల రకాలు రాసివ్వడం చాలాచోట్ల జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ల్యాబ్ టెస్టుల్లో వాల్యూల ఆధారంగా మందులు రాసిచ్చే సాఫ్ట్వేర్ అని కూడా కొందరు వైద్యులు కలిగి ఉన్నారనే ప్రచారం కూడా జరగటం గమనార్హం. ఇటీవల భీమవరంలో రిఫరల్ దందా మీద చిన్నపాటి ఉద్యమమే జరిగినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వారికి అందాల్సిన ముడుపులు ఆసుపత్రుల నుంచి పి ఆర్ ఓ ల ద్వారా కవర్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.భీమవరంలో ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్య శ్రీ) ద్వారా అనవసర ఆపరేషన్లు ఎక్కువ జరిగినట్లుగా కొందరికి నోటీసులు అందాయి వాటిలో ముఖ్యంగా హిస్టరెక్టమీ ( గర్భాశయం తీసివేసే సర్జరీలు) ఆపరేషన్లు అవసరం లేకుండానే 70 శాతం వరకు జరిగినట్లుగా లెక్కల్లో తేలాయి. ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ సర్వే ద్వారా సుమారు 8 శాతం మహిళలు తమ 25 నుంచి 49 వయసు మధ్యలో ఈ సర్జరీ చేయించుకున్నారని తేలింది. ఇదంతా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ సొమ్మును దోచేయడమే కాకుండా సంబంధిత రిఫరల్స్ కు ఆదాయం కోసమేనని అభిప్రాయాలు ఉన్నాయి. వైద్యంలో కమిషన్లు ఇవ్వడం, అనవ సర సర్జరీలు, టెస్టులు చేయడం వంటి చర్యలు చట్టపరంగా నేరమైనప్పటికీ యదేచ్ఛగా జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వీటిపై విచారణ జరిపి స్థానిక డిఎంహెచ్వో , నేషనల్ మెడికల్ కమిషన్ అధికారులు విచారణ జరిపి ఈ కమీషన్లను అరికట్టాలని కోరుతున్నారు.




ఆదివారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఆ పార్టీ కీలకనేత, డీసీఎం పవన్

## ప్రజల మధ్య ఉండి పనిచేస్తామనే నమ్మకమే 'జనసేన' పురోభివృద్ధికి కీలకం

### పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

### పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించిన జనసేన అధినేత

### రూ.2 కోట్లు విరాళం ఇచ్చి, తొలి సభ్యత్వం స్వీకరించిన పవన్

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల మధ్య ఉండి పనిచేస్తామనే నమ్మకమే జనసేన పార్టీ పురోభివృద్ధికి కీలకమని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొణి దెల స్పష్టం చేసారు.జెఎస్పీ కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలన్నారు.జనం మధ్య నుండి వారి సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారానికి శ్రమించాలన్నారు.,జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. సభ్యత్వ నమోదుకు రూ.2 కోట్లు విరాళం అందించి, తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని "ఉద్యమి"గా, పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని "సాధక్"గా, జనసేన పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేధా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని " ప్రదాత"గా ఇక నుంచి పిలుస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు.

150 మందితో పార్టీని ప్రారంభించాం. 2021లో మొదటి విడత క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90 వేలు నమోదు చేశాం. ఎన్నికల ముందు ఆ సంఖ్య ఆరు లక్షలకు చేరింది. ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించాం. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కూలి పనులు చేసుకునే వారు, చదువుకున్న వారు ఎంతో మంది ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యామన్నారు.

## 'కల్తీనెయ్యి'లో అధికారులే కీలకమా!

>> ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తుతోంది.

**ఏకసభ్యకమిటీ రాకముందే దుమారం:** రాష్ట్రప్రభుత్వం కూడా టిటిడి కల్తీనెయ్యి కేసును సీరియస్‌గానే తీసుకోవడంతో ఏకసభ్యకమిటీతో విచారణ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ఏకసభ్యకమిటీ నియామకం కాకముందే ,దర్యాప్తు మొదలుపెట్టకముందే మరింతమంది టిటిడి ఉద్యోగులు తెరపైకి వస్తుండటంతో అందరిలోనూ ఆందోళనకలిగిస్తోంది. అదేగాక తిరుమల లడ్డూలకు 2019-24మధ్యకాలంలో నెయ్యిసరఫరా టెండర్లు దక్కించుకుని చివరకు కల్తీనెయ్యి పంపిన కేసు విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయనే సంచలన వ్యాఖ్యలు ఎక్కడకు దారితీస్తుందనేది ఉద్యోగ వర్గాలు కలతచెందుతున్నారు.

ఈ వ్యవహారంలో పాత్రధారుల్ని తేల్చేసిన సిట్ సూత్రధారులను గుట్టువిప్పేసుంటే ఈ రాద్ధాంతం ఉండదనేది ఉద్యోగులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి సరఫరా వివాదంలో పూర్వ టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌పై బదలీ వేటువేసిన ప్రభుత్వం టిటిడి ఎఫ్ఎసిఎఒ ఓ.బాలాజీపై చర్యలు తీసుకోకముందే ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళిపోయారు.

అయితే దేశం వదలి వెళ్ళకముందే ఆయన్ను అదుపులోకి తీసుకుని ఆయన నుండి మరింత ఆర్థిక లావాదేవీలు, నెయ్యిసరఫరా గుత్తేదారులకు బిల్లులు మంజూరుచేయడం వంటి కీలక సమాచారం రాబట్టి అసలు దోషులను తేల్చాలని ఉద్యోగుల వాదన. కాగా టిటిడి ఎఫ్ఎసిఎఒగా అదనపు బాధ్యతల్లో అదనపు ఎఫ్ఎసిఎఒ రవిప్రసాద్ నిర్వర్తిస్తున్నారు.

### వారం - వర్జ్యం

16-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
చతుర్దశి సా.5.30
శ్రవణ రా.8.44
వర్జ్యం : రా.12.48-2.26
దు.ము.12.46-1.32
2) ము.3.05-3.51
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం:** అనూహ్యంగా స్థిరాస్తుల ధరలు పెరుగుతాయి. రహస్యచర్చలు ఫలిస్తాయి. ఇతరులను ఆదుకుంటారు.

**వృషభం:** జీవితభాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. అనుకోని ఆహ్వానాలు అందుతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఎంతో శ్రమిస్తేగాని ఫలితం దక్కదన్న సత్యాన్ని తెలుసు కుంటారు. రాజకీయత్నాలు ఫలిస్తాయి.

**కర్కాటకం:** దైవం తోడు ఉంటే కాలం కలిసివస్తుందని సమయం కోసం వేచి ఉంటారు.శ్రమ అధికంగా వుంటుంది.

**సింహం:** సంతాన అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు. పూర్వంకన్నా భిన్నంగా ప్రవర్తిస్తారు. వస్తువులు కొనుగోలుచేస్తారు.

**కన్య :** దైనందిన జీవితంలో మార్పులు చేస్తారు. ఆ మార్పులు కలిసివస్తాయి. సొంత ఆలోచనలు మేలుచేస్తాయి.

**తుల :** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో వద్దనుకున్న అవకాశాలు తిరిగి అనుకూలం చేసుకుంటారు.

**వృశ్చికం:** పలు విషయాలలో అభిప్రాయ భేదాలు వాగ్వివాదాలు సంభవించడం చికాకు కలిగిస్తుంది.

**ధనుస్సు:** ఆరోగ్యపరంగా తీసుకునే జాగ్రత్తలు మంచి ఫలితాలనిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు.

**మకరం:** కలిసివచ్చిన, పొదుపుచేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకోవలసి ఉంటుంది.శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** మీ కృషివల్ల మీరు సుఖపడక పోయినా మీవాళ్ళు సౌఖ్యంగాఉంటారు. ఇతరులకు సాయంచేసి విరోధి అవుతారు.

**మీనం:** వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రభుత్వ విధానాలు ఆందోళన కలిగిస్తాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## టెన్త్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

### ఏప్రిల్ 4 నుంచి 10వ తరగతి మూల్యాంకనం

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. అయితే విద్యాశాఖ తాజాగా ఈ పరీక్షల షెడ్యూల్‌లోనూ ఓ మార్పు చేసింది. ఉగాది, రంజాన్ పండుగల కారణంగా ఇంగ్లీష్ పరీక్షను మర్చి 21కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది షెడ్యూల్ ప్రకారం ప్రతీ పరీక్ష తర్వాత ఒకరోజు విరామం వచ్చింది. దీంతో విద్యార్థులు ఎంతగానో సంతోషిస్తున్నారు. ఇది వారికి ఎంతో ప్రయోజనకరం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, జీవశాస్త్రం, సామాజిక శాస్త్రం వంటి ప్రధాన సబ్జెక్టులు అన్నింటికీ మధ్యలో విరామం ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. దీని వల్ల ప్రతి పరీక్ష పూర్తి అయ్యాక విద్యార్థులు తదుపరి సబ్జెక్టు పై దృష్టి పెట్టేందుకు సమయం దొరుకుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి సబ్జెక్టులను మళ్లీ చదువుకోవడానికి, చదివిన వాటిని మర్చిపోకుండా ఉండేందుకు ప్రాక్టీస్ చెయ్యడానికి ఈ విరామం ఎంతోగానో ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.

ఇక 10వ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 4 నుంచి 13 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాలు జారీ చేసింది. మూల్యాంకన సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా విద్యాధి కారులకు పలు సూచనలు చేసింది. మూల్యాంకనంపై ఏప్రిల్ 4న నిర్వహించే అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొంది. ఈ ఏడాది నుంచి మూల్యాంకనం కేంద్రాల్లోను కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.



## గ్రామీణ పేదరిక నిర్మూలనకు రూ.1,872.23 కోట్లు

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,872.23 కోట్లు కేటాయించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.143 కోట్లు అధికంగా కేటాయించడం, స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారిత, గ్రామీణ జీవనోపాధుల పురోగతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ప్రభుత్వం సిబ్బంది, సెర్ప్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలు, గ్రామ సంఘాల సహాయకులకు గౌరవ వేతనాలు, అలాగే సెర్ప్, డిఆర్‌డిఏ కార్యాలయాల నిర్వహణ కోసం మొత్తంగా రూ.464.99 కోట్లు కేటాయించారని తెలిపారు. అదేవిధంగా దీనదయాల్ అంత్యోదయ యోజన- జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రూ.818 కోట్లు, స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రైజ్ ప్రోగ్రామ్ కింద రూ.30 కోట్లు, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోసం రూ.15 కోట్లు కేటాయించారని తెలిపారు. దీనదయాల్ అంత్యోదయ యోజన - జాతయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రాష్ట్రానికి లభించే వాస్తవ వేటాయింపుల ఆధారంగా అదనంగా రూ.1200 కోట్లు వరకు పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్లు మంత్రి తెలిపారు. దీంతో 2026-27 సంవత్సరంలో మొత్తం రూ.3000 కోట్ల వ్యయంతో స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధుల మెరుగుదల, ఆదాయ వృద్ధి మరియు స్థిరమైన ఉపాధి అవకాశాల సృష్టిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త మహత్తర లక్ష్యసాధనలో భాగంగా సుమారు 5లక్షల మహిళలను ఔత్సాహికులుగా తీర్చిదిద్దడం, అలాగే రైతు ఉత్పత్తి సంస్థలు ను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే గణనీయంగా అధిక బడ్జెట్ కేటాయించడమే కాకుండా, దీనదయాల్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా లభించే నిధుల ఆధారంగా మొత్తం వ్యయాన్ని రూ.3000 కోట్ల వరకు విస్తరించేందుకు దృఢ నిశ్చయంతో ముందుకు వస్తున్న ముఖ్యమంత్రికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుమల సమాచారం



### క్షేత్రపాలకుడు రుద్రుడికి విశేష పూజలు

తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం కొండల్లోని తిరుమలక్షేత్ర పాలకుడు రుద్రుడు కొలువై పూజలు అందుకుంటున్నాడు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం గోగర్భం డ్యామ్ సమీపంలో ఉన్న రుద్రుడికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా పర్వదినాన ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు కాలినడకన క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు. కొబ్బరినీళ్ళు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఆ తరువాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం పారుపత్తేదార్ హిమత్‌గిరి, అదనపు ఇఒ కార్యాలయం సూపరింటెండెంట్ రామచంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ నిర్మాణానికి బడ్జెట్ పునాది



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్ అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై అధికార ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సమ్మిళితం చేస్తూ ప్రజలకు వివరించాలని సూచించారు. ఎపి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్. సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా బడ్జెట్ రూపొందించారు. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించడం సాహసోపేతమైన చర్య. రెవెన్యూ లోటును 1.86 శాతానికి పరిమితం చేయడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. వికసిత్ ఎపి ద్వారా వికసిత్ భారత్ నిర్మాణానికి ఈ బడ్జెట్ పునాది వేస్తోంది అని మాధవ్ అన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'శాసనసభలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. సంకల్పం ఉన్నచోట సాధనకు మార్గముంటుందన్నట్లుగా నేటి బడ్జెట్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఉంది. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ఈ బడ్జెట్ ను భావించొచ్చు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల్లో మైనార్టీలకు పెద్దపీట వస్తోంది. గత ప్రభుత్వం చెల్లించకుండా పెట్టిపోయిన ఇమాం, మోజన్ల గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించింది. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి హాజీకి లక్ష రూపాయలు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రధానమంత్రి జన్ వికాస్ యోజన ద్వారా రాష్ట్ర మైనార్టీల సంక్షేమానికి రూ.300 కోట్లు మంజూరు అయింది. ఉర్దూ భాషాభివృద్ధి, తదితరవాటికి రూ.7.78 కోట్లు కేటాయించాం. ఉర్దూ ఘర్, ఉర్దూ లైబ్రరీల అభివృద్ధికి రూ. 2.85 కోట్లు కేటాయించాం. మైనార్టీ నిరుద్యోగులకు నిష్ణాతులచే కోచింగ్ ఇప్పించి, వారిని ప్రయోజకులను చేయడానికి రూ.3.97 కోట్లు కేటాయించాం. ఉర్దూని రెండవ మాతృభాషగా ప్రకటించి గాలికొదలేసిన వైసీపీ ప్రభుత్వంలా కాకుండా ఉర్దూను అభివృద్ధి చేయాలి, ఉర్దూ పాఠశాలల్ని అభివృద్ధి చేయాలి, ఉర్దూలో చదువుకునే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉర్దూ అభివృద్ధికి రూ. 7.83 కోట్లు కేటాయించడం జరిగింది. మైనార్టీలకు పెద్దపీట వేస్తూ.. తల్లికి వందనం పథకాన్ని 15 శాతం మైనార్టీలకు కేటాయించడం జరిగింది. సామాజిక పెన్షన్ల పంపిణీలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నాం' అని వివరించారు.

## కోవా బన్ వలీకి అండగా ఉంటామన్న మంత్రి లోకేష్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని, ఫుడ్ జిహాద్ చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతే కాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోపై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. "ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది" అని లోకేశ్ పేర్కొన్నారు.

అంతేకాకుండా, "త్వరలో మిమ్మల్ని కలిసి మీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురు చూస్తున్నాను! మనమంతా కలిసి ఉందాం" అంటూ వలీకి భరోసా ఇచ్చారు. లోకేశ్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



### భోగితేరుపై భోలాశంకరుడు

తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన భక్తులు భారీగా దర్శనానికి వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి వేడుక కావడంతో ఉదయం నుండి ఆలయం హరహరమహాదేవ శంభోశంకర, నమఃశ్శివాయ నామంతో మిన్నంటింది. మహాశివరాత్రి వేడుకలు కపిలేశ్వరుని ఆలయంలో అధికారులు అత్యంత కన్నులపండువగా జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవలో కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు నిత్య కైంకర్యాలు ముగించుకుని ఆలయంలోపల భోగితేరును అధిరోహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లకు కర్పూర హారతులిచ్చారు. భోగితేరు ఆలయ పురవీదుల్లో భక్తుల ఓం నమ: శివాయ నామస్మరణలతో కదిలింది. భజన మండళ్ళ కోలాటలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా సాగింది. ఆత్మ రధికుడు, శరీరమే రథం. బుద్ధి సారధి, మనస్సు పగ్గం. ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. అనంతరం స్వామిఅమ్మవార్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఉపచారాలు జరిపించారు. రాత్రి అధికార నందివాహనంపై సోమస్కంధమూర్తి అధిరోహించి భక్తులను కటాక్షించారు. నంది స్వామివారికి వాహనం. ఈ వాహనసేవల్లో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, విఎస్ఒ అల్లం సురేంద్ర, అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్, ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ హామీల ప్రస్తావనేదీ?



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడాయి బడ్జెట్‌గా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధికి సమతుల్యత లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇంకా కదలిక లేకుండా పోయిందని, మిగిలిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారనే ప్రస్తావన లేదన్నారు. నిరుద్యోగులను, మహిళలను, రైతులను, ఉద్యోగులను ఈ బడ్జెట్ మోసగించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు 72శాతం పూర్తయ్యిందని గతంలో ప్రకటించుకున్న ప్రభుత్వం ఇప్పుడు 60 శాతమే పూర్తయ్యిందంటూ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చాలా తక్కువన్నారు. ఏ ప్రాధాన్యతా రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేదన్నారు. బడ్జెట్ పూర్తిగా రాష్ట్ర ప్రజల ఆశలను ఒమ్ము చేసిందన్నారు.

## బడ్జెట్ అంతా అభూత కల్పనలే

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కొత్త సీసాలో పాత నీరు అన్న చందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. బడ్జెట్ అంతా ఊహాజనితం, అభూత కల్పనలేనన్నారు. ఎపి ప్రభుత్వానికి పేద, మధ్య తరగతి వర్గాలపై ప్రేమలేదన్నారు. వారి సంక్షేమానికి తగిన నిధులు కేటాయించలేదని "ఎక్స్"లో చేసిన పోస్టింగ్‌లో షర్మిల పేర్కొన్నారు. ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించి, సూపర్‌సిక్స్ హామీలకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. ఇంది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం అని మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి ప్రస్తావన లేకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వడ్డీలేకుండా రూ.10 లక్షల వరకూ రుణాలు అని చెప్పి ఒక్క రూపాయి కేటాయించలేదని తెలిపారు. 50 లక్షల మంది నిరుద్యోగులను మరోసారి మోసం చేశారని పేర్కొన్నారు.

## కోవా బన్ వలీకి ఎమ్మెల్సీ నాగబాబు రూ.25 వేలు ఆర్థికసాయం

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని చిరు వ్యాపారులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు భరోసా ఇచ్చారు. పొట్టకూటి కోసం మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్న వలీ అనే చిరు వ్యాపారిని కొందరు భయభ్రాంతులకు గురిచేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచివి కాదని ఆయన హితవు పలికారు. ఈ దాడి ఘటన తర్వాత ఎందరో చిరువ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారని నాగబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. దాడి కారణంగా శివరాత్రి నాడు తాను వ్యాపారం చేసుకోలేకపోయానని బాధిత వ్యక్తి వలీ ఆవేదన వ్యక్తం చేయగా, అతనికి వ్యక్తిగతంగా రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించినట్లు నాగబాబు తెలిపారు. వలీ వంటి ఎందరో చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దాడిని మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, ఎకొండపల్లి శ్రీనివాస్ కూడా ఖండించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు మతపరమైన రంగు పులమవద్దని నాగబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిరువ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతపై ఏమైనా సందేహాలుంటే, దానిని పరిశీలించడానికి ఫుడ్ సేఫ్టీ అథారిటీలు ఉన్నాయని, సంబంధిత అధికారులను సంప్రదించాలి తప్ప దాడులకు పాల్పడటం సరికాదని సూచించారు. దేశంలో కోట్ల మంది తమ కాళ్లపై తాము నిలబడాలనే సంకల్పంతో వ్యాపారాలు చేస్తున్నారని గుర్తుచేశారు. పట్టణ ప్రాంతాల్లో 40శాతానికి పైగా పేద ప్రజలు వీరు విక్రయించే ఆహారంపైనే ఆధారపడతారని, అలాంటి వారిని కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత అని నాగబాబు వివరించారు.

### శ్రీవారి అనుగ్రహంతో శుభాలు



తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో అందరికీ శుభాలు కలగాలని, అందరూ సంతోషంగా ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినాన ఆదివారం ఉదయం ప్రభుత్వ విప్ గణబాబు, మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, ఎమ్మెల్యే గ్రీష్మ, ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజు కుటుంబంతో కలసి శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కన్నుల పండువగా మల్లన్న పాగాలంకరణ

- కమనీయం శ్రీ స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం
- నంది వాహనాధీశులైన శ్రీ స్వామి అమ్మవారు
- ఆది దంపతులకు వైభవంగా కల్యాణం



పాగాలంకరణతో మల్లన్న ఆలయం(ఫైల్ ఫోటో)

శ్రీశైలం ప్రాజెక్ట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నికదీక్షతో పదకొండురోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఎనిమిదవ రోజైనా ఆదివారంనాడు శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. అనంతరం లోక కళ్యాణం కోసం జపాలు,పారాయణలు చేశారు. అనంతరం మండపారాధనలు పంచావరనార్చనలు, జపాను స్టానాలు. రుద్ర హోమం, చండీ హోమం, కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంకాలం ప్రదోషకాల పూజలు, జపాను స్థానాలు,రుద్ర పారాయణలు హోమాలు జరిపించబడ్డాయి.

**కమనీయం మల్లన్న ప్రభోత్సవం:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంకాలం శ్రీ స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో రథానికి చేసినట్లుగానే ప్రభోత్సవములో కూడా ప్రభకు పలు రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేయడం జరిగింది. ప్రభోత్సవములో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, కేరళ చండీ మేళం, కొమ్ము కొయ్య నృత్యం, ముంబాయి డోల్ తాషా, మహిళ వీరగాసి, కన్నడ జానపద కళా ప్రదర్శన, పురుషులు వీరగాసి కన్నడ కళా ప్రదర్శన, కాలిక నృత్యం, జానపద పగటి వేషాలు, గోరవయ్య నృత్యం, బుట్ట బొమ్మలు, తప్పెటచిందు, బీరప్ప డోలు, నందికోల సేవ, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోని, డోలు విన్యాసం, తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయడం జరిగింది, ఆలయ రాజ గోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నందిమండపం, బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు కొనసాగింది. పుష్పపల్లకిపై దర్శనం ఇచ్చిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించి మురిసిపోయారు. గ్రామోత్సవములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, అధికారులు, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

**నంది వాహనాధీశులైన శ్రీ స్వామి అమ్మవార్లు:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వాహన సేవలలో భాగంగా ఆదివారం నాడు శ్రీ స్వామి అమ్మవార్లకు నంది వాహన సేవ మరియు ఆలయ ఉత్సవం నిర్వహించారు. లింగోద్భవ కాల మహారుద్రాభిషేకం: మహా శివరాత్రి పర్వదినంను పురస్కరించుకొని ఆదివారము నాడు రాత్రి పది గంటల నుండి శ్రీ స్వామివారికి లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం జరిపించారు. నిష్ణాతులైన 11మంది అర్చక స్వాములు మహన్యాస పూర్వకంగా రుద్రమంత్రాలను పఠిస్తుండగా దాదాపు నాలుగు గంటలకు పైగా జ్యోతిర్లింగ స్వరూపుడైన శ్రీ స్వామి వారికి అభిషేకం జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికా గుండములోని జలంతోనూ, పంచామృతాలతోనూ,పలు ఫలోదకాలతోనూ అభిషేకం చేశారు. పెళ్లి కుమారునికి పాగాలంకరణ: లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంభించబడింది. బ్రహ్మోత్సవాలలో జరిగే ఈ పాగాలంకరణ ఎంతో ప్రత్యేకత ఉంది. మన వివాహాల్లో పెండ్లి కుమారునికి తల పాగా చుట్టడం ఒక సాంప్రదాయం. ఈ ఆచారమే శ్రీశైలం ఆలయములో పాగాలంకరణ పేరుతో ఆనువాయితీగా కొనసాగుతుంది. ఈపాగ స్వామివారి గర్భాలయ విమాన శిఖరము నుండి ముఖమండపంపై ఉండే నందులను అనుసంధానం చేస్తూ అలంకరించడం జరిగింది.పాగలను సమర్పించే భక్తులు నియమంతో భక్తిని మేలవించి రోజుకు ఒక మూర చొప్పున సంవత్సరములు 365 మూరల పొడవుతో ఈ పాగాను నేస్తారు. ఈ పాగాలంకారాలను అలంకరించే వ్యక్తి దిగంబరుడై పాగను అలంకరిస్తాడు. దిగంబరుడై పాగను అలంకరించవలసి ఉన్నందున పాగాలంకరణ సమయములో ఆలయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. చిమ్మ చీకటిలో పాగ లంకరణ చేయడం ఎంతో నేర్పుతో కూడుకున్న పని. యధావిధిగా రాత్రి 10 గంటల నుండి ప్రకాశం జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పృధ్వి వెంకటేశ్వర్లు తనయుడు పృధ్వి సుబ్బారావు స్వయంగా తెచ్చిన పాగతోపాటు ఇతర భక్తులు సమర్పించిన పాగలను కూడా స్వామివారికి అలంకరించారు.

**ఆది దంపతులకు ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం:** రాత్రి గం.12:00 లకు స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. కన్నుల పండుగ జరిగిన ఈ కల్యాణోత్సవములో స్వామివారు పట్టు వస్త్రాన్ని ధరించి తలపై ఒకవైపు గంగమ్మను, మరోవైపు నెలవంకను, మెడలో రుద్రాక్షమాలను, నుదుట విభూది రేఖలను, పట్టు వస్త్రాలను ధరించి పెండ్లి కుమారుడుగా ముస్తాబు అయ్యారు. కాగా అమ్మవారు కూడా పట్టు వస్త్రాలను ధరించి నుదుట కల్యాణ తిలకాన్ని బుగ్గన చుక్కను సర్వాభారణాలను ధరించి పెండ్లి కుమార్తె అయి స్వామికి సరి జోడి అనిపించుకున్నారు. మంగళ సూర్యనాదాలతో వేదమంత్రాల నడుమ నేత్రానందంగా ఈ కళ్యాణోత్సవం జరిగింది. అంతకు ముందు కంకణాలను స్వామి అమ్మవారి ఆభరణాలను యజ్ఞోపవీతానాన్ని బాషీకలను ఊరేగింపుగా కళ్యాణ వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. ఈ కల్యాణోత్సవములో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా అర్చక స్వాములు కల్యానోత్సవం సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కల్యాణత్సవం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ జరిపించబడింది. ఆ తరువాత వృద్ధి అభ్యుదయాల కోసం పుణ్యాహవాచనం చేశారు. తర్వాత స్వామివారికి మధువర్కం సమర్పించబడి శ్రీ స్వామి అమ్మవార్లకు వస్త్రాలను సమర్పించబడ్డాయి. తరువాత భాషికా ధారణ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత గౌరీ పూజ జరిపించబడింది. స్వామి అమ్మవార్ల మధ్య తెర సెల్లను ఏర్పరచి మహా సంకల్ప పట్టణం చేయడం జరిగింది. అనంతరం సుముహూర్త సమయములో స్వామి అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం సమర్పించారు. ఆ తరువాత మాంగల్య పూజలు జరిపించి అమ్మవారికి మాంగల్య ధారణ జరిపించబడింది. తరువాత తలంబ్రాలు బ్రహ్మముడి కార్యక్రమాలను జరిపి భక్తులకు ఆశీర్వచనాన్ని అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ శరణ్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ ఆజాద్, ప్రజా ప్రతినిధులు అధికారులు, అర్చక స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హరహర మహాదేవ.. శంభో శంకరా

### శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శివనామస్మరణ



క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్త జనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరునికి ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేకువ జాము 2గంటల నుంచే ఆలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి సుబ్బారాయుడు, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వారి సిబ్బంది తిష్టవేసి భక్తులకు సుదర్శనం కోసం ప్రయత్నించారు. డిఎస్పీ నరసింహామూర్తి, ఇక్కడ గతంలో పనిచేసిన పోలీసు అధికారులు తిమ్మయ్య, నాగార్జున్‌రెడ్డి, సంజీవ కుమార్‌లను కంచుగడప వద్ద నియమించటంతో వివాదాలకు అతీతంగా భక్తులు దర్శనానికి వెళ్ళారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సాదాసీదాగా ఓ సామాన్య భక్తుని వలె పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ గర్భగుడిలో ఆగమశాస్త్ర పండితుల సూచనల మేరకు దర్శనాన్ని సుమగమం చేసారు. ఇఓ చొరవ, కలెక్టర్ పర్యవేక్షణలో వచ్చిన భక్తులు శివరాత్రి వేళ స్వయంభువును దర్శించుకున్నారు. భక్తజనం వేకువ జామున సువర్ణముఖి నదిలో చన్నీటి స్నానమాచరించి 'కామ్యగోపురం ద్వారా భక్తజన కోటి 'కైలాసనాథ కరుణించవయ్యా అంటూ' స్వయంభువుని దర్శించుకున్నారు. 'హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.

### ఓంకార జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో...



తిరుపతి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఆదిదేవుడు పరమేశ్వరుడు మహాశివరాత్రి పర్వదినం ఎంతో విశిష్టమైందని, ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో ఆది వారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదళ్ళచెరువు గ్రామంలో వెలసిన పురాతన ఓంకార జ్యోతిర్లింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి భక్తులు అభిషేకించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, వజ్ర ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుపతి బిజెపి జిల్లా నేత, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కుటుంబసభ్యులతో హాజరై స్వామివారికి సారే సమర్పించారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. క్యూలైన్లలో వచ్చిన భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మహాశివరాత్రి పర్వదినాన ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి అలంకారంలో పరమేశ్వరుడ్ని, పార్వతీదేవిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్నారు. భక్తులకు అన్నీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం వేడుకగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కృష్ణయ్యస్వామి, చంద్రశేఖరస్వామి, సూరా రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, శింగంశెట్టి సుబ్బరామయ్య, లోక ప్రభాకర్ నాయుడు, రెడ్డప్ప, జ్యోతి, అరుణ, చంద్ర, అమారావతమ్మ, లక్ష్మి, కల్యాణి, భక్తులు పాల్గొన్నారు.



## అన్ని ఆలయాలకూ రోడ్డు సౌకర్యం

### - శివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధాని మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఆలయాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆ పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తులందరికీ పవన్ కల్యాణ్ మరోసారి శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షి ంచారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పుణ్యభూమి అని పవన్ కల్యాణ్ కొనియాడారు. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం, శ్రీకాళహస్తి వాయులింగ క్షేత్రం, పంచారామ క్షేత్రాల విశిష్టతను గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆలయాల పవిత్రతను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

### ప్రభుత్వ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 ప్రముఖ శైవ క్షేత్రాల్లో ప్రభుత్వం అధికారికంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తోందని, ఇది తమ ప్రభుత్వ భక్తి భావానికి నిదర్శనమని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

శ్రీకాళహస్తి గిరి ప్రదక్షి ణ మార్గంలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాం. కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షి ణ మార్గం రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు.

16-2P􀀀g7exHMNWJQE.qxd:16-2P􀀀g7exHMNWJQE.qxd 1/1/02 6:20 AM Page 1





# ఆకాశాన్నంటిన పళ్ల ధరలు!

## సాధారణ రోజుల్లో కంటే మూడింతల ధరలు పెంచిన వ్యాపారులు

## డజన్ అరటిపండ్ల ధర రూ.100కిపైగా

## కొబ్బరికాయలు సైతం రూ.50 పైనే

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మహా శివరాత్రి పర్వదినం రోజున సామాన్య భక్తులకు పండ్ల ధరలు చుక్కలు చూపించాయి. సాధారణంగా పండుగలు వస్తున్నాయంటే మార్కెట్‌లో పండ్ల ధరలు కొద్దిగా పెరగడం సాధారణమే. కానీ ఈ శివరాత్రి పండగ సందర్భంగా పండ్ల పండ్ల ధరలు అమాంతం ఆకాశాన్నంటాయి. ఆదివారం నాడు మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో పండ్ల వ్యాపారస్తులు పండ్ల ధరలను అమాంతం పెంచి ప్రజల జేబులను ఖాళీ చేశారు. సాధారణ రోజుల్లో కంటే పండ్ల ధరలు మూడింతల మేర పెరగడంతో ఉపవాసం ఉన్న సామాన్య, పేద భక్తుల జేబులు ఖాళీ అయ్యాయి. సాధారణ రోజుల్లో రూ.40 ధర పలికన డజన్ అరటిపండ్లు ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా డజన్ రూ.100కు పైగా పెరిగాయి. పుచ్చపండు రూ.100 నుండి రూ.160, ద్రాక్షపండ్లు కిలో రూ.200, ఆపిల్స్, ఆరెంజ్ పండ్లను రూ.100కు 3 చొప్పున విక్రయించారు.

అలాగే జామ పండ్లను కూడా కిలో రూ.140 చొప్పున అమ్ముతూ జనాలను వ్యాపారులు అందినకాడికి దోచుకున్నారు. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని చిలకలగూడ-సీతాఫల్‌మండి ప్రాంతంలో భక్తుల రద్దీతో ఆదివారం పండ్ల మార్కెట్‌లు, రహదారులు కిక్కిరిసిపోయాయి. ఉపవాస దీక్షలు, శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించేందుకు అవసరమైన పండ్లు, కొబ్బరికాయలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చిలకలగూడ చౌరస్తా నుంచి సీతాఫల్మండి ఫ్లైఓవర్ వరకు రహదారి మొత్తం సందడిగా మారింది. రోడ్డు ఇరువైపులా తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేసిన చిరు వ్యాపారులు పండ్లు, కొబ్బరి కాయలు, అరటిపండ్లు, సేపులు తదితర వస్తువులను విక్రయించారు. అయితే, పండుగ రద్దీనిఅదనుగా భావించిన వ్యాపారులు ధరలను అమాంతం పెంచినట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ రోజుల్లో రూ.30-40కి లభించే అరటిపండ్లు డజన్‌కు రూ.120దాకా వసూలు చేశారు. ఇక కొబ్బరికాయలు కూడా రూ.10-15 వరకు అధిక ధరలకు అమ్ముడయ్యాయి.

యాపిల్స్, ద్రాక్ష వంటి పండ్ల ధరలు కూడా ఆకాశాన్నంటడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో శివరాత్రి పండుగ సందర్భంగా భక్తుల గిరాకీ పెరగడం సహజమేనని, కానీ మూడింతల ధరలు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సామాన్య ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మహాశివరాత్రి పండుగ నాడు పండ్లు కొనాలంటేనే భయం వేస్తుందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పండ్ల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. సాధారణ రోజుల్లోనూ వివిధ రకాల పండ్ల ధరలపై సంబంధిత అధికారులు నిఘా ఉంచాలని, ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

## ముఖ్యమంత్రి గోత్రనామాలతో అర్చన కార్యక్రమం నిర్వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ఖమ్మం ప్రధాన ప్రతినిధి, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగి పోయాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఓం నమశ్శివాయ జపాలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక కాంతితో నిండిపోయాయి. పరమేశ్వరుడి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూల్లో నిల్చొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని మధిరలో గంగా, పార్వతీసమేత మృత్యుంజయ స్వామి ఆలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు ప్రజల శ్రేయస్సు కోరుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు గోత్రనామాలతో అర్చనలు, అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రజా పాలనలో అమలుజరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఆటం కాలు కలుగకుండా విజయవంతం కావాలని, పాలకవర్గంపై స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. అలాగే కూసుమంచి మండలంలోని అతి పురాతన శైవ క్షేత్రమైన ఘనపేశ్వరాల ఆలయం, ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సంగేశ్వ రాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేములవాడలోని ప్రసిద్ధ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామివారికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించి భీమేశ్వరుని ఆశీస్సులు కోరారు. నల్గొండ జిల్లా పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని స్వామివారి కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళ్లచెరువులోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. యాదగిరిగుట్టలోని లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంకు భక్తులు ఇరుముడులతో తరలివచ్చి అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల్ జిల్లాలోనూ పలు శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. జగిత్యాల జిల్లాకు చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ సూదిపై నాగుపాము పడగ నీడలో కూర్చుని ఆశీర్వదిస్తున్న శివయ్య విగ్రహాన్ని రూపొందించి ఆధ్యాత్మిక స్ఫూర్తిని చాటాడు. హైదరాబాద్ వనస్థలిపురంలోని భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, రుద్రార్చనలు కొనసాగాయి. భక్తులకు స్వామివారిని స్వహస్తాలతో తాకే అవకాశం కల్పించడంతో ఆనందభాష్పాలతో వారు పరవశించారు. మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రం అంతటా భక్తి, శాంతి, ఆధ్యాత్మిక ఉల్లాసం పరుచుకుని, శివతత్త్వ సందేశం ప్రతి హృదయంలో ప్రతిధ్వనించింది.



పురవీధుల్లో ఇంద్రవిమానం, సప్పరంపై దర్శనం ఇస్తున్న స్వామి అమ్మవార్లు

### రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పరమశివుని వేడుకున్నా

**వైరా రూరల్:** రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగి,, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆకాంక్షించారు. ప్రపంచంతో పోటీపడి స్థాయిలో తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి!!! త్రి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను దాటి స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆ పరమశివుని వేడుకున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం



జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని ప్రసిద్ధశ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన దర్శించు కున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆపరమశివుడిని ప్రార్థించినట్లు భట్టి పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు లేకుండా పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు.

### ఇంద్రవిమానంపై శ్రీకాళహస్తీశ్వరుడు

**శ్రీకాళహస్తి, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన విశిష్ట వాహనమైన ఇంద్ర విమానంపై శ్రీకాళహస్తీశ్వరుడు భక్తజనానికి దర్శనం ఇచ్చారు. 12 సంవత్సరాలకోసారి శనివారం త్రయోదశి మాస శివరాత్రి, మహా శివరాత్రి వస్తుందని నమ్మకం. ఆరోజు ఈ యేడాది వచ్చింది. భక్తజన కోటిని అను గ్రహిస్తూ ఇంద్రవిమానంపై సర్వేశ్వరుడు విహరించారు. శనివారం ఉదయం స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో విశిష్ట అలంకారం చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య తీసుకువచ్చి స్వామివారిని ఇంద్రవిమానంపై, అమ్మవారిని సప్పరంపై కొలువుదీర్చి పట్టణపురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవాన్ని కనులపండువగా

## రూ.7.39 లక్షల కోట్లకు చేరిన రుణాలు

# నాబార్డుకు సర్కార్ బకాయిల భారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు)కు ప్రభుత్వ రుణభారం తలకు మించిన భారంగా తయారయింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అప్పుల భరీగా పెరుగుతుండటం పట్ల నాబార్డు ఆందోళన చెందుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగినంత వేగంగా రుణ భారం కూడా భారీగా పెరుగుతోందని నాబార్డు వెల్లడించింది. ఇటీవల నాబార్డు విడుదల చేసిన రాష్ట్ర ఫోకస్ పేపర్‌లో పలు ఆర్థిక విషయాలను గూర్చి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.

ఇందులో భాగంగా 2014-15లో ప్రభుత్వ రుణ భారం రూ.72,658 కోట్లు ఉండగా, అది 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.7,38,707 కోట్లకు చేరింది. ఇదే సమయంలో రాష్ట్ర తలసరి ఆదాయం ఈ పదేళ్లలో అంటే 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.1.24 లక్షల కోట్లు ఉండగా, 2024-25 ఆర్థికానికి అది రూ.3.79 లక్షల కోట్లుకు భారీగా పెరిగింది. మరోపక్క 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్టవిటీ (జిఎస్‌డిపి) ప్రస్తుత ధరల వద్ద రూ.16.41 లక్షల కోట్లు కాగా, నిరంతర ధరల వద్ద దాని వృద్ధి 8 శాతం దాటింది.

# జాతీయ రహదారిపై బైక్‌రైడర్ దుర్మరణం

## బాపట్ల ఈవెంట్‌లో పాల్గొని హైదరాబాద్ వస్తుండగా

## పెద్దకాపర్తి వద్ద బైక్‌ను ఢీకొన్న వాహనం



ధ్వంసమైన బిఎండబ్ల్యు బైక్



బైక్‌రైడర్ రితీష్‌రెడ్డి మృతదేహాన్ని ఘటనా స్థలం నుంచి తరలిస్తున్న పోలీసులు

**చిట్యాల రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సెలవు దినాల్లో దూర ప్రాంతాలకు బైక్ రైడింగ్ చేస్తూ తమ అభిరుచిని పంచుకుంటున్న బైక్ రైడర్స్ గ్రూప్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికంగా కలచివేసింది. చిట్యాల మండలం పరిధిలోని పెద్దకాపర్తి శివారులో 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బైక్‌రైడర్ దుర్మరణం చెందాడు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన చదురుప్పల రితీష్‌రెడ్డి (40) ఎపిలోని బాపట్లలో హార్లే డేవిడ్సన్ మోటార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవెంట్‌కు హైదరాబాద్‌కు చెందిన 32 మంది బైక్‌రైడర్స్‌తో కలిసి రెండు రోజుల క్రితం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపునకు వస్తుండగా పెద్దకాపర్తి శివారులోని 7 హోటల్స్ సమీపంలో గుర్తుతెలియని వాహనం రితీష్‌రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రితీష్‌రెడ్డికి తలకు, శరీరానికి తీవ్రగాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రోహిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. రూ. 25 లక్షల విలువైన బిఎండబ్ల్యూ బైక్ పై ప్రయాణిస్తున్న రితీష్‌రెడ్డి హెల్మెట్ ధరించినప్పటికీ ప్రమాదతీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణాలను కోల్పోయాడు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, నియమిత వేగంతోనే ప్రయాణించాలని పోలీసులు సూచించారు. రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కౌన్సిలర్ల క్యాంపులోకి పోలీసులను ఎందుకు పంపుతున్నారు?

## హంగ్ ఉన్నచోట్ల గెలుపునకు కాంగ్రెస్ అరాచకాలు: బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మున్సిపాలిటీల్లో హంగ్ ఉన్న చోట గెలుపు కోసం కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శించారు. ఆదివారం ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ..ఖమ్మున్సిపల్ ఎన్నికల్లో 30శాతం ఓట్లను బీఆర్ఎస్ కొల్లగొట్టింది. ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన దానికి ఇదే ఉదాహరణ. పోలీస్ శాఖను సీఎం దగ్గర పెట్టుకుని తనకు అనుకూలంగా మార్చుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా మూడు రోజుల ముందే చైర్మన్లు, మేయర్ల ఎంపికకు నోటిఫికేషన్ ఇస్తోంది. కనీసం 15రోజుల ముందే షెడ్యూల్ ఇవ్వాలి. వారం రోజుల్లోనే అన్నీ పూర్తిచేసి ఎస్ఈసీ మమ అనిపించింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా వారికి ఈసీ నోటీసులు ఇవ్వలేదు. గెలుపు కోసం కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. వారికి ఎన్నికల అధికారులు అండగా నిలిచారని అన్నారు. కోడ్ ఉల్లంఘించినా నోటీసులు ఎక్కడ కూడా ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదని తెలిపారు. వీడియో, ఆధారాలతో సహా చూపించినా సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వలేదని విమర్శించారు. రేవంత్‌కు అనుకూలంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోంది అంటూ ఆర్ఎస్ ప్రవీణ్ ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 30 శాతం ఓటు షేర్ నమోదు చేసుకుందని, ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు. బీఆర్ఎస్‌కు 29 శాతం ఓట్లు వచ్చాయని ఈసీ ప్రకటించిందని, చరిత్రలో ఏ ప్రతిపక్ష పార్టీకి స్థానిక సంస్థల్లో ఇంత శాతం ఓటింగ్ రాలేదని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి కీలక శాఖలను తన దగ్గరే పెట్టుకున్నారని, ప్రజాస్వామ్యాన్ని రేవంత్ రెడ్డి అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పాలనలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని, రాష్ట్రానికి రెవెన్యూ రాబడి పూర్తిగా పడిపోయిందని తెలిపారు.

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు గురించి మళ్లీ లీకులు ఇస్తున్నారని,.అదొక లొట్టపీసు కేసు అని ఇప్పటికే చెప్పామని అన్నారు. కాంగ్రెస్ ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా ప్రజాపక్షం బీఆర్ఎస్ వైపే ఉందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెసోళ్లు ఇతర పార్టీల కౌన్సిలర్లను కిడ్నాప్‌లు చేస్తున్నారని, ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చిందని తెలిపారు. అక్కడ ఒక ఇండిపెండెంట్ బీఆర్ఎస్‌కు మద్దతిచ్చాడని తెలిపారు. అయితే వారు ఎక్కడ ఉన్నారో ట్యాపింగ్ ద్వారా గుర్తించి, అక్కడికి పోలీసులను పంపించారని పేర్కొన్నారు. వాళ్లేమైనా దొంగతనం చేసి క్యాంపులో కూర్చున్నారా అని ప్రశ్నించారు. అక్కడికి పోలీసులను పంపించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో రెండు రోజులపాటు డ్రంకన్ డ్రైవ్ దాడులు

## 415 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** జంట నగరాలలో శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 415 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 341 మంది ద్విచక్ర వాహనదారులు, 27 మంది ఆటో డ్రైవర్లు, 47 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ 192 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 69 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 31 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 17 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఆరుగురు 251 నుంచ 300 పాయింట్ల వరకు, 11 మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధి స్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఆదివారం నాడు మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

# ఢిల్లీ ఎర్రకోట వైట్‌కాలర్ టెర్రరిజంలో కొత్తకోణం

## డాక్టర్ల ఉగ్ర కుట్రకు అన్సార్ ఇంటీరియంగా కోడ్‌నేమ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట వద్ద గత ఏడాది నవంబర్ పదవ తేదీన జరిగిన ఆత్మాహుతి కారు బాంబు పేలుడులో కొత్త కోణం వెలుగు చూసింది. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన కొందరు వైద్యులు కుట్ర పన్నిన ఈ ఆత్మాహుతి దాడిలో ఉగ్ర డాక్టర్‌తో పాటు తొమ్మిది మంది మరణించగా 20 మంది గాయపడడం తెలిసిందే. ఈ కేసును విచారిస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తులో తాజాగా కొత్త విషయాలు బహిర్గతం అయ్యాయి. ఈ పేలుళ్లకు కారకులైన ఉగ్ర డాక్టర్లు అందరు కలిసి అన్సార్ ఇంటీరియం పేరిట కొత్తగా ఒక ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేసినట్లు, పేలుడుకు దీనినే కోడ్ నేంగా వాడినట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఉగ్ర కుట్రలో పాలుపంచుకున్న వైద్యులంతా నాలుగేళ్ల క్రితమే పాక్ ఉగ్రవాదులతో మమేకం అయినట్లు తాజాగా వెలుగు చూసింది. ఈ పేలుళ్లకు కారకులైన వైద్యులు ముజమ్మిల్ గన్ని, ఉమర్ నబీ, ఆది ల్, ముజఫర్ మౌల్వీ ఇర్ఫాన్, కారీ అమీర్, తౌఫిల్ గాజిలు 2022 ఏప్రిల్ నెలలో శ్రీనగర్‌లో మొదటిసారి భేటీ అయ్యారు. ఆ సమయంలోనే వీరంతా అన్సార్ ఇంటీరియంను ప్రారంభించారని ఎన్ఐఏ విచారణలో తేలింది. ఈ సంస్థకు ఆదిల్ అధిపతిగా వుండగా, మౌల్వీ ఇర్ఫాన్ డిప్యూటీగా ఎంపికయ్యాడు. తమ బృందంలో వున్న వారు ఎవరెవరు ఏ పనిచేయాలనే దానిపై అందరు ముందుగానే నిర్ణయించుకున్నారని ఎన్ఐఏ విచారణలో తేలింది. ఇందుకోసం వీరంతా ఆపరేషన్స్‌కు సంబంధించి కోడ్‌లను కూడా నిర్ణయించుకున్నారు. ఈ బృందానికి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డ ఉమర్ నబీ సమన్వయకర్తగా వ్యవహరించగా గన్నీ ఫైనాన్స్‌తో పాటు కొనుగోళ్ల చూసేవాడు. కాగా అన్సార్ ఇంటీరియం బృందం 2023లో పేలుళ్లకు అవసరమైన సామాగ్రి, ఎరువులను సోహ్నా నుంచి కొనుగోలు చేసింది. ఉమర్ నబీ సూచనల మేరకు ఫరీదాబాద్‌లోని ఓ రసాయన ఎరువుల దుకాణం నుంచి పొటాషియం నైట్రేట్‌ను తెప్పించారు. డాక్టర్ ఉమర్ నబీ ఆన్‌లైన్ వీడియోలు చూసి ఐఈడీలను తయారు చేయడం నేర్చుకున్నాడని ఎన్ఐఏ విచారణలో తేలింది. ఆదిల్ దక్షిణ కాశ్మీర్‌కు చెందిన డానిష్‌ను ఆల్‌ఫలా యూనివర్శిటీలోకి తీసుకువచ్చి అక్కడ ఉద్యోగం ఇప్పించి అక్కడే వుండేలా చూశాడు. డానిష్‌తో ఆత్మాహుతి దాడి చేయించాలని ఆదిల్ మొదట భావించాడు. కానీ చివరి నిమిషంలో వెనక్కు తగ్గాడు. కాగా ఈ ఉగ్ర డాక్టర్ల బృందంలో ఉమర్ నబీ కరుడుగట్టిన ఉగ్రవాదిగా తేలింది. ఢిల్లీలోని ఏదైనా రద్దీ ప్రాంతం లేదా మరేదైనా ప్రార్థనా స్థలంలో గత ఏడాది ఆగస్టు 15 వ తేదీన శక్తివంతమైన కారు బాంబును పేల్చాలని ఉగ్రవాదుల కుట్రగా తేలింది. అయితే వీరి కుట్రను శ్రీనగర్ పోలీసులు అన్సార్ ఇంటీరియం వ్యవహారాన్ని రట్టు చేయడంతో ఉమర్ నబీ ఒక్కసారిగా షాక్‌కు గురై కొంతకాలం అజ్ఞాతంలో వుండి, చివరకు గత ఏడాది నవంబరు పదవ తేదీన ఢిల్లీ ఎర్రకోట వద్ద కారులో బాంబు అమర్చి తనను తాను పేల్చుకున్నాడు. కాగా ఉమర్ 2016, 2018లో పాక్ ఐఎస్ఐలో చేరేందుకు ప్రయత్నించగా సరైన ఛానల్ లభించకపోవడంతో చేరలేదని తాజా విచారణలో వెలుగుచూసింది. ఈ కేసులో అరెస్టయిన వైద్యులంగా తీహార్ జైల్లో రిమాండులో ఉన్నారు.

# అజ్ఞాతంలోని మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

## డిజిపి శివధర్‌రెడ్డి పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** అజ్ఞాతంలో వున్న మావోయిస్టులు తమ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని డిజిపి శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి పిలుపుమేరకు అజ్ఞాతంలో వున్న నక్సలైట్లు జనంలోకి వచ్చి తమ కుటుంబాలతో శాంతియుత జీవనం సాగించాలని కోరారు. గడచిన రెండేళ్ల కాలంలో 588 మంది నక్సలైట్లు లొంగి పోయారని, వీరంతా తెలంగాణతో పాటు ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారని ఆయన తెలిపారు. పోలీసుల సమిష్టి కృషివల్ల ఇది సాధ్యమయ్యిందని ఆయన వెల్లడించారు. లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం కింద అందాల్సిన అన్ని సౌలభ్యాలను అందించామని డిజిపి తెలిపారు. ప్రస్తుతం వీరంతా వారి వారి సొంత గ్రామాల్లో కుటుంబాలతో సుఖంగా జీవిస్తున్నారని ఆయన తెలిపారు. లొంగిపోయే నక్సలైట్ల విషయంలో తెలంగాణ సర్కారు అనుసరిస్తున్న విధానాలు నచ్చి ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు కూడా ఇక్కడ పెద్దసంఖ్యలో లొంగిపోతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి అజ్ఞాతంలో వున్న 15 మంది నక్సలైట్లు ఈ అవకాశాన్ని వాడుకోవాలని ఆయన సూచించారు. లొంగిపోయే వారికి తక్షణ సహాయం అందించడంతో పాటు సమాజంలో వారు గౌరవంగా జీవించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. నక్సలైట్లు తమ పోరుబాట వీడి సమాజంలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆయన కోరారు.

# రేపు ఆకాశంలో 'రింగ్ ఆఫ్ ఫైర్'

## భారత్‌లో కనిపించని వలయాకార సూర్యగ్రహణం

## అంటార్కిటికాలో పూర్తిగా వీక్షించే అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఈ యేడాది మొదటి సూర్యగ్రహణం ఈ నెల 17న సంభవించనుంది. మాఘ మాసం అమావాస్య రోజున శివరాత్రి తరువాత రెండు రోజులకు ఏర్పడుతున్న ఈ గ్రహణానికి కొత్త అంశం ముడిపడివుంది. వలయాకారంలో ఈ సూర్య గ్రహణం ఏర్ప డనుండడంతో దీనికి రింగ్ ఆఫ్ ఫైర్‌గా శాస్త్రవేత్తలు పేరు పెట్టారు. ఈ తరహా సూర్య గ్రహణం చాలా అరుదుగా ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబు తున్నారు. ఈ అరుదైన ఖగోళ అద్భుతం భారత్‌లో కనిపించదు. దక్షిణార్థ గోళంలోని అంటార్కిటికాలో సంపూర్ణంగా ఈ గ్రహణం కనిపించనుంది. అంటార్కిటికాలోని కాంకార్డియా, మిర్నీ సహా సమీపంలో ఈ గ్రహణం స్పష్టంగా కనిపించనుండడంతో దీనిని అక్కడి ధృవ పరిశోధనా కేంద్రా లలో శాస్త్రవేత్తలు ఈ అద్భుతాన్ని వీక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ప్రాంతాలలో కేవలం శాస్త్రవేత్తలకు మాత్రమే అనుమతి ఉంటుంది. సాధారణ ప్రజలకు అనుమతి వుండదు. ఈ సూర్యగ్రహణం దక్షిణాఫ్రికా, టాంజానియా, జింబాబ్వే సహా పలు ఆఫ్రికా దేశాలు, అర్జెంటీనా, చిలీ, దక్షిణ అమెరికాలో పాక్షికంగా కనిపిస్తుంది. ఈ గ్రహణం ఉదయం 7.01 గంటలకు మొదలుకానున్న ఈ గ్రహణం తొమ్మిది గంటలకు ముగియనుంది. కాగా ఈ గ్రహణం భారత్‌లో కనిపించదు. గ్రహణం సంభవించే సమయం, భారత కాలమానం వేరు వేరుగా ఉండడం ఇందుకు కారణం. అయితే నాసా సహా పలు అంతరిక్ష సంస్థలు ప్రసారం చేసే ఆన్‌లైన్ లైవ్ స్ట్రీమ్‌ల ద్వారా భారత్‌లో ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించే వీలుంది.

### రింగ్ ఆఫ్ ఫైర్ అంటే ఏమిటి?

ఇదిలా ఉండగా సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు వచ్చినపుడు సూర్య గ్రహణం ఏర్పడుతుంది. అయితే గ్రహణం సమయంలో చంద్రుడు తన సాధారణ పరిమాణం కంటే కొంచెం చిన్నగా కనిపించడం వల్ల సూర్యుడిని పూర్తిగా కప్పలేడు. సూర్యుడి మధ్య భాగాన్ని 96 శాతం వరకు చంద్రుడు అడ్డుకుంటాడు. దీంతో సూర్యుడి అంచులు ఒక ప్రకాశవంతమైన బంగారు వలయంగా కనిపిస్తుంది. దీనినే కంకణాకార గ్రహణం లేదా రింగ్ ఆఫ్ ఫైర్‌గా పిలుస్తారు. దీనిని అగ్ని వలయంగా కూడా పిలుస్తారు.



సూర్యగ్రహణం తాలూకు నాసా విడుదల చేసిన ఫొటో

# రేపటి నుంచి సిబిఎస్ఇ టెన్త్, ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా రేపటి(మంగళవారం) నుంచి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) టెన్త్, ఇంటర్ బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలను కొనసాగించనున్నారు. టెన్త్ పరీక్షలు ఈ నెల 17 నుంచి మార్చి 11 వరకు కొనసాగనుండగా.. ఇంటర్ పరీక్షలు ఈ నెల 17 నుంచి మార్చి 27 వరకు కొనసాగనున్నాయి. సవరించిన షెడ్యూల్ ప్రకారం, సీబీఎస్ఈ క్లాస్ 10 బోర్డు పరీక్షలు ఈ నెల 17 నుండి మార్చి 11 వరకు జరగనున్నాయి. ఫిబ్రవరి 17న గణితం, ఫిబ్రవరి 21న ఇంగ్లీష్, ఫిబ్రవరి 25న సైన్స్, మార్చి 2న హిందీ, మార్చి 7న సోషల్ సైన్స్ పరీక్షలు జరుగుతాయి.

16-2Pg5ff.qxd:16-2Pg5ff.qxd 1/1/02 6:01 AM Page 1



# 'ఆధార్'తో మరింతగా వ్యక్తిగత భద్రత




## మార్పులు, చేర్పులతో కొత్త కార్డులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఆధార్ మోసాలను అరికట్టేందుకు కొత్తగా విశిష్టగుర్తింపు ప్రాధికార సంస్థ మార్పులుచేర్పులు చేస్తోంది. ఆధార్ కార్డు ఫోటోకాపీల ద్వారా జరుగుతున్న మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, భౌతిక ఆధార్ కార్డుపై ఇకపై వ్యక్తిగత వివరాలు కనిపించవు. ప్రస్తుతం మనం బ్యాంకు ఖాతా తెరిచేందుకు, సిమ్ కార్డు కొనుగోలు చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు ఫోటోకాపీలను ఇస్తున్నాం. ఈ కార్డు లపై 12 అంకెల ఆధార్ నంబర్‌తో పాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అత్యంత సున్నితమైన సమాచారం ముద్రించి ఉంటోంది. ఈ ఫోటోకాపీలు నేరగాళ్ల చేతికి చిక్కితే గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆర్థిక మోసాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని యూఐడీఏఐ గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా జారీ చేయబోయే ఆధార్ కార్డులపై కేవలం కార్డుదారుడి ఫోటో, ఒక ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ మాత్రమే ప్రదర్శించాలని యూఐడీఏఐ యోచిస్తోంది. ఆధార్ నంబర్, చిరునామా వంటి వివరాలన్నీ ఈ క్యూఆర్ కోడ్‌లో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. గుర్తింపు ధృవీకరణ అవసరమైనప్పుడు, సంబంధిత సంస్థలు తమ వద్ద ఉన్న అధీకృత యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను సరిచూసుకుంటాయి. దీనివల్ల కేవైసీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత లభిస్తుంది. గత ఏడాది నుంచే ఈ మార్పులపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఫోటోకాపీల ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నామని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఇటీవలే ఒక సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల విడుదల చేసిన కొత్త ఆధార్ మొబైల్ యాప్‌లో కూడా లాగిన్ అయిన తర్వాత కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్ మాత్రమే కనిపించేలా మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన అమలైతే ఆధార్ గోప్యత మరింత పటిష్ఠం అవుతుందని, మోసాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# రేపు బంగ్లాలో కొత్త సర్కార్

## ప్రధాని మోడీకి ప్రత్యేక ఆహ్వానం

### భారత్ తరఫున స్పీకర్ ఓం బిర్లా హాజరు

**న్యూఢిల్లీ/ఢాకా:** బంగ్లాదేశ్‌లో మంగళవారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) చైర్మన్ తారిక్ రెహమాన్ నేతృత్వంలో సర్కారు ఏర్పాటు కానుంది. ఇటీవల ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇదిలాఉండగా, ప్రధానమంత్రిగా తారిక్ రెహమాన్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి రావాలంటూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆ దేశ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఇప్పటికే తారిక్ రెహమాన్‌కు ప్రధాని మోడీ ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు, కొత్తగా ఎన్నికైన బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా భారత ప్రభుత్వం తరపున పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది."స్పీకర్ ఈ ముఖ్యమైన కార్యక్రమంలో పాల్గొనడం భారతదేశం, బంగ్లాదేశ్ ప్రజల మధ్య లోతైన, శాశ్వతమైన స్నేహాన్ని నొక్కి చెబుతుంది, ఇది మన రెండు దేశాల బంధం, ప్రజాస్వామ్య విలువలకు భారతదేశం దృఢమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది" అని పేర్కొంది. "భాగస్వామ్య చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవం ద్వారా ఐక్యమైన పొరుగువారిగా, తారిక్ రెహమాన్ నాయకత్వంలో ఎన్నికైన ప్రభుత్వానికి బంగ్లాదేశ్ పరివర్తనను భారతదేశం స్వాగతిస్తుంది, ఆయన దార్శనికత, విలువలు ప్రజల అఖండ ఆదేశాన్ని పొందాయి" అని అది పేర్కొంది. బంగ్లాదేశ్ 13వ జాతీయ పార్లమెంటరీ ఎన్నికల్లో ఎన్నికైన సభ్యులు మంగళవారం, ఫిబ్రవరి 17న ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎ.ఎం.ఎం. నాసిర్ ఉద్దీన్ నిర్వహిస్తారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు కార్యాలయం, న్యాయ మంత్రిత్వ శాఖ, తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేశాయి. జాతీయ సంసద్ సచివాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇప్పటికే సన్నాహాలు జరుగుతున్నాయి. సాంప్రదాయకంగా, ఈ వేడుక జాతీయ సంసద్ భవన్‌లోని నియమించబడిన ప్రమాణ స్వీకార గదిలో జరుగుతుంది. ఫిబ్రవరి 17, మంగళవారం సాయంత్రం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని జాతీయ సంసద్ సెక్రటేరియట్ కార్యదర్శి కనిజ్ మోలా తెలిపారు.

# గవర్నర్‌ను దూషించిన కేసులో డీఎంకెనేతకు జైలు

**చెన్నై, ఫిబ్రవరి 15:** తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో డీఎంకే నేత శివాజీ కృష్ణమూర్తి కి మూడేళ్ల జైలుశిక్ష పడింది. గవర్నర్‌తోపాటు బీజేపీ నాయకురాలు ఖుష్బూ, అన్నాడీఎంకే నేతలపై కూడా గతంలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ చెన్నైలోని ఎగ్మోర్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది. కాగా 2023లో రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో కొన్ని అంశాలను చదవకపోవడాన్ని తప్పుబడుతూ.. కృష్ణమూర్తి అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు గవర్నర్ తరఫు న్యాయవాది చెప్పారు. ఆయన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారడంతో అప్పట్లోనే చెన్నైలోని కొడుంగయ్యూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం డీఎంకే నేతకు జైలుశిక్ష విధించింది.

# సైన్యానికి బదులు పొట్ట పెంచుతున్నారు

## హాంగరీ ప్రధానిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎద్దేవా



**కీవ్, ఫిబ్రవరి 15:** రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన హాంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్‌పై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర విమర్శలు చేశారు. రష్యాతో యుద్ధంలో కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి హాంగరీ వెనకడుగు వేస్తుండడంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. విక్టర్ ఓర్బన్ ప్రాంతీయ భద్రత కంటే దేశీయ రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఐరోపా దేశాల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన దేశంలో సైన్యాన్ని పెంచకుండా.. పొట్టను పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు రష్యాతో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయాలని ఐరోపా దేశాలను కోరారు. యుద్ధ విరమణ అమలు కోసం మాస్కోపై ఒత్తిడి పెంచాలని.. లేదంటే రష్యా మరిన్ని దాడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రష్యాతో యుద్ధాన్ని ఆపడానికి ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తుండగా.. హాంగరీ మాత్రం రష్యాకు సహాయం చేస్తూ వస్తోంది. ఆ దేశంపై యూరప్ దేశాలు విధించే ఆంక్షలను పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించింది. యుద్ధం సమయంలో కీవ్‌కు అదనపు నిధులు, ఆయుధాలు నేరుగా సరఫరా చేయాలని ఇయు దేశాలు ఇచ్చిన పిలుపును ప్రతిఘటించింది. అంతేకాకుండా పుతిన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా ఉక్రెయిన్, రష్యా ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. అబుదాబి వేదికగా ఇటీవల నిర్వహించిన రెండు విడత భేటీలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో ఎటువంటి పురోగతి లభించలేదు. డాన్‌బాస్ నుంచి వైదొలగాలని కీవ్‌పై మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది.

# అరుదైన కప్ప విషంతో అలెక్స్ నవాల్ని హత్య

**మ్యూనిచ్, ఫిబ్రవరి 15:** రష్యన్ విపక్ష నేత అలెక్సీ నావల్నీ మృతిపై అత్యంత అరుదైన కప్పవిషం ఇచ్చి హత్యచేసారన్న వివరాలు సంచలనం కలిగించాయి. ఈ ఉదంతం వెనుక రష్యా ప్రభుత్వ హస్తం ఉందని బ్రిటన్‌తో సహ ఐదు యూరోపియన్ దేశాలు తీవ్రంగా ఆరోపించాయి. ఆ దేశాలు సంయుక్త ప్రకటన కూడా విడుదల చేశాయి. నావల్నీ శరీరం నుంచి సేకరించిన నమూనాలను పరిశీలించగా, "ఎపిబాటిడిన్" అనే శక్తివంతమైన న్యూరోటాక్సిన్ ఆనవాళ్లు ఉన్నట్లు ఈ దేశాలు ధృవీకరించాయి. దక్షిణ అమెరికాలో కనిపించే విషపు కప్పల చర్మం నుంచి ఈ విషాన్ని సేకరిస్తారు. రష్యాలో ఇది సహజంగా లభించదని,

ఈ విషాన్ని ఉపయోగించే సామర్థ్యం, ఉద్దేశం, అవకాశం రష్యా ప్రభుత్వానికి మాత్రమే ఉన్నాయని ఆ దేశాలు స్పష్టం చేశాయి. ఈ ఆరోపణలతో బ్రిటన్,

ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ దేశాలు రష్యాపై రసాయన ఆయుధాల నిషేధ సంస్థకు ఫిర్యాదు చేశాయి.

# ఓ పక్క సిఎం పదవికోసం ఆధిపత్యపోరు!



## మరోపక్క ఐక్యత చాటుతూ విగ్రహాల ఆవిష్కరణ

**బెంగళూరు, ఫిబ్రవరి 15:** కర్ణాటక రాజకీయాల్లో డీకే శివకుమార్, సిద్ధ రామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంత కాలంగా ఒక రకమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా విస్తుపోయే సంఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హావేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉందనే ప్రచారానికి పూర్తి చెక్ పెట్టినట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. పార్టీలో ఐక్యతను, సమష్టి కృషిని ప్రజలకు చాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. గ్యారంటీ పథకాల అమలులో సిద్ధరామయ్య పోషించిన పాత్రను కొనియాడుతూ, ఆయన చరిత్రలో ప్రజా నాయకుడిగా నిలిచి పోతారని అన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించడం, ఒకరినొకరు గౌరవించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సిద్ధరామయ్య సైతం తన విగ్రహాన్ని డీకే ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, కాంగ్రెస్ పార్టీ సమష్టి కృషికి దక్కిన గుర్తింపని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి రేసులో ఎప్పుడూ పోటీపడే ఈ ఇద్దరు నేతల మధ్య ఇలాంటి ఐక్యతను చూపడం రాష్ట్ర రాజకీయాలకు కొత్త సంకేతంగా మారింది.

# ఎవరి ఒత్తిళ్లకూ భారత్ తలొగ్గదు

## - రష్యా చమురు కొనుగోళ్లలోనూ అంతే: జైశంకర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** రష్యన్ ముడి చమురు కొనుగోళ్లను అరికట్టడానికి భారత్ అంగీకరించిందని వాషింగ్టన్ నుండి వచ్చిన తాజా వాదనల మధ్య, భారతదేశం తన స్వంత నిబంధనలపై తన ఇంధన విధానాన్ని నిర్ణయిస్తుందని పునరుద్ఘాటించింది. మ్యూనిచ్ భద్రతా సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఇంధన ఎంపికలు "ఖర్చులు, నష్టాలు, లభ్యత" ద్వారా మార్గనిర్దేశం చేయబడతాయని అన్నారు, కొత్తగా ప్రకటించిన అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందం, రష్యన్ చమురు దిగుమతులపై ఒత్తిడి ఉన్నప్పటికీ భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి దృఢంగా కట్టుబడి ఉందని జైశంకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి దృఢంగా కట్టుబడి ఉందని జైశంకర్ పేర్కొన్నారు. "మేము వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి చాలా కట్టుబడి ఉన్నాము ఎందుకంటే ఇది మన చరిత్ర, మన పరిణామంలో చాలా భాగం. ఇది చాలా లోతైనది, ఇది రాజకీయ వర్ణపటాన్ని కూడా కత్తిరించే విషయం" అని ఆయన అభిప్రాయపడ్డారు. అదనపు రష్యన్ చమురు కొనుగోలును ఆపడానికి భారత్ అంగీకరించిందని డొనాల్డ్ ట్రంప్, మార్కో రూబియో చేసిన వాదనల మధ్య జైశంకర్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. చమురు కంపెనీలు తమ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకునే ముందు లభ్యత, ఖర్చులు, నష్టాలను పరిశీలిస్తాయని జైశంకర్ పేర్కొన్నారు. అమెరికాతో ఇటీవల జరిగిన వాణిజ్య ఒప్పందం ప్రకారం భారతదేశం రష్యన్ చమురు కొనుగోలును ఆపివేస్తుందా అని అడిగినప్పుడు, భారతదేశం స్వతంత్ర దృక్పథంతో ఉంటుందని, ఇతరులతో పొత్తు పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవచ్చని ఆయన బదులిచ్చారు.

# సంక్షిప్తంగా..

## అణుఒప్పందంపై రాజీకి ఇరాన్ సిద్ధం!




**టెహ్రాన్, ఫిబ్రవరి 15:** అమెరికాతో చర్చలు కొనసాగుతున్న వేళ.. అణు ఒప్పందంపై రాజీకి వచ్చేందుకు ఇరాన్ సిద్ధమైంది. యుఎస్‌తో న్యూక్లియర్ డీల్ కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని షరతు పెట్టింది. ఈ మేరకు ఇరాన్ మంత్రి మాజిద్ తఖ్తా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మాజిద్ మాట్లాడుతూ.. ఒప్పందం కుదుర్చుకోవడానికి బంతి అమెరికా కోర్టులో ఉందని వ్యాఖ్యానించారు. 'ఆంక్షలను ఎత్తివేయడం గురించి మాట్లాడేందుకు వారు సిద్ధమైతే.. మా అణు కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. అయితే, అన్ని ఆంక్షలు ఎత్తివేయాలా? లేదా పాక్షిక ఉపశమనం కోరుకుంటున్నారా? అనే విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు.

## బిల్‌బోర్డు కూలిన ప్రమాదంలో సమాజ్‌వాది నేత మృతి



లక్నో,ఫిబ్రవరి 15: రోడ్డుపై వెళ్తున్న కారుపై హైమాస్ట్ బిల్‌బోర్డ్ స్తంభం కూలింది. ఆ కారు నడుపుతున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నేత ఈ ప్రమాదంలో మరణించారు. ఈ సంఘటన చూసి స్థానికులు షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం అంటూ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుగంజ్ మార్కెట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కొత్తగా హైమాస్ట్ బిల్‌బోర్డ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోడ్డుపై ఒక కారు వెళ్తున్నది. అయితే కొత్తగా నిర్మిస్తున్నహైమాస్ట్ బిల్‌బోర్డ్ పోల్ కూలిపోయింది. కదులుతున్న కారుపై అది పడింది. కారు డ్రైవ్ చేస్తున్న 48 ఏళ్ల ఎస్పీ నేత లాల్ బహదూర్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే ఆయన మరణించారు.

## మ్యూనిచ్ సదస్సులో ఆసిమ్‌మునీర్‌కు చేదు అనుభవం!



**మ్యూనిచ్(జర్మనీ), ఫిబ్రవరి 15:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు జర్మనీలో ఓ ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మ్యూనిచ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ భద్రతా సదస్సుకు హాజరైన ఆయనను ఓ సెక్యూరిటీ అధికారి అడ్డుకున్నారు. ఆయన తన గుర్తింపు కార్డు (ఐడీ కార్డ్)ను సరిగా ప్రదర్శించలేదని అభ్యంతరం తెలిపారు. ఈ ఘటనకు సం బంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశించడానికి కొద్ది క్షణాల ముందు ఈ సంఘటన జరిగింది. అసిమ్ మునీర్ మెడలో ఐడీ కార్డు లేకపోవడంతో, సెక్యూరిటీ అధికారి ఆయనను ఆపారు. దాంతో, మునీర్ పక్కనున్న మరో పాక్ సైనికాధికారి తన చేతిలో ఉన్న కార్డును చూపించడంతో, ఆ సెక్యూరిటీ అధికారి ముందుకు పోయేందుకు అనుమతించారు.

## అదృశ్యం అయిన సాకేత్ మృతదేహం లభ్యం

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఫిబ్రవరి 15:** అమెరికాలో భారతీయ విద్యార్థి అదృశ్యం కేసు విషాదాంతంగా ముగిసింది. యూనివర్సిటీకి కిలోమీటర్ దూరంలోని అటవీ ప్రాంతంలో సాకేత్ శ్రీనివాసయ్య (22) మృతదేహం లభించింది. ఈ విషయాన్ని అమెరికాలో పోలీసులు వెల్లడించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య ఐఐటీ మద్రాస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. అనంతరం ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లాడు. బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో కెమికల్ అండ్ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన అతను కనిపించకుండా పోయాడు. సాకేత్ స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## జమ్ముకాశ్మీర్‌లో ఎనిమిదివేల బ్యాంకు ఖాతాల స్తంభన

**శ్రీనగర్, ఫిబ్రవరి 15:** జమ్ముకశ్మీర్‌లో భారీ డిజిటల్ హవాలా రాకెట్ బయటపడింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన 8వేల బ్యాంకు ఖాతాలను దర్యాప్తు సంస్థలు స్తంభింపజేశాయి. జమ్ముకశ్మీర్‌లో భారీ ముఠాకు ఈ ఖాతాల నెట్‌వర్క్ ఉన్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. ఈ ఖాతాల్లోకి చేరే డబ్బు చివరికి వేర్పాటువాదం లేదా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నట్లు అధికారులు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో గత మూడ్లేళుగా జమ్ముకశ్మీర్‌లో సుమారు 8వేలకు పైగా ఇలాంటి బ్యాంకు ఖాతాలను అధికారులు ఫ్రీజ్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోకి అక్రమ ఆర్థిక నిధులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) దృష్టి సారించింది.

# పెళ్లయిన 58 యేళ్లకు విడాకులు కోరిన జంట

## ఇవ్వలేమని తేల్చి చెప్పిన రాజస్థాన్ హైకోర్టు

**జైపూర్, ఫిబ్రవరి 15:** వివాహంజరిగిన 46 ఏళ్లకు, పిల్లలు కూడా పెద్దవాళ్లైన తర్వాత ఒక జంట విడాకులకు దరఖాస్తు చేసుకుంది. 2014లో ఈ దరఖాస్తుచేసారు.అప్పటిక వారి వివాహమై 58 ఏళ్లు. ఇప్పుడు కూడా అదే విడాకుల కేసు కోర్టులో ఉంది. వివాహమైన 58 ఏళ్ల తర్వాత ఈ జంట కోరుకుంటున్నట్లుగా విడాకులు ఇచ్చేందుకు రాజస్థాన్ హైకోర్టు నిరాకరించింది. దంపతుల పేర్లు వెల్లడికానప్పటికీ రాజస్థాన్‌కు చెందిన ఒక జంట జూన్ 29, 1967లో పెళ్లి చేసుకుంది. వారికి పిల్లలు కూడా ఉన్నారు. 46 ఏళ్లపాటు కలిసే ఉన్నారు. ఈ మధ్యలో చిన్నచిన్న తగాదాలు సహజమే. కానీ, 2013లో మాత్రం వీరి మధ్య అనేక విబేధాలు తలెత్తాయి. దీంతో వివాహమైన 47 ఏళ్లకు అంటే మే 26, 2014లో వీరు విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లోనే భర్త దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను భరత్‌పూర్ ఫ్యామిలీ కోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆయన తిరిగి రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. ఇంతకాలం ఈ కేసు విచారణ సాగుతూనే ఉంది. తాజాగా జస్టిస్ సుదేశ్ బన్సల్, జస్టిస్ అనిల్ కుమార్ ఉప్మన్‌తో కూడిన హైకోర్టు బెంచ్ వీరి విడాకులపై విచారణ జరిపింది. విడాకులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఇందుకు సంబంధించి కేసు విచారణ వివరాల్ని కోర్టు వెల్లడించింది. తమ పేరు మీద ఉన్న ఆస్తిని తన పెద్ద కొడుక్కు ఇవ్వాలని భార్య నిర్ణయించుకుంది. ఇద్దరు కొడుకులకు సమానంగా ఇవ్వాలని భర్త అన్నారు. దీంతో ఈ అంశంపై ఇద్దరిమధ్యా బేధాభిప్రాయాలున్నాయి. తమ ఆస్తిని భర్త విడదీయాలనుకుంటున్నారని భార్య ఆరోపించింది. తన భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఒకసారి ఆమెను తమ ఇంటికే తీసుకొచ్చాడని కూడా భార్య ఆరోపించింది. ఇదే సమయంలో తన భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇవన్నీ విన్న ధర్మాసనం ఇవేమీ విడాకులు తీసుకోవడానికి తగిన కారణాలుగా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది.

ఏవో కుటుంబ కలహాల కారణంగా ఒక జంటకు విడాకులు ఇవ్వలేమని, ఈ కారణాలు సరిపోవని వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా కలిసున్న ఈ జంట ఒకరినొకరు అర్థం చేసుకున్నారని, వారి మధ్య సహనం, అవగాహన ఉందని కోర్టు భావించింది. అందువల్ల ఈ చిన్న కారణాలకు 58 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత విడాకులు ఇవ్వలేమని చెప్పిన హైకోర్టు విడాకుల పిటిషన్‌ను కొట్టివేసింది.

# స్లీపర్‌క్లాస్‌లో కెనడా దంపతులకు వింత అనుభవం!

## మైమరపించిన భారతీయుల ఆతిథ్యం!

**జల్గావ్, ఫిబ్రవరి 15:** భారత్‌లో పర్యటిస్తున్న కెనడాకు చెందిన జంటకు భారతీయ రైలులో ఓ విచిత్రమైన, మధురమైన అనుభవం ఎదురైంది. పొరపాటున ప్రైవేట్ క్యాబిన్ బదులు స్లీపర్ క్లాస్ టికెట్ బుక్ చేసుకోవడంతో, ఏడు గంటల ప్రయాణంలో వారికి నిద్రే కరువైంది. అయినప్పటికీ, తోటి ప్రయాణికుల ఆప్యాయత, పిల్లల అల్లరికి ముగ్ధులై, ఈ అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేమంటూ సోషల్ మీడియాలో పంచుకున్న ఓ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. కెనడాకు చెందిన కిమ్ గ్రీన్‌వుడ్, తన స్నేహితుడితో కలిసి జల్గావ్ జంక్షన్ నుంచి చంద్రపుర వరకు 7 గంటల రైలు ప్రయాణం కోసం టికెట్లు బుక్ చేసుకున్నారు. ప్రశాంతంగా నిద్రపోవచ్చని భావించి స్లీపర్ క్యాబిన్ అనుకుని బుక్ చేయగా, అది అందరూ కలిసి ప్రయాణించే సాధారణ స్లీపర్ క్లాస్ అని రైలెక్కిన తర్వాత వారికి తెలిసింది. మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అక్కడి వాతావరణంలో వారు పూర్తిగా లీనమైపోయారు. కొద్దిసేపటికే వారి బెర్త్ చుట్టూ పిల్లలు చేరిపోయారు. విదేశీయులను చూడాలన్న కుతూహలంతో వారితో ఆటలు, మాటల్లో మునిగిపోయారు. తోటి ప్రయాణికులు తమ ఇంట్లో వండిన ఆహారాన్ని పంచుకోవడమే కాకుండా, స్టేషన్లలో ఆగినప్పుడు చాయ్, ఇతర తినుబండారాలు కొనిచ్చారని కిమ్ తన పోస్టులో పేర్కొన్నారు. "ఓ పెద్ద కుటుంబంలా అందరూ కలిసిపోవడం చూసి ఆశ్చర్యపోయాను. ఈ 7 గంటల నిద్రలేని ప్రయాణంలో పొందిన అనుభూతి వెలకట్టలేనిది" అని ఆమె వివరించారు. తాము పొందిన ఈ ప్రత్యేక అనుభవాన్ని "మా జీవితంలోనే అత్యంత సరదా రాత్రి" అంటూ కిమ్ గ్రీన్‌వుడ్ షేర్ చేసిన వీడియో, పోస్ట్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది.

# రైతులకు ద్రోహం చేస్తున్నట్లే!

## వాణిజ్య ఒప్పందంపై ప్రధానికి రాహుల్ ప్రశ్నలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోస పోవడాన్ని కళ్లారా చూస్తున్నామని, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్‌కు సంబంధించినదన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి ఐదు ప్రశ్నలు సంధించారు. డిడిజి (డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటి? జన్యుమార్పిడి చేసిన అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటి? కాలక్రమేణా పప్పు ధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటి? జన్యు మార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుంది.



# మహాశివుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

● ఆధ్యాత్మిక కేంద్రంగా ఏపిని తీర్చిదిద్దుతాం ● దేవాలయాల పరిరక్షణ, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం : సిఎం చంద్రబాబు

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: దేవాలయాల పరిరక్షణపై ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందని, రాష్ట్రంలో టెంపుల్ టూరిజానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని సూచించారు. గుంటూరు జిల్లా నంబూరులోని దశావతార ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పరమశివుడు చీకట్లు తొలగించి వెలుగులు ప్రసాదిస్తాడు. శివారాధనే ముక్తికి దగ్గర దారి. ఆనాడు సైబరాబాద్ నగరాన్ని నిర్మించాం. నేడు అమరావతి నిర్మిస్తున్నాం. అమరావతి భావితరాలకు ఆదర్శ నగరంగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి కీర్తి ప్రతిష్టలు పెంచుతుంది. రాష్ట్రం బాగుండాలని, సకాలంలో పోలవరం పూర్తి, నదుల అనుసంధానం, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం సహా సంపద సృష్టించి దాన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తిరిగి పేదలకు అందేలా దీవించమని ఆ పరమశివుడిని ప్రార్థిస్తున్నాను. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. పేదరిక నిర్మూలన, అందరికీ సమాన అవకాశాలు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

**టెంపుల్ టూరిజంలో భాగంగా ఆలయాల అభివృద్ధి:** "ఏపిని టెక్నాలజీలోనే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రంగానూ అభివృద్ధి చేస్తున్నాం. ఆలయాలు, పుణ్యక్షేత్రాలకు మన రాష్ట్రం ప్రసిద్ధిగాంచింది. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకేచోట కొలువైన శ్రీశైల పుణ్యక్షేత్రం మన రాష్ట్రంలో ఉండటం అదృష్టం. పంచారామాలు, శ్రీకాళహస్తి, లేపాక్షి, ద్రాక్షారామం, మహానంది, శ్రీముఖ లింగం, కోటప్పకొండ వంటి ఆలయాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. దేవాలయాల సంరక్షణ, నిర్వహణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి ఆలయంలోనూ నిత్య దీపారాధన, నైవేద్యం పెట్టాలనేది మా విధానం. దేవాలయాల పవిత్రత, భక్తుల విశ్వాసం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల కాలంలో ఆలయాలు, జాతరలకు భక్తుల రద్దీ పెరిగింది. స్త్రీ శక్తి ద్వారా ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో దేవాలయా లకు వెళ్లే మహిళల సంఖ్య పెరిగింది" అని ముఖ్య మంత్రి అన్నారు. ఆనాడు ఎన్టీఆర్ తిరుమలలో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధాని సహా గ్రామీణ ప్రాంతాల్లో 5 వేల దేవాలయాలు నిర్మించాలని తలపెట్టాం. ముఖ్యమంత్రిగా గోదావరి, కృష్ణా పుష్కరాలను మూడోసారి నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ, మంత్రాలయం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



## మొగలిచర్ల దత్తమందిరంలో శంశో... శివశంభో!

తిరుపతి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్తప్రతినిధి: మహాశివరాత్రి పర్వదినం వేడుకలను అవధూత మొగలిచెర్లలోని దత్తాత్రేయ మందిరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్, కన్వీనర్ పవని సాయికౌశిక్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆదివారం ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక రుద్రాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో శివలింగానికి విశేష అభిషేకాదులు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆ ప్రాంగణం పూర్తిగా శివ శంభో శంభో నామంతో మార్మోగింది. జాగరణ భక్తుల కోసం భరతనాట్య ప్రదర్శన, భక్తి గీతాలాపనలు, పండరి భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ రుద్రాభిషేకంలో అశేషంగా భక్తులు పాల్గొని స్వయాన శివునికి అభిషేకాలు చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం సదుపాయం కల్పించారు.



## ముక్త్యాల శ్రీభవానీ ముక్త్యేశ్వరక్షేత్రం భక్తజనం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: సంప్రదాయ సిద్ధంగా పవిత్ర నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించటం, శివాలయాలను సందర్శించి స్వామివారిని కొలుచుకోవటంలో సుప్రసిద్ధమైన శివరాత్రి పండుగ వేడుకలు భక్తజన సందోహంతో పోటెత్తి కళకళలాడాయి. ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల శ్రీభవానీ ముక్త్యేశ్వరస్వామి క్షేత్రం భక్తులతో పోటెక్కింది. పవిత్ర కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని తరించారు. ఆలయప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పోలీసులు నదిలో స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్ళను ఏర్పాటుచేశారు. నదీ ప్రాంతమంతా బురదమయం కావటంతో భక్తులు పుణ్యస్నానాలకు ఇబ్బందులు పడ్డారు. కొందరు పితృదేవులకు పిండప్రధానంచేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సర్కిల్ పోలీసు సిబ్బంది ప్రధాన పాత్రపోషించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించటంలో మల్లగుల్లాలుపడ్డారు. ముక్త్యాల రహదారి వందలాది వాహనాలతో నిండిపోయింది. ముక్త్యాల గ్రామ ప్రధాన రహదారి పక్కన ఊర పందుల మాసం అమ్మకాలను అడ్డుకోవటంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమై భక్తుల ఈసడింపులకు గురైంది. ముక్త్యాల కృష్ణా నదిలో స్నానమాచరించిన వారు సమీపంలోని కోటిలింగ మహాశివ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. పంచముఖ అమృతలింగేశ్వరుని దర్శించుకుని భక్తులు అభిషేకాలు నిర్వహించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ ముక్త్యాల క్షేత్రాన్ని సందర్శించారు. పాలేటి ఒడ్డునగల శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశరస్వామి దేవాలయం (మఠం శివాలయం)లో పంచామృతాభిషేకాలు, అన్నాభిషేక కార్యక్రమాలు ప్రారంభించారు. అలాగే శ్రీచంద్రమౌళీశ్వరాలయం (పెద్దశివాలయం), బంగారుపేటలోని శ్రీయోగీశ్వ రాలయం, ఎర్రయ్యగారి వీధిలోని శ్రీమార్కండేశ్వరాలయం, సత్యనారాయణ పురంలోని శ్రీక్షేమేశ్వరాలయం, శ్రీభమరాంబ సహితనాగలింగేశ్వరస్వామి ఆలయం, అగ్రహారం సమీపంలోని శ్రీఓంకారేశ్వరాలయంలలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఇందిరా దత్తు తరపున కెసిపి సిమెంట్స్ యాజమాన్యం భక్తులకు మంచినీరు, రుచికర ఫలహారం, అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో ముక్త్యాలలో భక్తులకు ఏర్పాటుచేసిన అన్నప్రసాద పంపిణీ శిబిరాన్ని ఎంఎల్ఏ శ్రీరాం తాతయ్య ప్రారంభించారు. వాగ్దేవి మహిళా కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రిన్సిపాల్ బుస్సా సురేష్, కరస్పాండెంట్ బుస్సా సరిత సేవలందించారు.

# రామతీర్థంలో వైభవంగా శివరాత్రి జాతర

● పోటెత్తిన భక్తజనం ● ఉమాసదాశివస్వామిని దర్శించుకున్న పలువురు ప్రజాప్రతినిధులు



నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానం వద్ద ఆదివారం శివరాత్రి జాతర ఘనంగా జరిగింది. జాతరకు వచ్చిన లక్షలాదిమంది భక్తులతో క్యూ లైన్లు కిక్కిరిసాయి. ఆలయ ప్రాంగణం, పరిసరాలు, బోడికొండ ప్రాంతం, ఆలయ మాడవీధులు భక్తులతో కిటకిటలాడాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల దర్శనం కోసం, ఉమా సదాశివ స్వామి దర్శనం కోసం వేకువ జాము నుంచే భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ, పోలీస్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.50ల రుసుముతో ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా ప్రాంతం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దేవస్థానం ఆవరణలోనే ఉన్న క్షేత్రపాలకుడు ఉమా సదాశివస్వామినీ భక్తులు తొలుత దర్శించుకొని అనంతరం సీతారాములను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన మెట్ల వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శివరాత్రి జాతర తొలిరోజు సుమారు లక్షల మంది పైగా భక్తులు వచ్చినట్లు అంచనా. వీరిలో అధిక శాతం భక్తులు రామతీర్థం ఆలయ పరిసరాల్లోనే శివరాత్రి రాత్రంతా జాగరణ చేశారు. జాగరణ చేసిన భక్తులు సోమవారం కూడా సీతారాములను ఉమా సదాశివ స్వామిని దర్శించి తమ ఇళ్లకు వెళతారు.

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పలువురు ప్రముఖులు దేవస్థానాన్ని సందర్శించి సీతారాములను ఉమా సదాశివస్వామిని దర్శించుకున్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ప్రసాద్ దంపతులు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి నాయకులు, తదితరులు సీతారాములను దర్శించుకున్నారు.

రామతీర్థం జాతరకు వచ్చే భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ అధికారులు 40



బస్సులను నడిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బొబ్బిలి డిఎస్పి భవ్య పర్యవేక్షణలో భోగాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షించారు.

## గుడిమల్లం ఆలయానికి పోటెత్తిన భక్తజనులు

### పట్టు వస్త్రాలు అందించిన మంత్రి ఆనం నారాయణరెడ్డి

(శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయానికి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం భక్తులుపోటెత్తారు. వేలాది మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు నిత్యాన్నదాన పథకంలో భోజన వసతి కల్పించారు. ఆదివారం స్వామి అమ్మవార్లను శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. ఆనంద వల్లి సమేత పరశురామేశ్వరునికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం నారాయణరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద వారికి ఆలయ ఛైర్మన్ బత్తల గిరినాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి స్వాగతం పలికారు. వేదపండితులు వంశీకృష్ణ, పవన్‌కుమార్ శర్మ వేదమంత్రాలను పఠిస్తుండగా ప్రభుత్వం తరఫున పరశురామేశ్వరునికి పట్టు వస్త్రాలందించారు. వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## శైవక్షేత్రాల్లో మంత్రి 'ఆనం' ప్రత్యేక పూజలు



ఆత్మకూరు (నెల్లూరు), ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ఆత్మకూరులోని శివాలయం, కాశీనాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలపై ప్రత్యేక దృష్టి సారించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దేవాలయాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లికుండా పూర్తిస్థాయి పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పేద కుటుంబాలకు భరోసాగా సిఎం రిలీఫ్ ఫండ్

పేదల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 20కుటుంబాలకు రూ.23.35 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి ఆనం పంపిణీ చేశారు. అత్యవసర సమయాల్లో మన రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యచికిత్సలు పొందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి లక్షలాది రూపాయలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా మంజూరు చేస్తున్నారన్నారు. ఒక్క ఆత్మకూరు నియోజక వర్గంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు 640మందికి రూ.6.40 కోట్లు మంజూరు చేసి ఆ కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు.

# కాణిపాకంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

కాణిపాకం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగధాంభిగా సమేత మణి కంఠేశ్వరాలయంలో ఆదివారం మహా శివరాత్రి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వ హించారు. ఈవేడుకల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్ ముఖ్య అతిథిలుగా విచ్చేసి ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఉభయదారులతో కలసి స్వామి, అమ్మవార్లకు దేవస్థానం తరపున ప్రధాన ఆలయం నుండి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి సమర్పించారు. వాటిని ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా ఆలయంలో స్వామి అమ్మవార్ల మూల విరాట్‌లకు ఉదయం ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను, పూజలను నిర్వ హించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అంద



మణికంఠేశ్వరాయంలో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న ఎంపీ, ఛైర్మన్, ఈఓ తదితరులు

జేశారు. మహాశివరాత్రి పండుగరోజున స్వామి అమ్మవార్ల దర్శనార్థం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీనితో ఉదయం నుండి రాత్రి వరకు మణికంఠేశ్వరాలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఇదిలా వుండగా స్వామివారికి రాత్రి గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన నందివాహనంపై స్వామి, అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు కాణిపాకం విచ్చేసిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మురళీమోహన్‌లకు దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన ఆలయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఏఈఓ రవీంద్రబాబు, జడ్పీటీసీ సుచిత్ర, మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబు నాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు స్థానిక నాయకులు పూర్ణచంద్రరావు, హేమాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ఐలాపురం వెంకయ్యకు రామకృష్ణ నివాళి

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రముఖ బీసీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆదివారం విజయవాడ దుర్గాపురంలోని ఐలాపురం నివాసం వద్ద ఆయన భౌతికకాయానికి రామకృష్ణ, ఈశ్వరయ్య పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య కుమారుడు ఐలాపురం రాజాతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఐలాపురం వెంకయ్య కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంపాటు కొనసాగుతూ రెండు విడతలుగా ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వర్తించినట్లు వారు గుర్తుచేశారు. ఆయన ఎప్పుడూ అనగారిన వర్గాల సమస్యలపై చిత్తశుద్ధితో కృషి చేస్తూ ప్రజల మధ్యే ఉండేవారని వివరించారు. ప్రత్యేకంగా బిసి వర్గాల సంక్షేమం కోసం శాసన మండలిలో బలమైన స్వరం వినిపిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పట్టుదలతో పోరాడిన ప్రజానాయకుడిగా ఆయన నిలిచారని తెలిపారు. అన్ని పార్టీల నేతలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారని, అమలాపురం మరణం అనగారిన వర్గాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. వెంకయ్య సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నేటి తరం రాజకీయాలకు ఆయన ఆశయాలు, సేవలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఐలాపురం వెంకయ్యకు నివాళి అర్పించిన వారిలో సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాయి తదితరులున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం... ఇద్దరు మృతి



దేవరపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి జాతీయ రహదారిపై శనివారం రాత్రి యాదవోలు రోడ్డు ఫ్లైఓవర్‌పై, జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. దేవరపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, విజయవాడ నుంచి రాజమండ్రి వైపు ప్రయాణిస్తున్న ఓ క్రైస్తవ సంస్థకు చెందిన బొలేరో వాహనం, ఎదురుగా రాంగ్ రూట్‌లో వేగంగా వస్తున్న పల్సర్ మోటార్ సైకిల్‌ను వేగంగా ఢీకొనడంతో పల్సర్ బైక్‌పై ప్రయాణిస్తున్న దూమంతుని గూడెం పంచాయతీ పరిధిలోని సుబ్బరాయపురం గ్రామానికి చెందిన ముప్పాల రాజ్ శివకృష్ణ (27), అదే గ్రామానికి చెందిన పెనుమాల చిన్నారి(26) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. బొలేరో వాహనంలో ఉన్నవారికి ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, వెనుక సీట్లో ఉన్న ఇద్దరు మహిళల్లో ఒకరికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్రమణ్యం తెలిపారు.



వర్ణమయపుష్పాలంకరణతో సిద్ధమైన శ్రీ స్వామి అమ్మవార్ల కల్యాణవేదిక

# దుర్గమ్మవారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

● పవిత్రస్నానాలకు పోటెత్తిన భక్తజనం ● దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: విజయవాడ ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి పర్వదినం వేడుకగా నిర్వహిస్తున్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఈఓ వికె సీనానాయక్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. శివాలయం, అమ్మవారి ఆలయ ప్రాంగణాలు రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించబడ్డాయి. శివరాత్రి రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. భక్తుల క్యూ లైన్లు సాఫీగా కొనసాగాయి. ఆదివారం అర్ధత్రి లింగోద్భవ కాలం అనంతరం శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్ల కళ్యాణోత్సవానికి వేదకను వర్ణమయ పుష్పాలంకరణతో చూడముచ్చటగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీగంగాపార్వతీ సమేత మల్లేశ్వర స్వామివార్లను వధూవరులుగా అలంకరించి ఉత్సవాలు ప్రారంభించారు. లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, త్రికాల అభిషేకాలు, కళ్యాణోత్సవం వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్య వి.శివప్రసాద్ శర్మ ధర్మపత్ని, కుమారుడు వి.ఎన్.వి.ఎల్.ఎన్.జి శర్మ, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ అదనపు ప్రైవేట్ కార్యదర్శి, కోడలు అమ్మవారికి సుమారు రూ.4 లక్షలకు పైగా విలువైన 29.700 గ్రాముల బంగారు ఆభరణాలను (బంగారు రాళ్ల బొట్టు: 12.700 గ్రాములు, నత్తు 12.600 గ్రాములు, బులాకీ 4.400 గ్రాములు, మొత్తం బరువు: 29.700 గ్రాములు) విరాళంగా ఈఓ వి.కె. శీనా నాయక్‌కు అందజేశారు. కృష్ణా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా దుర్గా ఘాట్‌ను ఈవో పరిశీలించారు. భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరాలలో అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు తక్షణ వైద్యం అందేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

**కియోస్క్ యంత్రాలతో డిజిటల్ విప్లవం:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం సరికొత్త డిజిటల్ కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి డిజిటల్ విప్లవానికి నాంది పలికారు. భక్తులు



బంగారు కానుకలు ఇఓకు అందిస్తున్న దృశ్యం

స్వయంగా టిక్కెట్లు తీసుకునేలా కియోస్క్ యంత్రాలను కనకదుర్గ నగర్ ప్రవేశ ద్వారం, మహామండపం లిఫ్ట్ ఏరియా, ఆన్‌లైన్ కౌంటర్స్ వద్ద ఏర్పాటు చేశారు.

**అనధికార విఐపి దర్శనాలు రద్దుతో సామాన్య భక్తులకు సులభదర్శనం:** సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా అనధికారిక విఐపి దర్శనాలను రద్దు చేసి, సామాన్యులకు త్వరితగతిన దర్శనం కలిగేలా ఇఓ చర్యలు తీసుకున్నారు.

**శాస్త్రోకంగా సూర్యఉపాసన:** ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా సూర్యోపాసన పూజలు జరిగాయి. ఆదివారం నాడు ఆలయ వైదిక కమిటీ, వేద పండితులు లోకకల్యాణంకోసం, భక్తుల ఆరోగ్య ప్రాప్తి కోసం వేద మంత్రోచ్చారణల మధ్య సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు, నమస్కారాలు నిర్వహించారు. భక్తులు, ఉభయ దాతలు ఈ పూజలో ప్రత్యక్షంగా పాల్గొని అమ్మవారిని, సూర్యదేవుని ఆశీస్సులు పొందారు. మహ శివరాత్రి పర్వదినాన ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ కొండపైకి వచ్చే భక్తుల కోసం మంచినీరు, శివరాత్రి ఏర్పాట్లు వగైరా ఆలయ యంత్రాంగంతో కలిసి పనిచేశారు.

**నృత్యార్చనకు విశేష స్పందన:** ఇంద్రకీలాద్రిపై శివశక్తి నృత్యార్చన కూచిపూడి ప్రదర్శనలు భక్తులను పరవశింపజేశాయి. వర్ణమయ పుష్పాలంకరణ, విద్యుత్ దీపాల కాంతులతో శివరాత్రి పర్వదినాన సాక్షాత్తూ అపరకైలాసంలా శ్రీ కనక దుర్గమ్మ కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఆలయ ప్రాంగణమంతా శివనామ స్మరణతో మారుమోగింది. తెనాలికి చెందిన నృత్యాచార్య వసంతదుర్గ శిష్యబృందం తమ అత్యద్భుత నృత్యంతో 'గణేశ స్తుతి', శివ పంచాక్షరీ స్తోత్రం, మహిషాసుర మర్దిని స్తోత్రం ప్రదర్శించి అమ్మవారి రౌద్ర రూపాన్ని, శక్తిని ప్రతిబింబిస్తూ చేసిన ప్రదర్శన భక్తులలో ఉత్తేజాన్ని నింపారు. తాడేపల్లికు చెందిన నృత్యాచార్య స్వర్ణలత శిష్యులు సాంప్రదాయ బద్ధమైన కూచిపూడి శైలిలో అలరించారు. శంకర శ్రీగిరి మల్లేశ్వర స్వామి వైభవాన్ని కొనియాడుతూ చేసిన నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. కొలువైతివా దేవా క్షేత్ర మహత్యాన్ని చాటిచెప్పే కీర్తనకు లయ బద్ధమైన పాదఘట్టనలతో ప్రాణం పోశారు. శివుని ఆనంద తాండవాన్ని స్ఫురింపజేస్తూ వేగవంతమైన జతులతో ప్రదర్శనను ముగించారు. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను శాలువాలతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.




## ఆలయాల్లో మంత్రి నారాయణ పూజలు

నెల్లూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త-వైద్యం: మహాశివరాత్రి సందర్భంగా సతీమణి రమాదేవితో కలిసి నెల్లూరులోని మూలాపేట మూలస్థానేశ్వర స్వామిని విరాట్ నగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాలను మంత్రి నారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని కోరుకున్నానని, సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ముఖ్యంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ఆలయాలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీనివల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడి ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

### బాధితులకు మంత్రి నారాయణ ఆపన్న హస్తం

నెల్లూరు 44వ డివిజన్‌లో అగ్ని ప్రమాద బాధితులకు మంత్రి నారాయణ అండగా నిలిచారు. మూడు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కోల్పోయిన టిడిపి మహిళా కార్యకర్త షాహీనా నివాసానికి వెళ్లిన మంత్రి, ఆమె కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సహాయం కింద తన సొంత నిధుల నుండి రూ.50వేలు అందజేశారు. కేవలం ఆర్థిక సాయంతోనే ఆగకుండా, దగ్ధమైన ఇంటిని పునరుద్దరించే బాధ్యతను ఎన్‌సిసి గ్రూప్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు అప్పగించారు. మూడు రోజుల్లోనే ఇంటిని మునుపటి కంటే మెరుగ్గా ఆపదలో ఉన్న కార్యకర్తకు కొండంత అండగా నిలిచిన మంత్రి నారాయణ మానవత్వంపై స్థానిక డివిజన్ వాసులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

### 17 మందికి ఇళ్ల పట్టాలు పంపిణి

నెల్లూరు గోమతీ నగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సతీమణి రమాదేవితో కలిసి మంత్రి నారాయణ నిర్వహించిన సేవా కార్యక్రమం ఒక జాతరను తలపించింది. ఇందులో భాగంగా 17 మంది లబ్ధిదారులకు రూ. 17,28,220 విలువైన సిఎంఆర్ఎఫ్ (సిఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను, 101 మంది వీధి వ్యాపారులకు ఉపాధి కోసం తోపుడు బండ్లను, మరియు 17 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి పేదల పాలిట పెన్నిధిలా నిలిచారు.

ong-7_ong-7.qxd 2/16/2026 1:12 AM Page 1





# శివ నామస్మరణతో.. మార్మోగిన శివాలయాలు

**- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**

**(ప్రభాతవార్త విశాఖపట్నం)**

మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం నగరంలోని ప్రముఖ శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శివాలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జామున రెండు గంటల నుంచి స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. పెద్ద ఎత్తున తరలివచ్చి స్థానిక శివాలయాల్లో శివయ్యని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా శివ నామస్మరణతో శివాలయాలన్నీ మార్మోగిపోయాయి. మహాదేవుడికి ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో జాగారం చేస్తూ శివస్మరణతో ఉపవాసం వుంటూ మహాశివుడు కృపకు పాత్రులవుతున్నారు.









విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త

## నర్సీపట్నంలో వైభవంగా నదికి హారతి

**- పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు**

**నర్సీపట్నం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నర్సీపట్నంలోని వరాహనది తీరంలో గల పవిత్ర ఉత్తరవాహిని వద్ద ఆదివారం రాత్రి నదికి హారత్తి కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు, ఆయన సతీమణి పద్మావతి దంపతులు పాల్గొని నదీమతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతిని సమర్పించారు. వారణాసి గంగా హారతి తరహాలో నిర్వహించిన ఈ వేడుకను చూసేందుకు పురజనులు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, నర్సీపట్నం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత కనుల పండువగా, భక్తిశ్రద్ధలతో ఈ గంగా హారతి కార్యక్రమం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయం కూడా దినదినాభివృద్ధి చెందుతోందని, అన్నవరం వెళ్లడం కుదరని భక్తులు ఇక్కడే స్వామివారి వ్రతాలు చేయించుకోవచ్చని సూచించారు. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపం పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఇవి పూర్తి కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సతీమణి దివ్యశ్రీ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, పలువురు నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సింహగిరిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్

*- ఘనస్వాగతం పలికిన దేవస్థాన ఈవో జె. వెంకటరావు*

**సింహాచలం ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఆదివారం సింహాచల క్షేత్రాన్ని సందర్శించి, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వర్రావు ,వేద పండితులు నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ ఖిపూర్ణకుంభంఖితో ఘనంగా స్వాగతం పలికారు. న్యాయమూర్తి తొలుత స్వామివారి కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బేడా మండపం గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు నాదస్వరాల నడుమ వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈఓ జె. వెంకట్రావు న్యాయమూర్తికి స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

## సాగర తీరాన...శైవ క్షేత్రం!

**- అప్పికొండలో కొలువైన సోమేశ్వరుడు.. కపిలముని తపస్థలం.. సముద్ర స్నానం, స్వామి దర్శనం భక్తులకు పుణ్యప్రదం**

**గాజువాక,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**



సృష్టి, స్థితి, లయ కారకుడైన ఆ పరమశివుని ఆరాధించే మహాశివరాత్రి పర్వదినం రానే వచ్చింది. విశాఖ నగరానికి సమీపంలోని అప్పికొండ సాగరతీరంలో వెలసిన శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ప్రకృతి ఒడిలో, సముద్ర తరంగాల సాక్షిగా వెలసిన ఈ క్షేత్రం ఆధ్యాత్మికతకు, చారిత్రక సంపదకు నిలువుటద్దంగా నిలుస్తోంది. అప్పు ఇచ్చిన ఆత్మలింగం.. అప్పికొం!ఈ క్షేత్ర పురాణం అత్యంత ఆసక్తికరంగా ఉంటుంది. పూర్వం సప్తఋషులలో ఒకరైన కపిలముని ఈ సాగర తీర సౌందర్యానికి ముగ్ధుడై, ఇక్కడ 101 శివలింగాలను ప్రతిష్ఠించాలని సంకల్పించి తపస్సు ప్రారంభించారు. సూర్యోదయ సమయానికి 100 లింగాలు మాత్రమే ఉద్భవించడంతో ఆవేదన చెందిన మునిని కరుణించి, పరమశివుడు తన ఆత్మలింగాన్ని ఇక్కడ ఉద్భవింపజేశారని ప్రతీతి. శివుడు తన లింగాన్ని ముని కోరిక మేరకు మిగతా 8..లో


## నేడు రాజయ్య పేట నూకతాత పండగ

**- భారీ ఎత్తున ఏర్పాట్లు.. తరలి వస్తున్న భక్తులు..**

**- ఆకట్టుకుంటున్న విద్యుత్ కాంతులు ..పటిష్టమైన భద్రత.!**

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

మత్స్యకారుల కులదైవం నూక తాత పండగ పెద్ద ఎత్తున సోమవారం నిర్వహించేందుకు రాజయ్యపేట మత్స్యకారులు, ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మహాశివరాత్రి తర్వాత అమావాస్య నాడు నూక తాత పండుగను మత్స్యకారులు నిర్వహిస్తారు. ఈ నూక తాత పండగ సందర్భంగా బోయపాడు సముద్రతీరంలో ప్రత్యేకమైన చలువ పందిరిలో నూకతాత నుంచి అక్కడ నుంచి నూకతాతను గ్రామ పూజారి తీసుకొని గ్రామంలోకి వస్తారు. మిగతా 8..లో



# ఘనంగా ప్రారంభమైన మిలాన్ 2026







**విశాఖపట్నం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

భారత నావికాదళం ఆదివారం తూర్పు నావికాదళంలో తన ప్రధాన అంతర్జాతీయ నావికాదళ వ్యాయామం, మిలన్ 2026లో భాగంగా మిలన్ గ్రామాన్ని ప్రారంభించింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి తూర్పు నావికాదళంలోని ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ఇన్‌చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా అధ్యక్షత వహించారు, ఈ కార్యక్రమంలో 70 కి పైగా దేశాల నుండి ప్రతినిధులు నావికాదళ సిబ్బందిని స్నేహపూర్వక వాతావరణంలో కలిపే అనుభవ జోన్‌గా భావించారు మిలన్ గ్రామం యొక్క ప్రధాన లక్షణం సాంస్కృతిక వాటి ప్రాధాన్యత, భారతదేశ వైవిధ్యమైన వారసత్వం సంప్రదాయంలో గొప్ప లీనమయ్యే సంగ్రహావలోకనం అందిస్తుంది. ఈ గ్రామంలో భారతదేశ శక్తివంతమైన కళాత్మక వారసత్వాన్ని ప్రతిబింబించే గాత్ర కళాకారుల ప్రత్యక్ష ప్రదర్శనలు, సాంప్రదాయ జానపద నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ గ్రామంలో నావికా సావనీర్లు, హస్తకళ చేనేత ఉత్పత్తులను కలిగి ఉన్న వివిధ రకాల స్టాళ్లు ఉన్నాయి. కలిసి, అవి దేశవ్యాప్తంగా ఉన్న చేతిపనులను ప్రదర్శిస్తాయి. అదనంగా, సందర్శకులు భారతదేశంలోని ప్రాంతీయ రుచులు మరియు అభిరుచులను అందించే నోరూరించే భారతీయ వంటకాలను ఏర్పాటు చేశారు. తూర్పు నావికా కమాండ్‌లోని ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌చీఫ్ మాట్లాడుతూ విశాఖపట్నం ఐ ఎఫ్ ఆర్ , మిలాన్ , ఐ ఓ ఎం ఎస్ లను వరుసగా మిగతా 8..లో

## ఐఎఫ్ఆర్‌కు అంతా సిద్ధం

**- నగరానికి చేరిన 70 దేశాల నౌకాదళ బృందాలు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కు సర్వం సిద్ధమైంది. సోమవారం నుండి నిర్వహించే ఐ ఎఫ్ ఆర్ / మిలాన్ 2026 కోసం 70 దేశాల నౌకాదళ బృందాలు విశాఖకు చేరుకున్నాయి. ఈనెల 17 18 19 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రధాన ఘట్టాలకు భారత రాష్ట్రపతి సహా వివిధ దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో పెరేడ్ నిర్వహించారు. 18న జరిగే ప్లేట్ రివ్యూ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటారు.

### దశాబ్దకాలంగా నిర్మాణం

# పూర్తికాని అంగన్‌వాడి భవనాలు

*- మూడు జిల్లాలు మారినా ముడిపడని వైనం*

*- అసౌకర్యాలతో చిన్నారుల అవస్థలు*

*- పట్టించుకోని అధికారులు*

*- ఇది చింతూరు మన్యంలో అంగన్‌వాడి భవనాల దుస్థితి*





**చింతూరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

దశాబ్దాకాలంగా చింతూరు మన్యంలో అంగన్‌వాడి భవనాల నిర్మాణం ఆగిపోయింది. చింతూరు మన్యం మూడు జిల్లాలు మారినా అంగన్‌వాడి భవనాల నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. కొన్ని భవనాలు నిర్మాణం పూర్తి కాకుండానే శిధిలవస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని భవనాలు పశువులకు, పందులకు నిలయంగా మారాయి. ముక్కు పచ్చలారని చిన్నారులకు కావల్సిన కనీస సదుపాయాలు కల్పించటంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఎక్కడి భవనాలు అక్కడ ఆడిపోయిన సమస్య కొందరిది. అసలు భవనాలే లేని దుస్థితి కొన్ని కేంద్రాలది. కొన్ని పాత భవనాలు శిథిలావస్థకు చేరటంతో అక్కడ నిర్వహించాల్సిన కేంద్రాలు వేరే ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అలా అనేక చోట్ల అంగన్‌వాడి కేంద్రాలు అసౌకర్యాలతో అద్దె కొంపల్లో, రేకుల షెడ్లలో, పూరిపాకల్లో కనీస సౌకర్యాలు లేని చోట్ల నిర్వహించాల్సిన పరిస్థితి. అంగన్‌వాడి భవనాల సమస్యలపై ఏ ఉన్నతాధికారి సరైన చర్యలు తీసుకోకపోవటంతో ఈ దుస్థితి దాపురించింది. ఒక్క చింతూరు మండలంలోనే దాదాపు 24 అంగన్‌వాడి భవనాలు దశాబ్దా కాలంగా నిర్మాణం నిలిచిపోయి ఉన్నాయి. ప్రస్తుత పోలవరం జిల్లా చింతూరు ఐటిడిఏ పరిధిలోని విలీన మండలాలు అయిన చింతూరు, ఎటపాక, వి.ఆర్.పురం, కూనవరం మండలాల్లో గత టిడిపి ప్రభుత్వ హయంలో 52 అంగన్‌వాడి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భవనాల నిర్మాణం ప్రారంభం అయిన తరువాత అధికారంలోకి వచ్చిన అప్పటి వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడి భవనాల నిర్మాణాన్ని పట్టించుకోలేదు, కనీసం నిధులు కూడా ఇవ్వలేదు. దాంతో ఎక్కడి భవనాల నిర్మాణం అక్కడే ఆగిపోయింది. వైసిపి పాలన 5ఏళ్ళపాటు కనీసం సంభంధిత ఇంజనీరింగ్‌శాఖ ఆ భవనాల వైపు కన్నెత్తి చూడలేదు. ప్రస్తుతం ఆ భవనాలు శిధిలవస్ధకు చేరుకుంటున్నాయి. మన దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ కులం, మతం అనే తారతమ్యత లేకుండా ఆరోగ్యంగా పెరగటం, పుట్టిన ప్రతి బిడ్డా స్వేచ్ఛా వాయువులు పిల్చుకుంటూ, అంగన్‌వాడి కేంద్రంలో మిగతా 8..లో

# ఘనంగా మహా శివరాత్రి ఉత్సవాలు

**మహాశివరాత్రి పర్వదినాన కిటకిటలాడిన శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమ్రోగిన ఆలయాలు ప్రత్యేక పూజలు చేసిన భక్తులు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణలతో మారుమ్రోగి నఆలయాల ప్రాంగణాలు భక్తులు తమ మొక్కలు తీర్చుకున్నారు. పరమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల కోలాహలం : రాష్ట్రవ్యాప్తంగా మిగతా 8..లో



# విశాఖ తీరంలో టీఎస్సార్ సేవా పీఠం

*- ఘనంగా 41వ మహా కుంభాభిషేకం*

*- మహా కుంభాభిషేకం సందర్భంగా కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు అభిషేకాలు*

*- దేశంలోనే అరుదైన ఆధ్యాత్మిక కార్యక్రమం*

*- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి*

**విశాఖపట్నం, ప్రభాతవార్త**


కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద ఘనంగా 41వ మహా కుంభాభిషేకానికి కన్నులపండువగా జరిగింది. ఈ మహా కుంభాభిషేకం సందర్భంగా కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు అభిషేకం చేశారు. పవిత్ర జలాలు, పళ్ళ రసాలతో టి సుబ్బరామిరెడ్డి స్వయంగా భక్తులచే అభిషేకాలు చేయించారు. భక్తులకు రుద్రాక్షలు, పసుపు తాళ్లు, ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు. మహా కుంభాభిషేకం నేపథ్యంలో ఆర్కే బీచ్ ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. శివనామస్మరణతో సాగర తీరం ప్రతిధ్వనించింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. దేశంలోనే అరుదైన ఆధ్యాత్మిక కార్యక్రమం టిఎస్సార్ గత 40 ఏళ్లుగా విశాఖ ఆర్కే బీచ్ వద్ద నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం దేశంలోనే అరుదైన ఆధ్యాత్మిక కార్యక్రమమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి అన్నారు. లోక కల్యాణం కోసం, అలాగే విశాఖకు ప్రకృతి వైపరీత్యాల రీత్యా ఎటువంటి ఆపద కలగకూడదని 40ఏళ్ళ కిందట కాకినాడ భారత యజ్ఞ పీఠాధిపతి శివ భక్తులకే, ఈ మహా కుంభాభిషేక కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. అప్పటి నుండి ప్రతి ఏటా మహాశివరాత్రి సందర్భంగా మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ మరియు తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి, క్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారని తెలిపారు. మిగతా 8..లో

## ఈనాటి బంధం ..ఏనాటిదో !

*- తరతరాలుగా తరగని అనుబంధం నైతిక విలువలకు నిదర్శనం*

*- అయ్యన్న తండ్రి తరహా గౌరవం ఆయనకే సొంతం.. అయ్యన్న పెద్దరికానికి లోకేష్ పెద్దపీట*

**అనకాపల్లి, ఫిబ్రవరి 15: (ప్రభాతవార్త)**



రాష్ట్రరాజకీయాలలో విలక్షణ నేతగా మూడు తరాలకు వారదిగా అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రాజకీయాలలో నైతిక విలువలకు నిదర్శనంగా నిలిచారు. ఆ వినూత్న వరవడితో నాడు రాజకీయ గురువు ఎన్టీఆర్, ప్రస్తుత సిఎం చంద్రబాబు తో పాటు యువనేత నారా లోకేష్ మనస్సును గెలుచుకున్న ఘనత దక్కించుకున్నారు. పార్టీ పట్ల అత్యంత విదేయత కలిగిన అతికొద్ది నేతల్లో ఆయన అగ్రగణ్యులు.. తెలుగుదేశం పార్టీ సంస్థాగత పటిష్టత లోను, కూటమి ప్రభుత్వం నిర్వాహణ లోను యువనేత మంత్రి నారా లోకేష్ ప్రధాన కేంద్ర బిందువుగా మెలుగుతున్నారు. చంద్రబాబు రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆయన మాత్రం ప్రతి సందర్భంలోనూ అయ్యన్న పెద్దరికాన్నికి పెద్దపీఠ వేస్తూనే మరో వైపు తన స్వంత కుటుంబ సభ్యులు గా మెలుగు అత్యంత చనువుగా ఉంటూ తన విజ్ఞతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల సందర్భంలో నెలకొన్న పలు సంఘటనలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. శాసనసభ సమావేశాలు సందర్భంలో స్పీకర్ అయ్యన్నపాత్రున్ని కారు వరకు మంత్రి లోకేష్ సాగనంపారు. శుక్రవారం రాత్రి తన నివాసంలో అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని కూటమి పార్టీ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ విందు కార్యక్రమంలో కూడా స్పీకర్ అయ్యన్న పట్ల అత్యంత ఆప్యాయత అనురాగాలు చూపించే ఫోటో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుండగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో సర్వత్రా ఆనందం నింపుతోంది. దివంగత ఎన్టీఆర్ పిలుపుతో యువకుడైన అయ్యన్న తెలుగుదేశం పార్టీలో చేరి అప్పటినుండి ఇప్పటివరకు ఆ పార్టీ పట్ల అదే విధేయతను కనబరుస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 1983 నుండి ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం నాలుగు సార్లు మాత్రమే పరాజయం చెందారు. 1985 నుండి ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ప్రతి సందర్భంలోనూ అయ్యన్న కీలకమైన మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్నారు. ఈ పర్యాయం మాత్రమే రాజకీయంగా అపార అనుభవం కలిగిన అయ్యన్నపాత్రుడుకు శాసనసభలో అత్యంత గౌరవమైన స్పీకర్ పదవి ఇచ్చి సీఎం చంద్రబాబు గౌరవించారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలకు శిరసా వహించి మంత్రి పదవిని త్యాజించి అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి అయ్యన్న గెలుపొందారు. పార్టీ పట్ల విధేయత ఆయన సిద్ధాంతం, ముక్కు సూటు తను ఆయన సిద్ధాంతం ఈ రెండు భావాలు నాటి రాజకీయ గురవు ఎన్టీఆర్, రెండవ తరం నేత సీఎం చంద్రబాబుతో పాటు తనకంటే వయస్సులో బాగా చిన్నవాడైన మూడో తరం యువనేత నారా లోకేష్ ను సైతం బాగా ప్రభావితం చేయడం విశేషం. సహజంగా స్పీకర్ పదవి నిర్వహించేందుకు రాజకీయ భవిష్యత్ ఆశించిన నేతలు సహజంగా ముందుకురారు. పార్టీ ఆదేశాలను శిరసావహిస్తూ రాజ్యాంగ పదవి హద్దులు దాటకుండానే తన అభిప్రాయాలను నిష్కర్షగా వెల్లడించడానికి ఇప్పటికి వెనుకాడక పోవడం ఆయన రాజీలేని రాజకీయ తత్వానికి నిదర్శనం. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ పరిపాలన వైఫల్యాలని నిర్మోహన్మాటంగా ఎండగడుతూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఫలితంగా జైలు జీవితం అను భవించాల్సి వచ్చింది. అయినా తొనక లేదు బెనక లేదు. అంటే తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబుకు ఇటు పార్టీ శ్రేణులకు నేను ఉన్నానంటూ గట్టిభరోసా కల్పించారు. అయ్యన్నతో పాటు ఆయన కుమారుడు విజయకు సైతం పార్టీలో సముచిత స్థానం కొనసాగుతుంది. తెలుగుదేశం పార్టీ కి అనుబంధంగా పనిచేసే ఐ టిడిపికి స్టేట్ ఇన్చార్జిగా అయ్యన్న తనయుడు విజయ్ సైతం యువనేత లోకేష్‌కు అండగా నిలుస్తున్నారు. ఆవిధంగా చంద్ర బాబు, అయ్యన్న మధ్య రాజకీయ సానిహిత్యమే కాదు, అంతకు మించి కుటుంబాన్నితలపించే బంధువుల్లా కూడా మెలుగుతున్నారు.

మొదటి పేజీ తరువాయిలు

## ఘనంగా ప్రారంభమైన మిలాన్ 2026



ఆతిథ్యం ఇస్తున్నందనీ చెప్పారు, ఈ కలయిక భారతదేశ సముద్ర విస్తరణ భాగస్వామి నావికాదళాలతో సహకార ఒక ముఖ్యమైన క్షణాన్ని సూచిస్తుంది" అని తెలియజేశారు. ఫిబ్రవరి 15 నుండి 25, 2026 వరకు జరగనున్న మిలాన్ 2026 వ్యాయామం, అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఐ ఎఫ్ ఆర్ ) 2026 ఐఎంఎస్ కాన్క్లేవ్ ఆఫ్ చీఫ్స్‌తో పాటు భారతదేశ చారిత్రాత్మక సముద్ర కలయికకు కీలక స్తంభంగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. ఇండోపసిఫిక్‌లో అతిపెద్ద బహుళపక్ష నావికా విన్యాసాలలో ఒకటిగా, మిలాన్ 2026 ప్రపంచవ్యాప్తంగా ఉన్న నావికాదళాలను ఒకచోట చేర్చి, పరస్పర చర్య, సముద్ర డొమైన్ అవగాహన మరియు సామూహిక ప్రతిస్పందన సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది అని చెప్పారు. ఈ వ్యాయామం యొక్క హార్బర్ సముద్ర దశలు జలాంతర్గామి వ్యతిరేక యుద్ధం, వాయు రక్షణ, శోధన రెస్క్యూ సహకార భద్రతా మిషన్లతో సహా సంక్లిష్ట సముద్ర కార్యకలాపాలపై దృష్టి పెడతాయి, స్వేచ్ఛా, బహిరంగ, సమ్మిళిత నియమాల ఆధారిత సముద్రాలకు ఉమ్మడి నిబద్ధతను బలోపేతం చేస్తాయి. ప్రధానమంత్రి మహాసాగర్ దార్శనికతకు ప్రధాన కార్యాచరణ అభివ్యక్తిని సూచిస్తుంది, ఇది ప్రపంచ సముద్ర కామన్స్‌లో ప్రాధాన్యత గల భద్రతా భాగస్వామిగా మరియు బాధ్యతాయుతమైన వాటాదారుగా భారతదేశం యొక్క పాత్రను పునరుద్ఘాటిస్తుంది అని పేర్కొన్నారు.

## విశాఖ తీరంలో టీఎస్సార్ సేవా పీఠం

ఇటువంటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం విశాఖపట్నం వాసుల అదృష్టమని పేర్కొన్నారు. డాక్టర్ టి సుబ్బరామిరెడ్డి విశాఖ ప్రజల కోసం రాజకీయంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో సేవలు అందజేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, టి.గురుమూర్తి రెడ్డి, బొడ్డేటి మహేష్, జనసేన నాయకులు బెహరా భాస్కర రావు, వైసీపీ నాయకులు చింతలపూడి వెంకట్రామయ్య, పేడాడ రమణి కుమారి, డాక్టర్ పూడి కిరణ్ కుమార్, ఆర్.చంద్రశేఖర్, ఆర్.వి.వి.సత్యనారాయణ టిఎస్ఆర్ కార్యదర్శి ఎస్.కే.భాష, దల్లి రామకృష్ణారెడ్డి, జగ్గుపిల్ల అప్పలరాజు, లంక శ్రీనివాస్, ఫిలిం డైరెక్టర్ వి.వంశి బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాజయ్య పేట నూకతాత పండగ


ఆ సమయంలో వేలాదిమంది ప్రజలు వారు అనుకున్న కోరికలు తీరాలనే ఉద్దేశంతో నేలపై పడుకుంటారు. వారి మీద నుంచి నూకతాతను తీసుకొని పూజారి దాటితే శుభం కలుగుతుందనే ఉద్దేశంతో మత్స్యకారులు అనాదికాలం నుంచి ఈ పండుగను జరుపుకుంటూ వస్తారు. ఈ పండుగ సమయంలో దేశంలో పూరి, కోణార్క్, చీరాల, పారాదీప్ ,వంటి ప్రాంతాల నుంచి మత్స్యకారులు పెద్ద ఎత్తున వస్తారు. ఆ విధంగా చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తరు. ఈ నూక తాత పండుగను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గ్రామంలో యువత పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. విద్యుత్ కాంతులు ఆకర్షణగా నిలిచాయి. ప్రధానంగా నూకతాత పండుగ సందర్భంగా బాణాసంచా ఆకర్షణగా నిలుస్తుంది. వేలాదిగా తరలివచ్చే మత్స్యకారులు ఘనంగా ఈ పండుగ ఎటువంటి అవాంఛనమైన సంఘటనలు జరగకుండా జరుపుకునేటట్లు డి.ఎస్.పి పోతిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ మురళి భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజయ్యపేట గ్రామం చుట్టూ సీసీ కెమెరాలు పెట్టారు.

## ఘనంగా మహా శివరాత్రి ఉత్సవాలు

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపారు. ప్రముఖ శైవ క్షేత్రం లో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈస్ట్ షిరిడి సాయిబాబా ఆలయంలో గల శివాలయంలో పాటు. పోర్టు శివాలయం రామలింగేశ్వర ఆలయం భక్తులతో కిటకిట లాడింది.

## సాగర తీరాన...శైవ క్షేత్రం!





అప్పుగా ఇవ్వడం వల్ల ఈ కొండకు ఖిఅప్పుకొండఖి అని పేరు రాగా, కాలక్రమేణా అది"అప్పికొండ"గా రూపాంతరం చెందింది. సోమవారం ఘడియలలో లింగోద్భవం జరగడం, చంద్రుడిని (సోముడు) ధరించిన శివుడు ఇక్కడ కొలువై ఉండటంతో స్వామికి సోమేశ్వరుడిగా నామకరణం జరిగింది.అంతర్వాహినిగా లింగాలు...ప్రస్తుతం ఇక్కడ ఐదు లింగాలు మాత్రమే కనిపిస్తుండగా, మిగిలిన 95 లింగాలు భూగర్భంలో ఉన్నాయని భక్తుల విశ్వాసం. చోళుల నిర్మాణ శైలి.. చారిత్రక వైభవం 14వ శతాబ్దంలో చోళ రాజులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయ ప్రాంగణంలో మూడు చిన్న దేవాలయాలు కొండ లైట్ రాయితో నిర్మితమై అప్పటి శిల్పకళా చాతుర్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి.విగ్రహాల ప్రత్యేక....ముఖ మండపంలో విష్ణువు, కార్తికేయుడు, నటరాజు, గణేశుడు, మహేశ్వరి విగ్రహాలు భక్తులను కట్టిపడేస్తాయి. గర్భాలయంలోని నునుపైన శివలింగం జ్యోతిస్వరూపాన్ని తలపిస్తుంది. ఈ క్షేత్రం మరో ప్రత్యేక విశాలమైన సాగర తీరం. భక్తులు ముందుగా సముద్రంలో పవిత్ర స్నానాలు ఆచరించి, ఆ తడి వస్త్రాలతోనే స్వామిని దర్శించుకోవడం ఇక్కడ అనాదిగా వస్తున్న ఆచారం. సముద్ర హోరు, శివనామ స్మరణల మధ్య భక్తులు పరవశించిపోతారు. దర్శనానికి విస్తృత ఏర్పాట్లు మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం దేవస్థానంలో భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. సముద్ర స్నానాల వద్ద ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను, పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అలల సవ్వడి.. శివనామ ప్రతిధ్వని.. అప్పికొండలో సోమేశ్వరుని దర్శనం ఎన్నదగినది!

## పూర్తికాని అంగన్‌వాడి భవనాలు



తన భవిష్యత్తుకు మొదటి బాటలు వేయాల్సి ఉంటుంది.అమ్మ ఒడితో పాటు అంగన్‌వాడి బడి ఆ చిన్నారుల పెరుగుదలలో కీలకపాత్ర పోషిస్తుంది.పసి బిడ్డలకు అనారోగ్య సమస్యలు రాకుండా, వారిలో సరైన పెరుగుదల ఉండేలా వారికి పౌష్టికాహారం,మందులు,వ్యాక్సిన్లు వంటి వాటితో పాటు ఆటపాటలతో కూడిన విద్యాబుద్ధులు చిన్నారులకు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తారు.చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే అంగన్‌వాడి కేంద్రంలో ఉన్నటువంటి వాతావరణం దోహదపడుతుంది.అటువంటి సౌకర్యాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్పించాల్సి ఉన్నా కనీస సౌకర్యాలు కూడా నోచుకోని దుస్థితి.ప్రతి గ్రామం,కాలనీలో దాదాపు 250 కుటుంబాలకు ఒక అంగన్‌వాడి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు.ఈ అంగన్‌వాడి కేంద్రాలకు తరచు వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించి అక్కడి చిన్నారులకు టీకాలు వేయటం,మందులు,బాలింతలకు వైద్య సేవలు,వారి పోషణ,గర్భిణీ స్త్రీలకు టీకాలు,వారికి కాన్పు సమయంలో ఎటువంటి సమస్యలు రాకుండా వారికి టీకాలు,బరువు నిర్ధారణ,చిన్నారుల బరువు నిర్ధారణ,పెరుగుదల వంటి అంశాలను క్షుణ్ణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశీలిస్తారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆడుకోవటానికి అవసరమైన కనీస సౌకర్యాలు ఏ అంగన్‌వాడీ కేంద్రం వద్ద కనిపించడం లేదు.మట్టు రక్షణ లేని కేంద్రాలు,కనీస మంచినీటి సౌకర్యం,మరుగుదొడ్డు లేని అంగన్‌వాడి కేంద్రాలు కోకొల్లలు.ఉదాహరణకు చింతూరు మండలంలోని వేములూరాయి అనే గ్రామములో అంగన్‌వాడి భవన నిర్మాణం నిలిచిపోయి దాదాపు 8సంవత్సరాలు అవుతుంది.అక్కడ దాదాపు 22 మంది చిన్నారులు ఉన్నారు.వారికి పక్కనే ఉన్న పాఠశాల భవనంలోని ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.ఆ పాఠశాలలో కనీసం ఫ్లోరింగ్ కూడా లేదు.ఆ గ్రామానికి ప్రక్కనే కొత్తపల్లి గ్రామం ఉంది.ఆ గ్రామములోని అంగన్‌వాడి కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది.అక్కడ సుమారు 25 మంది చిన్నారులు ఉన్నారు.ఫ్యాన్లు పనిచేయడం లేదు.మరుగుదొడ్డు పనిచేయటం లేదు.కనీసం చిన్నారులు ఆడుకునే పరిస్థితి కూడా అక్కడ లేదు .చింతూరు మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అల్లిగూడెం అనే గ్రామములో అత్యధిక మంది చిన్నారులు ఉన్న అంగన్‌వాడి కేంద్రం ఉంది.ఇక్కడ నిత్యం పందులు బొర్లటం కొనసాగుతోంది.ఇటువంటి దుస్థితి అనేక అంగన్‌వాడి కేంద్రాల్లో ఉంటే సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదు?గిరిజనుల చిన్నారుల పట్ల అధికారులకు ఎందుకంత చిన్నచూపు.ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోలవరం జిల్లా ఉన్నతాధికారులు అయినా చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించి మన్యం ప్రాంతాల్లోని అంగన్‌వాడి కేంద్రాలను మోడల్ కేంద్రాలుగా తీర్చి దిద్దుతారని కృషిచేయాలన్నదే ఈ కథనం.సో అధికారులు ఏమేరకు స్పందిస్తారో వేచిచూద్దాం.

## గుడిలోవ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం: భీమిలి ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



సింహాచలం, అనంత పద్మనాభ స్వామి, గుడిలోవ ఆలయాలు సర్క్యూట్ గా టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేసే ఆలోచన ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం గుడిలోవలోని ప్రాచీన శివాలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. గుడిలోవ రంగనాథస్వామి, శివాలయం పరిసరాలను అభివృద్ధి చేసి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. 2014 19 లో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మించామని పేర్కొన్నారు. అంతకుముందు గుడిలోవలో రూ. 10 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను, వీధి దీపాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఈపీడీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సింహాచలం నాయుడు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రాజశేఖర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మండల అప్పలనాయుడు కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, బి.ఆర్.బి. నాయుడు, లొడగల వెంకట్రావు, గంట్రెడ్డి సోమినాయుడు, చందవరపు కుమార్, కె. శ్రీకాంత్ రాజు, మహంతి శివాజీ, బమ్మిడి ఉమ, అప్పల రాము, బంటు చిన్న, తమ్మిన అప్పలరాజు, బలిరెడ్డి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భక్తి సంగీత కచేరి

విశాఖపట్నం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



రాంనగర్ మెయిన్ రోడ్డు శ్రీ రాఘవేంద్ర స్వామివారి మఠం లో ఐవియల్ శాస్త్రి సంగీత సమితి వ్యవస్థాపకులు ఆకొండి వెంకట్రావు సారథ్యంలో నిర్వహించిన " ఘనరాగవైభవం " పుస్తకావిష్కరణ తదుపరి భక్తి సంగీత కచేరి నిర్వహించారు . ఘనరాగవైభవం పుస్తకాన్ని కళాభారతి కార్యదర్శి జి ఆర్ కే ప్రసాద్ ఆవిష్కరించి పుస్తకం యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం చాగంటి సంధ్యా సుందర్ , జె సుధారఘునాథ్ , డి స్వర్ణ రమాదేవి , పి రాజేశ్వరి, పి అనురాధలు కలిసి మధురంగా భక్తి సంగీత కచేరి చేశారు . భక్తి సంగీత కచేరికి వయోలిన్ పై కె విజయశ్రీ , మృదంగంపై పి సాయి శేఖర్ సంగీత వాద్య సహకారం అందించారు . ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్, సమితి ప్రతినిధులు కే సుబ్రహ్మణ్యం , పి జగన్మోహనరావు , మధుబాబు , మధుసూదన రావు , నాగేశ్వరరావు , సమితి సభ్యులు , కళాభిమానులు , సంగీత కళా ప్రియులు తదితరులు పాల్గొన్నారు

## భక్తులతో పోటెత్తిన శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం

విశాఖపట్నం ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జగదాంబ జంక్షన్ సమీపంలోని విశ్వేశ్వర స్వామి వారి దేవ స్థానం భక్తులతో పోటెత్తింది. ఆదివారం తెల్లవారు జాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీ స్వామివారిని దర్శించుకొని విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అడపా దేముళ్ళు పర్యవేక్షణలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.సాయంత్రం రావి చెట్టు వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో దీపాలు వెలిగించి పరమశివున్ని ఆరాధించారు.ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. శివరాత్రి సందర్భంగా ఆలయ. ఆవరణలో ప్రత్యేక క్యూ లైన్లు,ఉచిత ప్రసాదవితరణ ఏర్పాటు చేశారు. మరో వైపు సర్వాంగ సుందరంగా అలంకరించారు.ఆదివారం రాత్రి జాగరణ అనంతరం సోమవారం ఉదయం భక్తులు సముద్ర స్నానాల ఆచరించి శివాలయాలను సందర్శించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేముళ్ళు పేర్కొన్నారు. మహాశివరాత్రి ప్రత్యేక పూజలను అర్చకులు కులు బాదంపూడి విశ్వేశ్వరరావు, బాదంపూడి సదాశివ,బాదంపూడి ప్రసాద రావులు నిర్వహించారు.

## రౌడీ షీటర్లకు త్రీ టౌన్ ఎస్ఐ స్ట్రాంగ్ వార్నింగ్

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)



గొడవ పట్నా పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లను కట్టుబడేలా త్రీ టౌన్ పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు. ఆదివారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో రౌడీషీటర్లకు ఎస్ఐ చిన్నం నాయుడు కౌన్సెలింగ్ ఇచ్చి స్పష్టమైన హెచ్చరికలు ఇచ్చారు. రౌడీషీటర్లను నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నుండి దూరంగా ఉండమని, బాధ్యతాయుత పౌరులుగా మారి చట్టాలను గౌరవించాలని ఈ సందర్భంగా ఎస్ఐ చిన్నం నాయుడు సూచించారు. ప్రజలతో సఖ్యతగా, గొడవలకు దూరంగా ఉండటం అవసరమని, సమాజంలో గౌరవప్రదమైన వ్యక్తులుగా ప్రవర్తించమని అవగాహన కల్పించారు.కౌన్సెలింగ్ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది కూడా పాల్గొని, రౌడీషీటర్లకు భవిష్యత్తులో మార్పు అవసరాన్ని వివరించారు. ఎలాంటి చట్టవ్యతిరేక చర్యలు జరిగితే తక్షణమే పోలీసుల కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## కాలుష్య జైంక్షన్!

- బొగ్గు ధూళితో రోగాల బారిన జనం
- జనావాసాల నుంచి వాహనాల మళ్లింపునకు డిమాండ్
- పాతకర్నవానిపాలెం గ్రామస్తుల ఆందోళన

గాజువాక,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త



గంగవరం పోర్టు, విశాఖ ఉక్కు కర్మాగారాల నుంచి వెలువడుతున్న కాలుష్యం గాజువాక పరిసర ప్రాంతాల్లోని ప్రజల పాలిట శాపంగా మారింది. నిత్యం వందలాది భారీ వాహనాలు జనావాసాల గుండా రాకపోకలు సాగిస్తుండటంతో వెలువడుతున్న బొగ్గు, ఇనుప ధాతువు ధూళి వల్ల స్థానికులు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ సమస్యను నిరసిస్తూ ఆదివారం పాతకర్నవానిపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కాలనీవాసులు వై జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. భారీ లోడు వాహనాల వల్ల పాతకర్నవానిపాలెం, శ్రీకృష్ణదేవరాయనగర్, అఫీషియల్ కాలనీ, స్వతంత్ర నగర్, గోపాలరెడ్డి నగర్, శ్రీనగర్, చినగంట్యాడ కాలనీలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు రావడమే కాకుండా, మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవిస్తోందని మండిపడ్డారు. భారీ వాహనాలను వై జంక్షన్ నుంచి కూర్మన్నపాలెం మీదుగా జాతీయ రహదారికి మళ్లించాలని వారు డిమాండ్ చేశారు. గత ఆరేళ్లుగా సమస్యపై పోరాడుతున్నా అధికారులు స్పందించడం లేదని గ్రామ కమిటీ నేతలు విమర్శించారు. ప్రభుత్వం మారినా తమ పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నిరసన తెలుపుతున్న ప్రజలకు భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మద్దతు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిరసపల్లి అప్పారావు, కరణం శ్రీను, గొంతిన దేముడు, కొండలరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అప్పికొండ క్షేత్రంలో మోడేకుర్తి సేవలు

గాజువాక,ఫిబ్రవరి15,ప్రభాతవార్త:



గాజువాక కు చెందిన కవి,రచయిత,రేడియో,టివి ఆర్టిస్ట్ మోడేకుర్తి వీర వెంకట సత్యనారాయణ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అప్పికొండ శ్రీ సోమేశ్వరస్వామి వారి దేవస్థానం లో ఆదివారం స్వచ్ఛందంగా తన సేవలు అందజేశారు.శ్రీ సోమేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద పబ్లిక్ అనౌన్స్మెంట్ సిస్టమ్ (మైక్ ) ద్వారా అనౌన్సర్ గా ఆదివారం ఉదయం 7 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటలవరకు దర్శనం చేసుకునే భక్తులకు సూచనలు చేస్తూ,జాగ్రత్తలు చెబుతూ తన సేవా భావాన్ని చాటుకుని పోలీస్,దేవస్థానం అధికారుల ప్రశంసలు పొందారు.కాగా, మోడేకుర్తి సత్యనారాయణ గత అనేక సంవత్సరాలుగా అప్పికొండ క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా అనౌన్సర్ గా తన స్వచ్ఛందసేవలను అందజేస్తూ అధికారుల ప్రశంసలు పొందారు.

## పద్మనాభం మండలంలో భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి ఉత్సవాలు

పద్మనాభం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :



మండలంలో పలు గ్రామాలలో మహాశివరాత్రి ఉత్సవాలను ఆదివారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా తాళ్లవలస, కుర్రపల్లి, పద్మనాభం, గందవరం, తునివలస, రెడ్డిపల్లి, పొట్నూరు, మద్ది, విలాసఖానపాలెం, అనంత వరం, పెంట, గ్రామాలలో ఉన్న శివాలయాలలోనే కాకుండా గెద్దపేట గ్రామంలో వేంచేసియున్న సుబ్రమణ్యేశ్వర ఆలయంలో కూడా భక్తులు అభిషేకాలు, విశేష పూజలను పరమశివుడికి చేసారు. అలాగే రెడ్డిపల్లి, మద్ది, పద్మనాభం శివాలయాలు, గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణంను వేదమంత్రాలతో జరిపించారు. శివ నామంతో గ్రామాలు హోరెత్తాయి.శివాలయాలు భక్తులతో కళకళలాడాయి.

## రెడ్డిపల్లి కృష్ణ చంద్ర బాబాజీ మఠంలో అన్నసమారాధన

పద్మనాభం, ఫిబ్రవరి15, ప్రభాతవార్త :



మండలంలో రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న కృష్ణ చంద్ర బాబాజీ మఠంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం భక్తుల సహకారంతో గ్రామ పెద్దలు బారీ అన్నసమారాధన కార్యక్రమంను నిర్వహించారు. మఠంలో ఉన్న శివాలయంలో అభిషేకాలు, పూజలు చేసారు. అలాగే రెడ్డిపల్లి, తునివలస గ్రామాల సత్యసాయి బాబా భజన బృందం భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం మద్యాహ్నం సుమారు రెండు వేల మందికి అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వైదా గురునాదరావు, వాడపల్లి అప్పలరాజు, భక్తులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

- ఐదుగురు అదుపులో, రూ.1.06 లక్షల నగదు స్వాధీనం

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)



విశాఖ సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భానోజీ తోట ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేశారు. సమాచారం అందుకున్న సీఐ భాస్కరరావు నేతృత్వంలోని బృందం సకాలంలో స్పందించి క్రిమినల్ కార్యకలాపాలను అడ్డుకున్నారు.పోలీసుల దాడిలో మొత్తం 8 మంది పేకాటరాయులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.1,06,500 నగదు, పేకాట పందెం సంబంధిత వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ కోసం న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సిఐ భాస్కరరావు స్పష్టం చేశారు..చట్టానికి లోబడి జీవించాలనీ, సమాజానికి హాని కలిగించే కార్యకలాపాలను మానుకోవాలని ఆయన హెచ్చరించారు..

## నేటి నుంచి పిఎసిఎస్‌ల సిబ్బంది నిరవధిక సమ్మె

ఆనందపురం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



తమ సమస్యలను పరిష్కరించాలని గత కొంత కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోక పోవడంతో రాష్ట్ర జెఏసి నిర్ణయం మేరకు సోమవారం నుంచి నిరవధిక సమ్మె దిగుతున్నట్టు జిల్లాలోని అన్ని పిఏసిఎస్ ల సిబ్బంది ప్రకటించారు. ఈ మేరకు అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ పోరాటం సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు కొనసాగుతుందని ఆ నోటీసులో పేర్కొన్నారు. జిల్లాలో 13 పిఏసిఎస్ లు ఉండగా 30 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా పిఏసిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నారాయణరావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని గత 18 నెలలుగా ఎన్నోసార్లు కోరినప్పటికీ, గత 2 నెలలుగా డి. సి. ఓ. కార్యాలయంల వద్ద, డి. సి. సి. బి. వద్ద ధర్నాలు చేస్తూ నల్లబ్యాడ్జిలతో విధులు నిర్వహిస్తున్నా, విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా కార్య క్రమం చేసి ప్రభుత్వానికి వినతి పత్రం ఇచ్చినా స్పందించలేదన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో సమ్మెకు దిగామన్నారు. కాగా సోమవారం నుండి సహకార సంఘ కార్యకలాపములు నిలిచిపోనుం డడంతో వ్యవసాయ రుణాలు నిలిచిపోనున్నాయి. సకాలంలో చెల్లించవల్సిన వడ్డీలకు అపరాద వడ్డీలు చెల్లించాల్సి వస్తుంది అదే విదంగా సంఘాల నుంచి సబ్సిడీ పై విక్రయిస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయాలు నిలిచిపోయి రైతాంగానికి తీవ్ర నష్టం జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 36 జి.ఓ అమలు పర్చాలని, 2019, 2024 పి.ఆర్.సి ఇవ్వాలని లేకుంటే 50 శాతం తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని, యాక్ట్ ప్రకారం గ్రాడ్యూటీ చెల్లించాలని, 2019 తరువాత జాయిన్ అయిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పదవీ విరమణను 62 కు పెంచి సంఘాల లాభ నష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని రూ.5లక్షలు హెల్త్ ఇన్సురెన్స్, రూ.20 లక్షలు టర్మ్ ఇన్సురెన్స్ ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేసారు.

## కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పూజలు

ఆరిలోవ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం స్థానిక 12వ వార్డు పెదగదిలి ప్రజల ఆరాధ్య దైవం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ముఖ్యులు ధూళి రఘు, అధ్యక్షులు ఒమ్మి వెంకట అప్పారావు, కార్యదర్శి బొట్ట రమణ ఆధ్వర్యంలో మహా శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండే భక్తులు మహాశివుని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు. భక్తులకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద నరసన్నపేట వాస్తవ్యులు శాంతారావు బృందం వారిచే ఏర్పాటు చేసిన బుర్రకథ అందరినీ ఆనందదాయకం చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కోశాధికారి పెసల శ్రీనివాసరావు, కడుపుట్ల వాసు, జోగా వెంకట అప్పారావు తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అప్పికొండ సోమేశ్వర స్వామిని దర్శించుకున్న బిజేపి నేత కేఎన్ఆర్

గాజువాక,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త



మహా శివరాత్రి పురస్కరించుకొని అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన పంచామృతాభిషేకాలు,ప్రత్యేక పూజ కార్యక్రమాలల్లో బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు దంపతులు పాల్గొని స్వామి వారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అతి పురాతనమైన శివాలయాల్లో ఒకటైన అప్పికొండ శ్రీ సోమేశ్వర ఆలయాన్ని పదకొండవ శతాబ్దంలో కపిలముని నిర్మించారని అన్నారు.కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారికి పంచామృతాలతో స్వహస్తాలతో అభిషేకం చేసి,దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ రాత్రంతా భక్తులు జాగారం చేసి, వేకువజామున ప్రక్కనే ఉన్న సముద్రంలో స్నానం ఆచరించి స్వామి వారిని దర్శించుకొని తిరిగి వెలతారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కేంద్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ప్రసాదం స్కీం ద్వారా ఇరవై ఐదు కోట్లు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చోడిపిల్లి పరదేశి, ఈవో పద్మావతి,బిజేపి నాయకులు శ్రీను, జనసేన నాయకులు కాకి బాబు తదితరులు పాల్గొన్నారు.

VAARTHA CLASSIFIEDS

FOR SALE
★ గజపతి నగరం 100 చ.గజాల భూమి – – ఫ్రూట్ ప్రాఫిట్ షేరింగ్‌తో 80 నెలల పాటు ప్రతి నెల ₹ 5,000 ఆదాయం సంపాదించండి. 6304674818.
(Ro.No.42745)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ong-8_ong-8.qxd 2/16/2026 1:12 AM Page 1



## రూ.3.21 కోట్లుతో అభివృద్ధిపనులకు శంకుస్థాపన

- అభివృద్ధి...సంక్షేమం కూటమితోనే సాధ్యం - ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**గాజువాక,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**



గాజువాకను అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జివిఎంసీ 65వ వార్డులో సుమారు రూ.3.21 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొద్దు నరసింహ పాత్రుడుతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. భానోజీ కాలనీ ప్రాథమిక పాఠశాల నూతన భవనం, అశోక్ నగర్‌లో రక్షణ గోడ, సంజీవ్ కాలనీ సామాజిక భవనం, అంగన్వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణాలను ఈ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రేటర్ విశాఖ రూపురేఖలు మారాయని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పై ప్రజల్లో విశ్వాసం తగ్గిందని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, ఇంచార్జి బైపిల్లి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు కఠిన చర్యలతో పాటు మార్పు దిశగా కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ఇందులో భాగంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం సీఐ కె.వి. సతీష్ కుమార్ సూచనల మేరకు నిర్వహించగా, సబ్ ఇన్‌స్పెక్టర్ పి. లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లతో మాట్లాడుతూ వారి ప్రతి కదలికపై పోలీసుల నిఘా కొనసాగుతోందని స్పష్టం చేశారు.అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి ప్రవర్తన కుటుంబ సభ్యులపై, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని గమనించాలని సూచించారు. సమాజంలో గౌరవప్రదమైన వ్యక్తులుగా మారేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.తప్పుదారులు విడిచి చట్టబద్ధంగా జీవనం సాగించాలని, సమాజ హితానికి తోడ్పడే విధంగా నడుచుకోవాలని సలహా ఇచ్చారు. మంచి భవిష్యత్తు కోసం మార్పు అవసరాన్ని వివరించి ప్రోత్సాహకరమైన మాటలతో వారికి మార్గనిర్దేశం చేశారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి కౌన్సిలింగ్ కార్యక్రమాలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

## మహా శివరాత్రి సందర్భంగా అన్నసమారాధన

**గాజువాక,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**



మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలం దేవస్థానంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో గాజువాక యువత సేవలందించారు. జీవీఎంసీ 71వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్, బాలగణపతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాపరావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యువకులు శ్రీశైలం చేరుకున్నారు. బాబా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ అన్నసేవలో గత రెండు రోజులుగా సుమారు 20 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సంస్థ అధినేత పిడిశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. శివరాత్రి మూడు రోజుల్లో సుమారు 30 వేల మందికి అన్నసేవ అందించనున్నట్లు తెలిపారు. ప్రతాపరావు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా శివరాత్రి సందర్భంగా భక్తుల సేవలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో పక్కి సతీష్, కొత్తూరు సంతోష్, నడిగెట్ల తారాకేశ్, పక్కి ఈశ్వర్, వెంకటేష్, గొంతిన వినోద్ కుమార్ తదితర 30మంది యువకులు పాల్గొన్నారు.

## విశాఖలో మహాశివరాత్రికి కట్టుదిట్టమైన బందోబస్తు

- ప్రముఖ శివాలయాల వద్ద విస్తృత భద్రతా ఏర్పాట్లు

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విశాఖ నగర పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు అన్నీ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రముఖ శివాలయాల వద్ద భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. డీసీపీ1 మణికంఠ, డిసిపి 2 మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో సంబంధిత జోన్స్ ఏసిపిలు బందోబస్తును స్వయంగా పర్యవేక్షించారు. వెస్ట్ జోన్ పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రహ్లాదపురం, పల్లి నారాయణపురం, వేపగుంట, చీమలపల్లి, చింతగట్ల అగ్రహారం, నరవ, జెర్రిపోతులపాలెం, సత్తివానిపాలెం, చినముషిడివాడ, సరిపల్లి, ప్రశాంతినగర్, సాధుమఠం, నల్ల క్వారీ తదితర ప్రాంతాల్లోని శివాలయాల వద్ద పెందుర్తి సిఐ సతీష్ కుమార్ ప్రత్యేక భద్రత కల్పించారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ల ఏర్పాటు, పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టగా, రాత్రి వేళల్లో అదనపు పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీసులు చేపట్టిన సమగ్ర భద్రతా ఏర్పాట్లపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని అధికారులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులు భద్రతా క్రమశిక్షణ పాటించి పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే సమాచారం అందించాలని కోరారు.

## మహాశివుని విగ్రహానికి వస్త్రధారణ

**ఆరిలోవ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక 12వ వార్డు పెదగదిలి స్మృతివన వాటిక వద్ద ఉన్న మహా శివుని విగ్రహానికి ఆదివారం వస్త్రధారణ చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైకాపా సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాస్ హాజరై ఆయన చేతుల మీదుగా వస్త్రధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మృతి వాటికలో శివుని విగ్రహం ఏర్పాటు చేయడంలో కృషి చేయడంతో పాటు తన సొంత నిధులతో స్మృతి వాటిక అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న బొట్ల అప్పలరాజును ప్రత్యేకంగా అభినందించారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- టూ టౌన్ సీఐ ఎర్రం నాయుడు హెచ్చరిక

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**

రౌడీషీటర్లు చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎర్రం నాయుడు ఆదివారం హెచ్చరించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆయన రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఎర్రం నాయుడు రౌడీషీటర్లను కట్టుబడి, సమాజానికి హాని చేయకుండా సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. "అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రతి రౌడీషీటర్ పై పోలీసు నిఘా కొనసాగుతోంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఏ విధమైన ఉపేక్ష లేదు," అని ఆయన పేర్కొన్నారు. రౌడీషీటర్లకు ప్రత్యేక ఆదేశాలు, స్టేషన్‌లో సంతకాలు తప్పనిసరిగా చేయడం, బయట ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు స్టేషన్ అధికారుల అనుమతి తీసుకోవడం, అనుమానాస్పద కదలికలు గమనించినప్పుడు వెంటనే అదుపులోకి తీసుకోవడం, బైండోవర్ ప్రక్రియ కొనసాగించడం వంటి సూచనలు ఇచ్చారు. కౌన్సెలింగ్‌లో భాగంగా, రౌడీషీటర్లకు మంచి భవిష్యత్తు కోసం మార్పు అవసరాన్ని వివరించారు. సమాజంలో గౌరవప్రదమైన వ్యక్తులుగా మారేందుకు పోలీస్ సహకారంతో ప్రయత్నించడమని, చట్టానికి లోబడి జీవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## నార్త్ జోన్ అభివృద్ధి పనులకు శ్రీకారం : మేయర్ పీలా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



:మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో అన్ని జోన్‌ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన జీవీఎంసీ నార్త్ జోన్ పరిధిలోని మాధవధార మారియట్ హోటల్ జంక్షన్ ఎన్ జి జి వో ఎస్ కాలనీ, నరసింహనగర్, ఏ ఎస్ ఆర్ నగర్, సీతమ్మధార గిరి ప్రదర్శన రోడ్డు తదితర ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులకు జీవీఎంసీ నుండి సుమారు రూ.30.90 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు పి. విష్ణుకుమార్ రాజు తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ అభివృద్ధికి ఎంతో సహకరిస్తుందని, 2026 27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు భారీ స్థాయిలో నిధులు కేటాయించారని, అలాగే 530 పైగా ప్రధాన ప్రాజెక్టులు, 15 కోట్లతో మెట్రో రైలు, అలాగే అన్ని వర్గాలకు సంక్షేమానికి భారీ స్థాయిలో నిధులు కేటాయింపు జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వముతోనే రాష్ట్ర అభివృద్ధితోపాటు విశాఖ అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. విశాఖ నార్త్ జోన్ అభివృద్ధికి శాసనసభ్యులు నిరంతరం కృషి చేస్తున్నారని అలాగే సుమారు 30 కోట్ల రూపాయలతో సీతమ్మధార గిరి ప్రదర్శన రోడ్డు అభివృద్ధికి, మారియట్ హోటల్ జంక్షన్ నుండి ఎన్ జి జి ఓ కాలనీ వరకు, నరసింహ నగర్ జంక్షన్, ఏ ఎస్ ఆర్ నగర్ తదితర ప్రాంతాలలో వి ఆర్ సి సి ఎస్ డబ్ల్యు కాలువలు, కల్వర్టు స్లాబ్, ఫుట్ పాత్ టైల్స్, తారు రోడ్డు నిర్మాణాలు మొదలైన పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, విశాఖ ప్రపంచ స్థాయిని ఆకట్టుకునే విధంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. సుమారు 30 కోట్ల రూపాయలతో నార్త్ జోన్ అభివృద్ధికి నేడు శ్రీకారం చుట్టామని అలాగే ఉత్తర నియోజకవర్గం లో పేద ప్రజల కొరకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో సుమారు 28 వేల కోట్లు విశాఖ నగరానికి కేటాయింపు చేయడమైనదన్నారు.డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, విశాఖ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పట్టాభిరామ్, బిజెపి ఫ్లోర్ లీడర్ 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత, కార్పొరేటర్లు అల్లు శంకర్, వి. ప్రసాద్, అనిల్ కుమార్ రాజు,రెయ్యి వెంకటరమణ, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు ప్రవీణ్, కార్యనిర్వహక ఇంజనీరు పద్మావతి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ భరణి, ఇతర నాయకులు నజీర్, ఉషా కిరణ్, సురేష్ బాబు, శ్యామల దీపికా తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో ఐసీపీ 2026 సందడి

- రాష్ట్రపతి సమక్షంలో నేవీ శోభాయాత్ర
- ఐఎఫ్ఆర్, మిలాన్, ఐఓఎన్ఎస్ ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ కు నగరం సిద్ధం

నేటి నుంచి 19 వరకు బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



భారత నౌకాదళం ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ సముద్ర ఉత్సవాలు "ఐఎఫ్ఆర్, మిలాన్, ఐఓఎన్ఎస్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్-2026 (ఐసిపి-2026) కార్యక్రమాలకు విశాఖపట్నం నగరం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 16 నుంచి 19 వరకు రామకృష్ణ బీచ్ రోడ్‌లో పరేడ్‌లు, నౌకాదళ విన్యాసాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు భారత రాష్ట్రపతి, కేంద్ర రక్షణ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తదితర ప్రముఖులు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. 16, 17 తేదీల్లో రిహార్సల్స్ ఫిబ్రవరి 16, 17 తేదీల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బీచ్ రోడ్‌లో సముద్రం వైపు సగం రహదారిని నేవీ పరేడ్ కోసం కేటాయించారు. ఆ సమయంలో ఎన్టీఆర్ సర్కిల్, పార్క్ హోటల్ జంక్షన్ వద్ద వాహనాలకు డైవర్షన్లు అమలు చేస్తారు. ఆ రోజుల్లో బీచ్ సందర్శనకు సాయంత్రం 6 గంటల తర్వాత మాత్రమే రావాలని పోలీసులు సూచించారు. 18న ఫుల్‌డ్రెస్ రిహార్సల్, 19న ఐసీపీ-2026 ఫిబ్రవరి 18న ఫుల్‌డ్రెస్ రిహార్సల్, 19న అంతర్జాతీయ సిటీ పరేడ్ జరుగనున్నందున మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు పాస్‌లు లేని వాహనాలను బీచ్ రోడ్‌లో అనుమతించరు. కలెక్టరేట్ నుంచి నావల్ కోస్టల్ బ్యాటరీ వరకు, సీఆర్‌రెడ్డి సర్కిల్ నుంచి ఆల్ ఇండియా రేడియో, పాండురంగాపురం, నోవోటెల్, సెంచరీ క్లబ్, పార్క్ హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన ఆంక్షలు ఉంటాయి. పాస్‌లున్న వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ రెడ్, డార్క్ బ్లూ (వీఐపీ), ఆరెంజ్, యెల్లో, గ్రీన్, బ్లూ, గోల్డ్ రంగు పాస్‌లున్న వాహనాలకు వేర్వేరు పార్కింగ్ స్థలాలు కేటాయించారు. ఏపీఐఐసీ గ్రౌండ్, ఏయూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ గ్రౌండ్, ఏయూ జిమ్నాసియం గ్రౌండ్‌లలో వాహనాలు నిలిపి, అక్కడి నుంచి కాలినడకన గ్యాలరీలకు చేరుకోవాలి. సాధారణ వాహనదారులకు మార్గదర్శకాలు రుషికొండ, ఎంవీపీ, కురుపాం సర్కిల్ వైపు నుంచి వచ్చే వాహనదారులు ఎంజీఎం గ్రౌండ్‌లో పార్క్ చేసి, స్టెప్స్ లేదా ఆల్ ఎబిలిటీస్ పార్క్ మార్గంగా బీచ్‌లోకి ప్రవేశించాలి. ఎంజీఎం గ్రౌండ్ నిండిన పక్షంలో సమతా హాస్టల్ గ్రౌండ్ లేదా మెంటల్ హాస్పిటల్ రోడ్‌లో సింగిల్ లైన్ పార్కింగ్ చేయాలి.ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ, సెవెన్ హిల్స్, కేజీహెచ్ వైపు నుంచి వచ్చే వారు జిల్లా పరిషత్ ప్రాంగణం, ఆంధ్ర మెడికల్ కాలేజ్ క్రికెట్ గ్రౌండ్ లేదా జూబ్లీ గ్రౌండ్ (టూ వీలర్స్ మాత్రమే) వద్ద వాహనాలు నిలిపి కాలినడకన రావాలి. ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక ఏర్పాట్లు ఆర్టీసీ బస్సులు జగదాంబ లేదా జీసీసీ జంక్షన్ వద్ద ప్రయాణికులను దింపుతాయి. అక్కడి నుంచి కాలినడకన బీచ్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. హోల్డింగ్ ప్రదేశాలు బీచ్ గ్యాలరీలు నిండిన తర్వాత ప్రజలను ఏయూ సమతా హాస్టల్, ఎంజీఎం గ్రౌండ్, గురజాడ కళాక్షేత్రం, సెంట్రల్ పార్క్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్క్రీన్ల వద్ద నిలుపుతారు. భారీ వాహనాలపై ఆంక్షలు ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు కాన్వెంట్ జంక్షన్-షీలానగర్, కాన్వెంట్-సింధియా మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. గాజువాక వైపు నుంచి వచ్చే వాహనాలు జింక్ గేట్, బీహెచ్‌పీవీ మార్గాలు ఉపయోగించాలి. రహదారులపై ఎక్కడా భారీ వాహనాలు పార్కింగ్ చేయరాదని స్పష్టం చేశారు. స్థానికులకు సూచనలు నావల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు బీచ్ రోడ్‌లో నివసించే వారు అవసరమైతే ఆధార్ కార్డు చూపించి ప్రత్యామ్నాయ మార్గంలో అనుమతి పొందవచ్చు. అత్యవసర సేవలకు మార్గాలు అంబులెన్సులు, వీఐపీ ఎస్కార్ట్ వాహనాలకు చిన్నవాల్తేరు-సిరిపురం మార్గం ద్వారా ప్రత్యేక డైవర్షన్ కల్పించారు.అంతర్జాతీయ ప్రాధాన్యం కలిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు ట్రాఫిక్ సూచనలు పాటించి పోలీసులకు సహకరించాలని నగర పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## విజయవంతంగా ముగిసిన కమ్యూనిటీ ఔట్రీచ్ డ్రైవ్

**ఆరిలోవ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



పీనామ్ కేర్స్, బైరెడ్డి ఫౌండేషన్ కలిసి విశాఖలో చేపట్టిన కమ్యూనిటీ ఔట్రీచ్ డ్రైవ్ ను విజయవంతంగా నిర్వహించారు. బృందా బ్లైండ్ స్కూల్ ఎండాడ, ఇందిరానగర్ లో ఉన్న ఆనంద మార్గ్ అనాధాశ్రయన్ని వీరు సందర్శించి 70 మందికి పైగా పిల్లలకు మద్దతునిచ్చారు. ఈ డ్రైవ్ కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో పాటు ఉద్యోగుల విరాళాలు ద్వారా కిరాణా సామాగ్రి, అవసరమైన సామాగ్రిని సేకరించడం పై దృష్టి సారించి లక్ష రూపాయలు నగదును ఉపయోగించారు. ఫెనోమ్ లోని వీపీ హెచ్ ఆర్ ఎన్ టి ఏ శ్రీనివాస్ పిండి మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న సమాజాలలో సానుకూల, స్థిరమైన ప్రభావాన్ని సృష్టించేందుకు మా నిరంతర నిబంధన ప్రతిబింబిస్తుంది అన్నారు. మా ఉద్యోగుల ఉత్సాహ భరితమైన భాగస్వామ్యం మా సమిష్ఠ బాధ్యత కరుణా యొక్క బలాన్ని ప్రదర్శిస్తుందన్నారు. భవిష్యత్తులో విద్యా సంక్షేమం సమాజ అభివృద్ధికి మద్దతు ఇచ్చే లక్ష్యంతో మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని యోచిస్తుందన్నారు.

## అలల పాశంలో యువజీవితం! విశాఖలో పండగరోజు విషాదం

- రుషికొండ బీచ్ లో స్నేహితుడిని కాపాడుతూండగా విద్యార్థి మృతి..

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**





పండగ రోజు సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన బీటెక్ విద్యార్థి అలల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నగరంలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఋషికొండ బీచ్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం పండగ, సెలవుదినం కావడంతో ఆరుగురు బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రుషికొండ బీచ్‌కు వెళ్లారు. వారిలో ఐదుగురు సముద్రంలో స్నానానికి దిగారు. ఈ సమయంలో ఒక్కసారిగా అలలు ఉధృతంగా ఎగిసిపడటంతో పి. అరవింద్ కృష్ణ (22) లోతువైపు కొట్టుకుపోయాడు. దీన్ని గమనించిన అతని స్నేహితుడు రాజీవ్ వెంటనే నీటిలోకి దిగి కాపాడేందుకు ప్రయత్నించాడు. అయితే బలమైన కెరటాల ధాటికి అతడూ కొట్టుకుపోయాడు. మిగిలిన స్నేహితులు ఆందోళనతో అరవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డులు, బోటింగ్ సిబ్బంది అప్రమత్తమై సముద్రంలోకి దిగి ఇద్దరినీ ఒడ్డుకు తీసుకొచ్చారు. ఇద్దరిలో అరవింద్ కృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. రాజీవ్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.మృతుడు రాజమండ్రి స్వస్థలంగా ఉండి, విశాఖలోని గాయత్రి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలలు ఉధృతంగా ఉన్న సమయంలో సముద్రంలోకి దిగరాదని, లైఫ్ గార్డుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు ప్రజలకు సూచించారు.

## అట్టహసంగా ముగిసిన మాఘ మాసపు నాల్గవ ఆదివారం వేడుకలు

**మాధవధార :ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**





మాఘమాసం నాల్గవ ఆదివారం,శివరాత్రి కావడంతో ఆదివారం నాడు మాధవధారలో గల శ్రీ లీలా మాధవస్వామి దేవాలయం, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.మాఘమాసం నాల్గవ ఆదివారం,శివరాత్రి సందర్భంగా మాధవస్వామి దేవాలయం,భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.వేకువ జాము నుంచే ఆలయ అర్చకులు సనపల వరహానరసింహం,సనపల శ్రీనివాసం,సనపల గోవింద,సనపల రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో,భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు.జలధార వద్ద భక్తులు స్నానమాచారించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. శ్రీనివాస్ శర్మ పరమేశ్వరునికి విశేష అభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించి వచ్చిన భక్తులు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఏటా మాఘమాసంలో మాధవ స్వామి ఆలయంలో ఆలయంలో ఉత్సవాలు జరగడం సంప్రదాయంగా వస్తోంది.జలధార ప్రాంతం అంత జనసంద్రంగా మారి కొలహాలంగా మారింది.ఆలయ ప్రాంగణంలో సనపల.సూర్యనారాయణ,అన్నపూర్ణమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సనపల సత్యనారాయణ,పద్మావతి దంపతులచే భక్తులకు ఉదయం ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని వావిలపల్లి భాను చేతుల మీదుగా పంపిణీ చేశారు.మధ్యాహ్నం నుంచి మాధవస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ వ్యాపారి మూల గోవిందరావు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారి కుటుంబ సభ్యులు ప్రారంభించారు.సుమారు వెయ్యి మంది విచ్చేసి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.ప్రతి ఏడాది మాఘ మాస ఉత్సవాలు ఇదే విధంగా నిర్వహిస్తున్నామని,మాఘ మాస ఉత్సవాలకు సహకరించిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో పప్పల వరహానరసింహం తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రారంభమైన దిల్సే హైదరాబాది హలీం" విక్రయ కేంద్రం

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విశాఖ నగర వాసులకు ప్రత్యేక రుచులను అందిస్తున్న "దిల్సే హైదరాబాది హలీం" విక్రయ కేంద్రం ఆదివారం ఆసిల్ మెట్ట జంక్షన్ సమీపంలోని కే.ఏ. పాల్ ఫంక్షన్ హాల్ వేదికగా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ సీతమ్మరాజు సుధాకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతమ్మరాజు సుధాకర్ మాట్లాడుతూ, విశాఖ నగరంలో గత 15 సంవత్సరాలుగా నిర్వాహకుడు షేక్ జుబేర్ నాణ్యమైన, రుచికరమైన హలీంను అందిస్తూ ప్రజల ఆదరణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు కఠిన ఉపవాసం పాటించి సాయంత్రం ఉపవాస విరమణ సమయంలో హలీంను తీసుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. శక్తివంతమైన ప్రోటీన్లు, ధాన్యాలు, మాంసాహార పదార్థాలతో తయారయ్యే హలీం తక్షణ శక్తిని అందించే పోషకాహారంగా విశేష ప్రాధాన్యతను సంతరించుకుందని ఆయన వివరించారు. అలాగే ఇలాంటి ఆహార విక్రయ కేంద్రాలు స్వచ్ఛత, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు సేవలందించడం ఎంతో అవసరమని, నిర్వాహకులు అదే దిశగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రంజాన్ మాసంలో సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించే విధంగా ఈ హలీం కేంద్రం నిలవాలని ఆకాంక్షించారు. సెంటర్ నిర్వాహకుడు షేక్ జుబేర్ మాట్లాడుతూ, గత 15 ఏళ్లుగా విశాఖ వాసుల ప్రేమాభిమానాలతో హలీం విక్రయాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నానని తెలిపారు. ప్రతి సంవత్సరం జగదాంబ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసే ఈ హలీం కేంద్రాన్ని, ఈ ఏడాది ట్రాఫిక్ మరియు పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా ఆసిల్ మెట్ట జంక్షన్ సమీపంలోని కే.ఏ. పాల్ ఫంక్షన్ హాల్ వద్దకు మార్పు చేసినట్లు వెల్లడించారు. వినియోగదారులకు సౌకర్యవంతమైన పార్కింగ్ మరియు విశాలమైన ప్రాంగణం అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విశాఖ ప్రజలు ప్రతి ఏడాది హలీంను విశేషంగా ఆదరిస్తున్నారని, ఈ ఏడాది కూడా అదే విధంగా ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. నాణ్యమైన పదార్థాలతో, సంప్రదాయ పద్ధతిలో హలీం తయారు చేసి అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ రావు, 42 వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల శ్రీను లీలావతి,టిడిపి 31వ వార్డు అధ్యక్షులు బత్తిన నవీన్, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, విశాఖ నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## చంద్రమౌళీశ్వరునికి విశేష అభిషేకములు

**విశాఖపట్నం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**




అస్సాం గార్డెన్స్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా గల దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయఈవో డి సురేష్ బాబా సారధ్యంలో ఆలయ అర్చకులు జి భార్గవ శర్మ నేతృత్వంలో శైవ ఆగమ సాంప్రదాయంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామివారికి అభిషేకములు , మహన్యాస పూర్వక రుద్రాభిషేకము , ప్రత్యేక పూజలు, అర్చనలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించి ధూప దీప నైవేద్య మంత్రపుష్పములు సమర్పించారు . ఆలయ సన్నిధిలో పూజాది కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులు పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు . వేడుకగా నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ఈవో డి సురేష్ బాబా , ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ ఆలయ సిబ్బంది స్థానికులు పరిసర ప్రాంత వాసులే కాకుండా వివిధ ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు .

## మహాశివరాత్రి పర్వదినాన శివాలయాల సందర్శన

- ప్రజల శ్రేయస్సు కోరిన కర్రి సాయికృష్ణ

**విశాఖపట్నం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**




మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక మండలంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన వెంకటాపురం గ్రామంలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి దేవాలయం మరియు ఒంపోలు గ్రామంలోని శ్రీ సదానందేశ్వర స్వామి వారి ఆలయాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ దర్శించుకున్నారు.టిడిపి మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్‌తో కలిసి శివయ్యను దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి, విశేష ఆరాధనలు చేశారు.అనంతరం శివయ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కర్రి సాయికృష్ణ మనస్ఫూర్తిగా ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ దొడ్డి రమేష్, ఉల్లింగల గోవింద్, కడియం అనురాధ, ఆడారి కాశీ, ఉల్లింగల సంతోష్, రౌతు నాగ అప్పారావు, దాడి గంగాజీ గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

**మధురవాడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**





ఆదర్శనగర్, మధురవాడ బ్రాంచ్ లకు సంబంధించి శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు స్కూల్ కరస్పాండెంట్ ముని మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుతో పాటు కమిషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్ ఎం నారాయణమూర్తి నాయక్, సిఆర్పిఎఫ్ 2 ఇన్ కమాండెంట్ బిష్ణు చరణ్ ముఖ్నాయా హాజరయ్యారు. అనంతరం వేడుకల్లో వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో కూడా ప్రవేశించడానికి ప్రయత్నించాలని, ముఖ్యంగా విద్యార్థులకు మంచి, చెడుల పై అవగాహన ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తల్లితండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, లక్ష్యాన్ని నిర్ణయించుకొని లక్ష సాధన కోసం మీరు అహర్నిశలు కష్టపడాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలతో విద్యార్థులు స్టేజ్ పై ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యంగా మహాశివరాత్రి గొప్పతనాన్ని తెలిపే విధంగా ప్రదర్శించిన ప్రదర్శన అందరినీ ఆకర్షితులను చేసింది. ఈ వేడుకల్లో స్కూల్ ఇంచార్జ్ శశికళ టీచర్, జ్యోతి టీచర్, ఉమా, భార్గవి తో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

vsp - 11_vsp - 11.qxd 2/16/2026 1:13 AM Page 1



# ఘనంగా మహాశివరాత్రి వేడుకలు హాజరైన స్పీకర్, ఎంపీ, ఎమ్మెల్యే

**చోడవరం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
:చోడవరం నియోజకవర్గ పరిధిలో గల రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కళ్యాణపులోవలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు చొరవతో ముందుగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభాధిపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు,రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కే.ఎస్.ఎన్.ఎస్ రాజు,అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ,డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజ స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన స్నానఘట్టానికి ప్రజా ప్రతినిధులు చేరుకుని గంగమ్మ వారికి ప్రత్యేక



ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం కల్యాణపులోవలో కొలువుదీరిన పోతురాజుబాబు పెద్దింటమ్మ వారిని దర్శించుకున్నారు.తదనంతరం శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించిన అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా వడ్డించారు.ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ,ఎంపీ సి.ఎం రమేష్ భక్తులకు అభివాదం చేస్తూ ప్రత్యేకంగా మహిళలకు మహాశివ రాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆధ్యాత్మికతతో సమాజంలో ఐక్యత శాంతి నెలకొనాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులు తగు భద్రత చర్యలు చేపట్టారు. భక్తులు సౌకర్యం ఆర్టీసి వారు ప్రత్యేక బస్సులు నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంఘాల వారు భక్తులకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవలు నిర్వహించారు.




## ఆచార్యులను సత్కరించిన శ్రీహరిరాజు

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



మండలంలో ఆదివారం రేబాక గొట్టుముక్కల శ్రీహరిరాజు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నిర్మించనున్న శివాలయ ప్రాంగణంలో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, పురోహితులు శ్రీపాద సత్య భాస్కర ప్రసాద్ లను శ్రీహరిరాజు చేతులమీదుగా ఘనంగా సత్కరించారు .మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన పూజలకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజయయ్యారు .ఈకార్యక్రమంలో దుర్గాభవాని పీఠం వ్యవస్థాపకుడు దవరశింగి రాంబాబు,గ్రామప్రజరు అశేష సంఖ్యలో పాల్గొన్నారు

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

**కసింకోట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త;**





కశింకోట మండలంలో ఉన్న మేజర్ పంచాయతీ కశింకోట లో గల 600 సంవత్సరాల చరిత్ర కలిగిన సర్వ మంగళంభ సమేత త్రిపురాంతక స్వామి ఆలయము, వెదురుపర్తి లో గల 300 సంవత్సరాల చరిత్ర కలిగిన స్వయంభు శివుని ఆలయము, బయ్యవరం, తాళ్లపాలెం, ఏఎస్ పేట, తదితర గ్రామాల్లో గల శివాలయాల్లో భక్తులు తాకిడితో కిటకిటలాడాయి. ఆయా దేవాలయాల్లో తెల్లవారుజామునుండి అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట త్రిపురాంతక స్వామి ఆలయ అర్చకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ అనకా పల్లి జిల్లాలో బ్రహ్మ సూత్రం గలిగిన శివలింగాలు రెండు ఉన్నాయన్నారు. అవి ఒకటి కశింకోట లోనూ రెండవది వెదురుపర్తి లోను ఉన్నాయన్నారు. ఈ శివలింగాలు చాలా విశిష్టత కలిగి భక్తుల కోరిన కోరికలు తీర్చే శివాలయాలన్నారు. బ్రహ్మసూత్రం అంటే శివలింగం మీద ప్రత్యేకమైన గీత లాగా ఉంటుందని ఆ ప్రత్యేకత కలిగిన శివలింగ దర్శనం మహాభాగ్యం అన్నారు. శివరాత్రి సంద ర్భంగా ఆలయాల్లో రాత్రికి రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో జ్వాలా హారతి ఇవ్వనున్నట్లు తెలిపారు.భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**కసింకోట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త;**



కసింకోట మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి నూకరాజు 26వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు, జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు కసింకోట లో గల శ్రీ నూకాంబిక ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులు పళ్ళ ముసిలి అప్పారావు, మలసాని రమణశ్రీ లకు ఘనంగా సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి పాఠశాల విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వీరన్న కొండపై ఆకాశ దీపాలు..

**ఎలమంచిలి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



పట్టణములోని వీరన్న కొండపై శివరాత్రి సందర్భంగా గత 20 సంవత్సరాల నుండి భక్తులు ఆకాశ దీపాలు వెలిగిస్తున్నారు. పట్టణ ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు .కొండపై దీపాల వెలిగిస్తున్నప్పుడు ఎంత చీకటైనా దీపాలు వెలిగిస్తే ఎంతో అదృష్టంగా భావిస్తూ ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతికిన శెట్టి వెంకట్రావు, అత్తిలి నూకరాజు, వియ్యపు సత్తిబాబు, గుర్రాల రాము, బి చంటి, డి నాగు, ఎస్ అశోక్, కే తేజ, పాల్గొన్నారు.

## 17న జరిగే చలో విజయవాడకు తరలి రండి..

**- విజయవంతం చేయండి "టి ఆర్ అంబేద్కర్ "**

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



పిఆర్సి సాధన కోసం ఈనెల 17వ తేదీన యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం విశాఖపట్నం జిల్లా యుటీఎఫ్ కార్యాలయం నందు జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశం లో జిల్లా ప్రధాన కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ 12వ పిఆర్సి 2023 జూలై నుండి అమలు కావలసి ఉండగా నేటికీ కనీసం పిఆర్సి కమిషన్ను నియమించకపోవడం దుర్మార్గమని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలని, 29 ఫిట్మెంట్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పెండింగ్ డిఏ లను చెల్లించాలని, మెమో 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధన కొరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17 న నిర్వహించే చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. అప్పారావు, జిల్లా అధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, జిల్లా సహాధ్యక్షులు ముత్యాల నాయుడు, విజయ కుమారి, కోశాధికారి కే. రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం ఎం. రామకృష్ణ, మహమ్మద్ రిజ్వాన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వివిగిరి, అడిగర్ల శ్రీనివాస్, ఎన్. కుమారి, వీధి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## శివాలయంలో పూజలు నిర్వహించిన వైకాపా నాయకులు

**(నక్కపల్లి /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త )**



మహాశివరాత్రి పర్వదినము పురస్కరించుకొని మండలంలోని అమలాపురం శివారు పాటిమీద గ్రామం లో ఉన్న రామలింగేశ్వరస్వామి లని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ దర్శించుకున్నారు. స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వారితోపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు), బంగార్రాజు (మణి రాజు), గొర్ల గోవిందు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సూర్యకాసులు గోవిందు, రోకళ్ళ శ్రీనివాస్, రావి చిన్ని, మాజీ సర్పంచ్ తాతారావు తదితరులు దర్శించుకున్నారు. వారికి అర్చకులు అన్న ప్రసాదం అందజేశారు.

## బడ్జెట్‌లో విద్య రంగానికి అధిక ప్రాధాన్యత

**- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు**

**అనకాపల్లి ఫిబ్రవరి 15 (ప్రభాత వార్త)**




రాష్ట్ర బడ్జెట్లో విద్య రంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ 11 కేటాయించడం అభినందనీయమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా పి ఆర్ టి యు కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 202627 ఆర్థి సంవత్సరానికి 3, 32,205 కోట్ల రూపాయలతో స్వర్ణాంధ్ర 2047 ధ్యేయంగా చాలా మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ బడ్జెట్ విద్యా రంగానికి అధిక శాతం సుమారు 11 బడ్జెట్ ను కేటాయించడం జరిగినది. దీనివలన విద్యారంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో విశ్రాంత ఉపాధ్యా యుల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి బుద్ది కాశీవిశ్వేశ్వర్ రావు, విశ్రాంత ఉపాధ్యాయులు కాండ్రేగుల సత్యనారాయణ, అనకాపల్లి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కృష్ణ, పి. ఆనందరావు జీవీఎంసీ పిఆర్టియు కార్యదర్శులు దాడి అప్పలనాయుడు, అర్జున్, రాష్ట్ర నాయకులు జి. అప్పారావు, జనార్ధన్, ఏవి. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు

**తొలి దర్శనం చేసుకున్న చోడవరం ఎమ్మెల్యే రాజు**

**చోడవరం,ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



హర హర మహాదేవ శంభో శంకర అన్న శివనామ స్మరణతో చోడవరం మండలంలో గల శివాలయాలు అన్ని మారుమోగాయి. మహాశివరాత్రి పురస్కరించుకొని అన్ని శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. అందునా ఆదివారం కావడంతో ఆలయాలనికి కుటుంబ సభ్యులందరూ కలిసి అర్చనలు అభిషేకాలు పరమశివునికి నిర్వహించారు. భక్తజనం క్యూలు కట్టి మరి పరమేశ్వరుని దర్శించుకున్నారు. భక్తులు తాకిడి అధికంగా ఉండటంతో ఆయా ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో మండలంలోని గవరవరం లక్కవరం, జుత్తాడ, రాయపురాజుపేట ,వెంకన్నపాలెం, గోవాడ లోని కాశీ విశ్వేశ్వరాలయాలు, ముద్దుర్తి సంఘమే స్వరాలయం అశేష భక్త జనాలతో కిటకిటలాడాయి. శివునికి గోత్రనామాలతో పూజలు చేశారు. మహాశివరాత్రి రోజున చోడవరంలో గల గంగా సహిత స్వయంభు గౌరేశ్వర స్వామిని దర్శించిన కాశి క్షేత్రంలో శివుని దర్శించిన పుణ్యం లభిస్తుందన్న చారిత్రాత్మక ఆధారాలు అనుసరించి స్థానిక గౌరీ స్వరాలయానికి ప్రజాప్రతినిధులు తో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుండి ఆలయం వద్ద భక్తులు శివనామస్మరణ జపిస్తూ, ధ్వజస్తంభాల వద్ద, తులసి కోటల వద్ద, ఉప ఆలయాల వద్ద దీపారాధనలు చేయడంతో గౌరీ శివాలయం శివనామస్మరణతో మారుమోగింది. ఈ ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న వారిలో 9వ అదనపు జిల్లా జడ్జి హరి నారాయణ, ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు,తహసీల్దార్ ఏ. రామారావు, ఎంపీడీవో సీతారామస్వామి,గూనూరు మల్లు నాయుడు, పెదబాబు, సకురు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.వీరందరికీ ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, అర్చకులు కొడమంచిలి చలపతి,శ్రీనివాస్, తదితరులు స్వాగతం పలికారు.అలాగే గౌరీ పార్వతీ దేవికి కుంకుమ పూజలు విశేష దీపారాధనలు చేశారు . ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు కీర్తనలు సాంస్కృతి కార్యక్రమాలు కోలాటాలు వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చోడవరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు ఈనెల 18 వరకు గౌరేశ్వర స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

## ఎం.పీ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణానికి ఎంపీ శంకుస్థాపన


**చోడవరం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



చోడవరం నియోజకవర్గం పరిధిలో గల బుచ్చయ్యపేట మండలం చిన్నప్పనపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని పి. భీమవరం జంక్షన్ వద్ద 202526 ఆర్థిక సంవత్సరానికి గాను సుమారు అయిదు లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న బస్ షెల్టర్ నిర్మాణానికి రైల్వే స్టాండింగ్ చైర్మన్ అనకాపల్లి పార్ల మెంట్ సభ్యులు డా. సి.ఎం రమేష్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ప్రాంత ప్రజలకు వర్షం,ఎండల సమయంలో రక్షణ కల్పించే విధంగా ఈ బస్ షెల్టర్ ఉపయోగపడుతుందని ఎంపీ పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలియజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఈర్లే శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ స్థానిక ప్రజలు కోరిన వెంటనే ఎంపీ నిధులు సమకూర్చి బస్ షెల్టర్ నిర్మాణానికి సహకరించిన ఎంపీ సిఎం రమేష్ కి చుట్టుపక్కల గ్రామాల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తమరాన దాసు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మారుమోగుతున్న శివుని ఆలయాలు..

**ఎలమంచిలి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



మహాశివరాత్రి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని మండలాల్లో గల దైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ముక్కంటికి జలాభిషేకం చేసి పత్రి సమర్పిస్తున్నారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. శివుని దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఓం నమః శివయ్య పంచాక్షరి మంత్రంతో ఆలయాలు మారుమోగుతున్నాయి. పట్టణంలోని త్రిమూర్తులు స్వామి ఆలయంలో, కొత్తపేట శివాలయంలో, శేషు గెడ్డ వద్ద శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గం లోని రాంబిల్లి మండలం పంచదారల లోగల ఉమా ధర్మ లింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .దేవస్థానం అధికారులు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. భక్తులకు మంచి నీటితోపాటు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## రాజయ్యపేట చుట్టూ సీసీ కెమెరాలు పర్యవేక్షించిన సీఐ "మురళి"

**(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)**



అత్యంత ప్రతిష్టాత్మంగా మత్స్యకారులు జరుపుకునే కులదైవం అయిన నూకతాత పండగ సందర్భంగా ఎటువంటి సంఘటనలు జరగకుండా రాజయ్యపేట గ్రామం చుట్టూ సీసీ కెమెరాలు అమర్చారు. ప్రధానమైన ఆలయం ప్రధాన ద్వారం వద్ద సముద్రానికి వెళ్లే మార్గంలోనూ రామాలయం వద్ద ప్రధానమైన రహదారి మార్గంలో నాలుగు కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన కెమెరాలను సిఐ జూరెడ్డి మురళి ఆదివారం పరిశీలించారు. ఎప్పటికప్పుడు పూర్తిస్థాయి వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆయనతోపాటు మహిళా ఎస్సై సాహిబా అంజుమ్ ఉన్నారు.

## నూకాంబిక ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి ఫిబ్రవరి 15 :(ప్రభాత వార్త)**



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులను మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ఆదివారం పరిశీలించారు. త్వరలోనే పునః ప్రారంభం కానున్న అమ్మవారి నూతన దేవాలయ ప్రారం భోత్సవం నకు మిగిలి ఉన్న పనులను , త్వరలో నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవ ఏర్పాట్లును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. అనంతరం నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, ధర్మకర్తలు, కార్యనిర్వాహణ అధికారి వై శ్రీధర్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు

## బోగలింగేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన కొణతాల

**అనకాపల్లి ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త)**



మహా శివ రాత్రి పర్వదిన సందర్భంగా గవరపాలం శ్రీ బోగలింగేశ్వర స్వామి వారికి మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రామకృష్ణ ని పూర్ణకుంభం తో మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. కమిటీ సభ్యులు సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎస్ఎఫ్ఎస్ సత్యనారాయణ , ధర్మకర్తలు పాల్గొన్నారు.

## మూలనపడిన శిలాఫలకాలను తిరిగి పునరుద్ధేస్తాం

**వైసిపి నేతలకు ఎమ్మెల్యే కొణతాల భరోసా**

**అనకాపల్లి ఫిబ్రవరి 15 :(ప్రభాతవార్త)**



మా ప్రభుత్వ ఆయాంలో నూకాంబిక ఆలయ నిర్మాణ పనులకు అడ్డు వస్తున్నాయని మా పార్టీకి చెందిన అప్పుడు ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ శిలాఫలకాన్ని అప్పుడే మా పాలకవర్గ సభ్యులము స్వచ్ఛందంగా తొలగించి వేరే చోట భద్రపరిచాము. దేవాలయ నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ తరుణంలో ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించే ప్రజాప్రతినిధుల శిలాఫలకాలు ఎలాగైనా ఉంటాయి. వాటితోపాటు మా పాలకవర్గంలో తొలగించి పక్కనపెట్టిన అప్పటి మంత్రి వైసిపి నేత అమర్నాథ్ శిలాఫలకాన్ని కూడా తిరిగి పునరుద్ధరించాలని ఆదివారం దేవాలయ నిర్మాణ పనులను పరిరక్షించేందుకు విచ్చేసిన కొలతలు రామకృష్ణకు వైసిపి కి చెందిన అప్పటి నూకాంబిక ట్రస్టీ బోర్డు సభ్యులు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సానుకూలంగా స్పందించి తప్పకుండా ఆ శిలాఫలకాలను కూడా యధావిధిగా పునరుద్ధరించి మీ మనోభావాలు గౌరవిస్తామని భరోసా ఇచ్చారు. దేవాలయ కార్యనిర్మాణ అధికారికి ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే కొణతాల తగు ఆదేశాలు జారీ చేశారు. కొణతాల స్పందన పట్ల నూకాంబిక ట్రస్ట్ రిపోర్ట్ మాజీ చైర్మన్ వైసీపీ నేత కొణతాల మురళీకృష్ణ, ఆ పార్టీకి చెందిన ఇతర వైసిపి నేతలు హర్షం ప్రకటించారు.

## అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే

**అనకాపల్లి రూరల్ ఫిబ్రవరి 15 (ప్రభాత వార్త)**



అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో వెలిసియున్న బాల పేరంటాలు శ్రీ లక్షణమ్మ తల్లి 49వ తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వహకులు అప్పల సోమనాయుడు, ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పేరంటాలు శ్రీ లక్ష్మిణమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. పేరంటాలు తాతగారు అనకాపల్లి గవరపాలెం నుండి పసుపు కుంకాలు తీసుకు వచ్చిన వారిని గ్రామస్తులు వెంకుపాలెం బ్రిడ్జి వద్దకు వెళ్లి వారికి స్వాగతం పలికి ఊరేగింపుగా గుడి వద్దకు చేరుకొని పేరంటాల తల్లికి పసుపు కుంకాలు సమర్పించారు. శ్రీ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించే పక్కన పెట్టిన. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. వెంకుపాలెం గ్రామ పెద్దలు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**అనకాపల్లి ఫిబ్రవరి 15 :(ప్రభాత వార్త)**





మహా శివ రాత్రి పర్వదిన సందర్భంగా అనకాపల్లి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు శివుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారి నుండే భక్తులు శివుని దర్శనం కోసం ఆయా ఆలయాల వద్ద క్యూ లైన్ లో బార్లు తీరారు. మహాశివరాత్రి రోజున శివాలయాల్లో శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజక వర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి గవరపాలెం శ్రీ బోగలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ సిద్ధి లింగేశ్వర స్వామి దేవాల యం, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, పిసినికాడ గ్రామంలో శ్రీ స్వయంభు కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, వెంకుపాలెం గ్రామంలో శివాలయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీ రామ్కి గారిని పూర్ణకుంభం తో మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు . రాంకీ శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు , గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు

## స్మశాన వాటికలో శివునికి ప్రత్యేక పూజలు

**ఎలమంచిలి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**

పట్టణంలోని స్మశాన వాటికలో మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బొడ్డేటి రామ లక్ష్మణ్ బ్రదర్స్. ప్రతి సంవత్సరం శివరాత్రి రోజున శివునకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శివుని వద్ద ప్రత్యేక దీపాలంకరణ కూడా ఏర్పాటు చేసి శివరాత్రి రోజు నుండి మరుసటి రోజు ఉదయం వరకు భజనలు ఏర్పాటు చేస్తారు. శివుని దర్శించుకున్న వారిలో ఇత్తంశెట్టి శ్రీనివాసరావు,రాజు, మూర్తి, బొడ్డేటి చంద్రరావు(చందు) జి నాగు,తదితరులు ఉన్నారు.




## గిరి కైలాస క్షేత్రంకు పోటెత్తిన భక్త జనం:

**పాడేరు,ఫిబ్రవరి15, (ప్రభాతవార్త):**





మహాశివరాత్రి పురస్కరించుకొని గిరి కైలాస క్షేత్రం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు. ఉదయం నుంచి స్వామివారి దర్శనాలు అభిషేకాలు విశేషంగా జరిగాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి ని దర్శించుకుని మురుకులు కానుకలు సమర్పించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విశేషంగా భక్త జనావళి స్వామి వారి దర్శనార్థం ఉదయం నుంచే వేచి ఉన్నారు. అన్న ప్రసాదాలు మహా అన్నదానాలు రుద్రాభిషేకాలు సంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. మహిళా భక్తులు భక్త బృందంగా ఏర్పడి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలక్కుండా సహాయం కల్పించారు. పోలీస్ శాఖ శాఖ ప్రతిష్ట భద్రత ఏర్పాటు చేశారు. రెవిన్యూ శాఖ క్యూ లైన్ లోను పర్యవేక్షణ చేశారు. మంచినీరు ప్రసాద పంపిణీ మన ప్రసాదాలు విశేషంగా భక్తులకు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆధ్యాత్మిక బృంద సేవా సభ్యులు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ధర్మకర్త మండలి సభ్యులు రమాదేవి కొట్టగుల్లి సుబ్బారావు, ఉప్పల వెంకటరత్నం వైదేహి , ఉప సర్పంచ్ బూరెడ్డి రామానాయుడు, కిముడు ప్రభాకర్ కాశ్యాల ని,ఉపాధ్యక్షులు కొట్టగుల్లి రామారావు, సిద్ధనాతి కొండలరావు దేశిరి బాబురావు , కొట్టగుల్లి రమేష్ నాయుడు పోతురాజు యాదగిరి శ్రీను, శివరాత్రి శ్రీను బొడ్డుముకుందరం, పోతురాజు కొమ్మోజి, బాలన్న వెంకటరమణ, దారని నాగు, సలుగు మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఆలయం ఆవరణలో వేలాది మందికి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయగా భక్తులు హాజరై స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



## గిరికైలాస క్షేత్రంకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు ఆర్థిక సహాయం

**పాడేరు,ఫిబ్రవరి15, (ప్రభాతవార్త):**



మహాశివరాత్రి సందర్భంగా పాడేరు గిరి కైలాస క్షేత్రం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి దేవాలయానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి,పాడేరు సూపర్ సర్పంచ్ కొట్టగుల్లి సుబ్బారావు ఆలయం అభివృద్ధికి విరాళంగా రూ/25 వేల రూపాయలు ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు,ఆలయ ప్రధానకార్యదర్శి ఉప్పల వెంకటరత్నం లకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్త కొట్ట గుల్లి సింహాచలం నాయుడు,రమాదేవి,ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం,ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామ శాస్త్రి,పాడేరు ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, సాయి లార్డ్ యజమాని పేరూరి రామకృష్ణ, దీతి బాబురావు,కుర్రాడి రామారావు, కొట్టగుల్లి రమేష్ నాయుడు,ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కొట్టగుల్లి రామారావు,పోతురాజు,ముకుందరావు, శివరాత్రి శ్రీనివాస్ కుమార్,యాదగిరి శ్రీనివాస్,కామని వెంకటరమణ,బాలన్న మాస్టర్, మోహన్,సిద్ధినాథి కొండలరావు ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో భక్తజన సందోహం..

**- జడ్డంగి శివాలయానికి ఇతర జిల్లాలు నుండి వచ్చిన భక్తులు**

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 15, (ప్రభాతవార్త**







మహాశివరాత్రి సందర్భంగా మండలంలో అన్ని శివాలయాల్లో తెల్లవారుజామున నుండే పూజలు మొదలైనాయి. జడ్డంగి శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు దర్శనానికి బారులు తీరారు. రాజవొమ్మంగి సి. ఐ. గౌరీశంకర్, ఎస్. ఐ చినబాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు విధులను నిర్వహించారు.రామచంద్రపురం, అన్నవరం, ఏలేశ్వరం, కాకినాడ, నేమాం, తాడేపల్లిగూడెం, పెంటపాడు , ఎర్రవరం ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలు వరకూ దర్శన క్యూ తగ్గలేదు. మెదేరు వాగు జలపాతాలు వద్ద జనసందోహంతో నిండిపోయింది. ఆలయానికి వచ్చే రహదారి ప్రాంతం ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు సమస్య పరిష్కరించారు. ఆలయం వద్ద భక్తులకు పూర తాతాజీ, రాజవొమ్మంగి సాగర్ యూత్, గాది వెంకటరమణ, ఏ. బి. కాలనీ గ్రామానికి చెందిన మళ్లీపూడి ఏసుబాబు పులిహోరను ప్రసాదంగా అందించారు. మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఏడువేల మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ పరిసరాలు అంతా జనసందోహంతో కిక్కిరిసిపోయింది. జడ్డంగి పి. హెచ్. సి డా. పావని ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య శిబిరాన్ని నిర్వహించి సేవలను అందించారు. జడ్డంగి గ్రామానికి చెందిన అడపా మల్లేశ్వరరావు భక్తులకు సురక్షత త్రాగునీటిని అందించారు. స్నానఘట్టాలు వద్ద మహిళలకు మరుగుదొడ్లను కమిటి ఏర్పాటు చేశారు. దర్శనం క్యూ వద్ద కూడా చలువ పందిళ్ళుతో బాటు గ్రిల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. రాజవొమ్మంగి ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, ఎంపిపి గోము వెంకట లక్ష్మీ, డిప్యూటీ ఎంపిడిఓ విజయకుమార్ మల్లిఖార్జునస్వామిని దర్శించుకొన్నారు మరియు అక్కడ ఏర్పాట్లు పర్యవేక్షించారు. జడ్డంగి పంచాయితీ కార్యదర్శి నాగేశ్వరరావు పర్యవేక్షణలో శానిటేషన్ కార్యక్రమాలు జరిగాయి. జడ్డంగి శివాలయం మరో శ్రీశైలంగా ఉందని భక్తులు అనందం వ్యక్తం చేశారు.

## శివోహం... శివోహం

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 15, ప్రభాతవా ర్త**





రాజవొమ్మంగి మండలంలో ఆదివారం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. వాగులు వద్ద తెల్లవారు జామున నుండే భక్తులు స్నానాలను చేసి పురోహితులుతో ఆశీర్వాదాలను తీసుకొన్నారు. మండలంలో జడ్డంగి, రాజవొమ్మంగి, అమ్మిరేకుల, కిర్రాబు, కింద్ర కాలనీ, లబ్బర్తి, గోబ్బిలమడుగు, వాతంగి, ఓగిపాలెం, బట్టా వారివీధి కరుదేవపాలెం వంచంగి గ్రామాల్లో గల శివాలయాల్లో పూజలు జరిగాయి. జడ్డంగి శివాలయం వద్ద భక్తులకు వూర తాతాజీ, రాజవొమ్మంగి సాగర్ యూత్, గాది వెంకటరమణ, ఏ. బి. కాలనీ గ్రామానికి చెందిన మళ్లీపూడి ఏసుబాబు పులిహోరను ప్రసాదంగా అందించారు. మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు ఆధ్వర్యంలో అన్నసమారాధన లో ఏడు వేల మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

# 1000 కేజీలు గంజాయి స్వాధీనం

**ఐదుగురు స్మగ్లర్లు అరెస్ట్..**
**డ్రైవర్ పరార్: బొలెరో వాహన సీజ్,**
**మూడు సెల్ ఫోన్లు సీజ్**

**పాడేరు,ఫిబ్రవరి15, (ప్రభాతవార్త):**

శనివారంరాత్రి జి.మాడుగుల మండలంలోని మత్స్యపురం జంక్షన్‌వద్ద వాహనాల సాధారణ తనిఖీలు పోలీసులు నిర్వహిస్తున్న సమయంలో, ఒఆర్ 10కె0155 నంబరు గల అనుమానాస్పద మహీంద్రా బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా పీవిసి సంచుల్లో ప్యాక్ చేసిన సుమారు వేయి (1000) కిలోల గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించామని పాడేరు డిఎస్పీ అభిషేక్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ అభిషేక్ వివరాలను వెల్లడించారు. వేయి కేజీలు గంజాయితో పాటు వాహనం , మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి విచారిస్తున్నట్టు డీఎస్పీ




తెలిపారు. బొలెరో వాహనం డ్రైవర్ నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడనీ త్వరలో అరెస్ట్ చేస్తామని ఆయన తెలిపారు. జి. మాడుగుల పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం. 07/2026 గా నమోదు చేసి, ఎన్ డి పి ఎస్ చట్టంలోని సెక్షన్లు 20(బి)()(సి), కింద కేసు నమోదు చేశామన్నారు. ప్రాథమిక దర్యాప్తులో, పొరుగు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు అంతర్గత మార్గాల ద్వారా ఈ నిషేధిత సరుకును తరలిస్తున్నట్లు వెల్లడైందన్నారు. ఆరుగురు నిందితుల్లో నలుగురు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఒకరు అనకాపల్లి జిల్లాకు చెందినవారు కాగా, మరొకరు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారన్నారు. పరారీలో ఉన్న డ్రైవర్ నిందితుడిని పట్టుకునేందుకు మరియు ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న విస్తృత నెట్వర్క్‌ను వెలికితీయడానికి మరింత దర్యాప్తు కొనసాగుతోందనీ డి ఎస్పీ అభిషేక్ తెలిపారు. ఈ సమావేశంలో జి.మాడుగుల సి ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

## నిధులు కూటమివి... గొప్పలు వైకాపావి

**వైకాపా నేతల తీరుపై కూటమి నాయకుల ఆగ్రహం**

**గూడెం కొత్తవీధి,ఫిబ్రవరి 15(ప్రభాతవార్త)**




గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీకి చెందిన కూటమి నాయకులు పేర్కొన్నారు. దామ నాపల్లి పంచాయతీలోని లింగ వరం నుండి లంక వీధి గ్రామాల వరకు ప్రభుత్వం చేపట్టిన "అడవి తల్లి బాట" కార్యక్రమం ద్వారా తారు రోడ్డు నిర్మాణం చేపట్టడం హర్షణీయమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.కూటమి నాయకుడు వంతల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఈ రోడ్డుకు అనేక మార్లు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేసినప్పటికీ నిర్మాణం జరగలేదన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనే పనులు ప్రారంభమై రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల గ్రామస్థుల ఇబ్బందులు తొలగుతున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుతం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కూటమి ప్రభుత్వం మంజూరు చేసినవేనని అన్నారు.అభివృద్ధి పనులకు అధికారంలో ఉన్న వైసీపీ సర్పంచ్లు,ఎంపీటీసీలు కూటమి నాయకులను ఆహ్వానించడంలేదని, కొంతమంది అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.దామనపల్లి పంచాయతీలో చేపడుతున్న పనులకు కూటమి నాయకులకు కనీసం సమాచారం కూడా ఇవ్వటం లేదని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వెంకటేశ్వర్లు, నాగరాజు,రమణమూర్తి, మస్యరాజు, గంగరాజు చిన్నయపడాల్,కేశవ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శివ పార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పణ..

**ముంచంగిపుట్టు ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):**







అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం దారెలా పంచాయతీ కేంద్రం దారెలా గ్రామంలో శివాలయంలో మహాశివరాత్రి వేడుక సందర్భంగా శివ పార్వతికి దారెలా సర్పంచ్ టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగ స్వామి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా దారెలా సర్పంచ్ టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ ప్రజలందరిపై ఆ శివ పార్వతుల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని సుఖ సంతోషాలతో ఉండాలని ఆ శివ పార్వతుల ఆశీస్సులు వల్ల ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని ఆ శివుని కోరుతున్నాని దారెలా సర్పంచ్ టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగ స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయం ఆలయం ధర్మ కర్త చెట్టి పుండారికక్షుడు,టీడీపి నాయకులు చవితియా గోపాలం పంతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా మత్స్యగుండం మహాశివరాత్రి జాతర

**- పోటెత్తిన భక్తులు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు**
**- జేసి, పివో తిరుమాని శ్రీ పూజ స్వామి వారిని దర్శనం**

**పాడేరు,ఫిబ్రవరి15, ప్రభాతవార్త: :**





అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రం మైన మత్స్య గుండం శ్రీ మత్స్య లింగేశ్వర స్వామిని మహా శివరాత్రి పర్వదినాన దర్శించుకోవడం తనకు కలిగిన భాగ్యమని జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో తిరుమాని శ్రీ పూజ అన్నారు. స్వామివారిని ముందుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీ ఎత్తున వస్తున్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భక్తులకు అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మత్స్య లింగేశ్వర స్వామి, మత్స్య దేవతలు, నాగ దేవతలు, భక్తులచే విశేష పూజలు అందుకుంటున్నాయన్నారు. ఉత్తరాంధ్ర నలుమూలల నుండి భారీ ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి అధికసంఖ్యలో వస్తున్నారని, రాత్రికి ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున వారి శివ రాత్రి జాగరణకు ఇబ్బంది కలగకుండా వివిధ సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాట్లు చేశామన్నారు. భారీగా బారులు తీరిన జనంతో, వారి శివనామ స్మరణతో స్వయంభుగా వెలసిన మత్స్య లింగేశ్వర స్వామి ప్రాంగణం పూజలు, భజనలు మార్మోగుతుందన్నారు. జనాలతో కిక్కిరిసిపోయిన ప్రాంగణంలో దర్శనం కొరకు వేచి చూసే భక్తులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నమన్నారు. ఈ రెండు రోజులు పాటు జాతర అంగరంగ వైభవంగా జరుగుతుందని, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్వామి వారిని దర్శించుకోని భక్తులు తరించాలన్నారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించవచ్చు అన్నారు. రేపు మత్స్యగుండంలో భక్తులు భారీగా స్నానం ఆచరిస్తారని వారి రక్షణ కొరకు సిబ్బందిని, భారీ కేడ్లు,హెచ్చరిక బోర్డులను, రక్షణ చర్యలు చేపట్టామన్నారు. భారీ భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు, స్థానాల ఘాట్లు, చెత్తాచెదారంతో పేరు పోకుండా 24 గంటలు పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. త్రాగునీరు, వైద్య సౌకర్యాలు, సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ, ప్రభుత్వ స్టాల్ లు ప్రత్యేకమైన విద్యుత్ లైటింగ్, మరుగుదొడ్ల సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వాహనాల రాకపోకలతో ఇబ్బంది కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఇంచార్జ్ ఆర్డిఓ ఎంవీఎస్ లోకేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు ను మార్చే బడ్జెట్ : ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 15, ప్రభాత వా ర్త**



రాష్ట్ర భవిష్యత్తు స్పష్టమైన దశను, దిశను చూపే విధంగా బడ్జెట్ ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె బడ్జెట్ గురించి ఇలా మాట్లాడారు. ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ను కూటమి ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు వచ్చేలా ఈ బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్దే లక్ష్యంగా వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం రంగాలను బలోపేతం చేసే విధంగా ఈ బడ్జెట్ ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖామంత్రి అభినందిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ఎన్నడూలేని విధంగా మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు.

## శివాలయాల్లో శివనామస్మరణ పోటెత్తిన భక్తులు

**అడ్డతీగల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తజన సంద్రమైంది. అర్ధరాత్రి నుంచే వేలాదిమంది భక్తులు పవిత్ర శివాలయాలు దగ్గర పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఖిఓం. నమ శివాయఖి మంత్రంతో క్షేత్రాలు మారు మ్రోగినవి. హిందువుల ప్రధాన పండుగలలో ఒకటైన మహాశివరాత్రి ఫిబ్రవరి 15, ఆదివారం నాడు భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, రాత్రి జాగరణలు నిర్వహించేందుకు దేవస్థానాలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించి, శివాలయాల్లో పాలు, తేనె, బెల్లం, గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. బిల్వదళార్చన, రుద్రపఠనం, లింగార్చన ప్రత్యేకంగా జరుగుతాయి. అర్ధరాత్రి నిశితకాలంలో మహామంగళహారతి నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గ్రామాల్లో ప్రముఖ శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది. ఆలయం లో విశేష వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ వారు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, తాగునీటి సదుపాయాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు

## కేంద్రమంత్రి చంద్రశేఖర్ దృష్టికి ఆరుకు నియోజకవర్గం సమస్యలు

**- పరిష్కరించాలని చైర్మన్ దొన్ను దొర వినతి**

**అరకులోయ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :**



అరకు నియోజక వర్గం లో నెలకొన్న సమస్యలను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ ఛైర్మన్, టిడిపి అరకులోయ నియోజకవర్గం ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర ప్రత్యేకంగా తీసుకువెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. అమరావతి లో కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని ని ప్రత్యేకంగా కలుసుకున్న చైర్మన్ దొన్ను దొర, అరకు నియోజకవర్గం పరిధిలో నెలకొన్న సమస్యలను వివరించి పరిష్కరించాలని విన్నవించారు. నియోజకవర్గంలోని తాగునీరు, కమ్యూనికేషన్ కు సంబంధించిన సమస్యలను వివరించారు. ముఖ్యంగా స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటికీ అరకు నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో అల్లాడుతున్న ప్రాంతాలు ఉన్నాయని అవి హుకుంపేట, డుంబ్రిగూడ, ముంచంగిపుట్టు, పెదబయలు, అరకువేలి, అనంతగిరి అన్ని మండలాల్లోనూ తాగునీటి సమస్య ఉందని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఆయా మండలాల్లో ఏయే గ్రామాలలో తాగునీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారో దానికి సంబంధించిన వివరాలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి చంద్రశేఖర్ ఈ సందర్భంగా అందజేశారు. అలాగే అరకు నియోజకవర్గంలో చాలాచోట్ల సిగ్నల్ సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారని, సెల్ టవర్ లు పని చేయకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ప్రతి పథకానికి ఆన్ లైన్ పద్ధతుల్లోనే దరఖాస్తుల స్వీకరణ, సంక్షేమ పథకాల రూపంలో ఇస్తున్నటువంటి ఆర్థిక సహకారం అందిస్తుండడంతో కొన్ని గ్రామాలలో సిగ్నల్ సమస్య ఎదుర్కోవడంతో అక్కడ ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరడం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం స్పందించి నెట్ వర్క్ లేని ప్రాంతాల లో ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎక్కడెక్కడ సమస్యను ఎదుర్కొంటున్నారో ఆ వివరాలను మంత్రి కి వినతి పత్రం ద్వారా తెలియపరిచారు. ఈ సందర్భంగా మంత్రి చంద్రశేఖర్ స్పందిస్తూ గిరిజన గ్రామాల్లో ప్రతి గ్రామానికి తాగునీరు అందేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందని, చైర్మన్ దొన్ను దొర అందజేసిన వినతిపత్రం లో తెలియజేసిన గ్రామాలకు కూడా ఖచ్చితంగా త్వరలోనే తాగునీటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి చంద్రశేఖర్ కు చైర్మన్ దొన్ను దొర తన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ అలీమ్, స్పైసెస్ ఎక్స్పోర్టర్ శ్రావణ్, హుకుంపేట మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి కూడేలి నూకరాజు, మాడగడ టిడిపి నాయకులు వంతల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

## శివాలయాలకు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు పట్టు వస్త్రాలు సమర్పణ:

**పాడేరు,ఫిబ్రవరి15, ప్రభాతవార్త:**



పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు పాడేరులో ఉన్నటువంటి ప్రముఖ శివాలయాలు అయినా ఉమా నీలకంటేశ్వర స్వామి మరియు పాత పాడేరు స్వయంభు గౌరి నీలకంటేశ్వర స్వామి మరియు పాడేరు త్రిలింగేశ్వర స్వామి ఆలయాలలో ప్రతి సంవత్సరం అమ్మవారి వద్ద నుంచి పాడేరు ఎమ్మెల్యే,ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, అనంత కుమారి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు చల్లా రామకృష్ణ,బోనంగి వెంకటరమణ, కిల్లు చంద్రమోహన్ కుమార్, కొణతాల సతీస్ ,రాధాకృష్ణన్ నాయుడు, వరలక్ష్మి దంపతులు ,గూడెపు సూర్య ప్రకాష్, లకే రత్నబయి, పలాసి రమణమ్మ కూర రాము, పిట్టా నవీన్, కాళ్ళ మోద కిరణ్, భువన దంపతులు, పాల్గొని పలు శివాలయానికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

## శివనామ స్మరణంతో మార్మోగిన శివాలయాలు

**డుంబ్రిగూడ: ఫిబ్రవరి: 15:( ప్రభాతవార్త):**



మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న శివాలయంలో భక్తుల శివనామ స్మరణంతో ఆలయాలు మార్మోగాయి. ఇక్కడి మండలంలోని కురిడి గ్రామపంచాయతీ గల శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి శివాలయంలో శివరాత్రి సందర్భంగా విచ్చేసే భక్తులకు శివ దర్శనం తో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు వీలును కల్పించారు. అదేవిధంగా ఐస్ గడ్డతో శివలింగాన్ని కమిటీ ఏర్పాటు చేశారు. దీన్నిదర్శించడంలో భక్తులు ఎగబడ్డారు. మండలం తోపాటు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

**అరకు రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :**



అరకులోయ మండలంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అరకు లోయలోని శ్రీ భ్రమరాంబ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వెంకన్న, మూర్తి మంత్రార్చనల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు ఘనంగా జరిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

# జెండా మోసిన కార్యకర్తలకే మున్సిపల్ చైర్మన్ పీఠం

### జగిత్యాల ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్..

### ఒక్కటైన జీవన్‌రెడ్డి, సంజయ్

### ప్రజాభవన్‌లో జగిత్యాల పంచాయితీ..

### అధిష్ఠానం కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** గత కొద్దిరోజులుగా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో సెగలు పుట్టించిన అంతర్గత విభేదాలు ఎట్టకేలకు సద్దుమణిగాయి. ఎఐసిసి సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ రంగ ప్రవేశం చేసి, ఇరు వర్గాల నేతలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో జగిత్యాల ఎపిసోడ్‌కు ముగింపు పలికినట్లయింది. ఆదివారం ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డిలతో విడివిడిగా, అనంతరం కలిసి చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత విషయాలను రోడ్డుపైకి తీసుకురావడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటుందని ఆయన సున్నితంగా హెచ్చరిం చారు. క్రమశిక్షణే ముఖ్యమని, పార్టీ తీసుకునే తుది నిర్ణయానికి ఇరువురు నేతలు కట్టుబడి ఉండాలని సవాంగ్ స్పష్టం చేశారు.

ఐక్యత చాటాలని, రాబోయే ఎన్నికలు, పార్టీ బలోపేతం దృష్ట్యా నేతలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం పదవుల కేటాయింపు పై జరిగింది. పార్టీ కోసం కష్టపడి, జెండా మోసిన నిజమైన కార్యకర్తలకు, పాత తరం నాయకులకే మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇది జీవన్‌రెడ్డి వర్గానికి కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది. తొలి నుంచి జీవన్ రెడ్డి వాదిస్తున్నట్లుగా.. పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్న సూచనను ఏఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. సంజయ్ కుమార్ కూడా పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సర్దుకుపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

ఈ భేటీతో జగిత్యాల కాంగ్రెస్‌లో నెలకొన్న అనిశ్చితి తొలిగిపోయింది. నేతలు ఇద్దరూ కలిసి పనిచేస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పదవుల పంపకంలో పార్టీ విధేయతకే పెద్దపీట వేయాలని నిర్ణయించడం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం కాంగ్రెస్ అధిష్ఠానం చేస్తోంది.

**ప్రజాభవన్‌లో జగిత్యాల పంచాయితీ**

ఆదివారం ఉదయం ప్రజాభవన్‌లో తన వర్గం కౌన్సిలర్లతో ఏఐసీసీ సెక్రటరీని జీవన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హైకమాండ్.. జగిత్యాల నాయకుల ముందు రెండు ప్రతిపాదనలు ఉంచినట్టు తెలుస్తోంది. ఒకటి.. చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికి, వైస్ చైర్మన్ పదవి జీవన్ వర్గానికి. రెండో ప్రతిపాదనగా చెరో రెండున్నరేళ్లు చైర్మన్ పీఠం పంచుకునేలా ఇరు వర్గాలకు సూచించినట్టు సమాచారం. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి.. కాంగ్రెస్ జెండా మోసిన వారికే చైర్మన్ పీఠం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వర్గంతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాగా, కాంగ్రెస్ బిఫామ్‌పై గెలుపొందినవారు,ఇండిపెండెంట్లు, ఎంఐఎం కౌన్సిలర్లు కలిపి మొత్తం 23 మందితో కలిపి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారమే ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

ఈ క్రమంలో శనివారం 14 మంది అభ్యర్థులతో జీవన్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. రెండు వర్గాలు క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టడంతో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదుర్చేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.

# ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలి

### ఫుడ్ జిహాద్ పేరుతో కలహాలు రేపాలని కుట్ర

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లా ఖాద్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్(ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. మేడారం జాతరలో కోవా బన్ వ్యాపారి షేక్ జావేద్‌అలీపై యూట్యూబర్ల గుంపు లక్ష్యంగా చేసుకుని దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ తెలిపారు. ఈ ఘటన చట్ట పరిపాలనపై దాడిగా అభివర్ణించారు. ఫుడ్ జిహాద్ పేరుతో కలహాలు రేపే కుట్ర చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఖాద్రీ డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతమైతే తమ సంఘం తరపున ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలని, లౌకిక విలువలను కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ముస్లింలు, పేదలపై జరుగుతున్న ద్వేషప్రచారాలకు వ్యతిరేకంగా పోరాడా లని, సమాజంలో ఐక్యత, సమానత్వాన్ని కాపాడేందుకు ఏకమై పని చేయాలని పిలుపునిచ్చారు. మతం పేరుతో చిన్న వ్యాపారులు, కూలీలను లక్ష్యంగా చేసుకోవడం అమానుషమని, ఇది సామాజిక శాంతి, సామ రస్యానికి తీవ్రముప్పని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు, ప్రతి పౌరుడి గౌరవం, భద్రత, సమాన హక్కుల కోసం అవగాహన కార్యక్రమాలు, ప్రజాస్వామ్య ఆందోళనలు, ఐక్యత చర్యలను కొనసాగిస్తామని స్పష్టం సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ స్పష్టం చేశారు.

# బయోఏషియా-2026తో గ్లోబల్ టెక్-బయో పవర్‌హౌస్‌గా తెలంగాణ

### కొత్త ఆవిష్కరణలు.. సరికొత్త ఆలోచనలకు కీలక వేదిక

### 17, 18 తేదీల్లో జరిగే సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** గ్లోబల్ టెక్-బయో రంగంలో తెలంగాణను పవర్ హౌస్‌గా తీర్చిదిద్దేందుకు బయో ఏషియా 2026 సదస్సును ప్రజా ప్రభుత్వం హైదరాబాదులో ఫిబ్రవరి 17,18 తేదీల్లో నిర్వహిస్తున్నది. హెచ్‌ఐసీసీ 2 రోజుల పాటు బయోఏషియా సదస్సు జరగనున్నది. ప్రధానంగా హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్ చేస్తుండగా, సుమా రు 50 దేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా బయో ఏషియా సదస్సుకి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఈ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సంయుక్తంగా కలిసి ప్రారంభించనున్నారు. 'టెక్-బయో అన్‌లీష్డ్:ఏఐ, ఆటోమేషన్ బయాలజీ రివల్యూషన్' అనే థీమ్ మీద సదస్సు జరగనున్నది.ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు రాష్ట్రాన్ని వేదిక చేసేందుకు హైదరాబాద్‌లో ప్రజా ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా బయో ఏషియా సదస్సు నిర్వహిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా బయోటెక్నాలజీ,ఔషధాలు,హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు ఈ బయోఏషియా సదస్సులో పాల్గొన నున్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సీఈఓలు,ప్రతినిధులు సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు. లైఫ్ సైన్సెస్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, శాస్త్ర పురోగతి, ఏఐ ప్రభావం ఈ సదస్సులో చర్చిస్తారు. హెల్త్‌కేర్ రంగంలో ఏఐతో వచ్చిన మార్పులు, లైఫ్ సైన్సెస్ భవిష్యత్తును నిర్దేశించే కొత్త ఆవిష్కరణలు, గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేయడం, ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మోడల్స్ తదితర అంశాలను ఎజెండా అంశాలుగా ప్రతినిధులు చర్చించనున్నారు. బయో రంగంలో కొత్త ఆవిష్కరణలు, దేశ విదేశాల సహకారాలు, హెల్త్ కేర్ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఈ సదస్సు ప్రధానంగా తెలంగాణకు ఉపయోగపడనుంది. బయో ఫార్మాస్యూటికల్స్, డిజిటల్ హెల్త్, వైద్య పరికరాలు, అధునాతన చికిత్స విధానాలు, అత్యాధునిక వైద్యం, ఆరోగ్య సంరక్షణ విధానాలపై ఈ సదస్సులో పాల్గొనే ప్రతినిధులు చర్చించనున్నారు. ఆయా రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ఔత్సాహిక సంస్థలు, నిపుణులను ప్రోత్సహిస్తుంది. ప్రపంచ స్థాయిలో హెల్త్ కేర్ హబ్, ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉన్న విషయం విదితమే. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బయో ఏషియా 2026 సదస్సు లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలువనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది.

గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షించనుంది. ఆధునిక సాంకేతికత వ్యవస్థ హెల్త్ ఇండస్ట్రీలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందనే అంశంపై కీలక చర్చలు ఈ సదస్సులో జరగనున్నాయి. అమ్జెన్, సానోఫీ, ఎలీ లిల్లీ, మిల్టెనీ బయోటెక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. బయోటెక్నాలజీ, ఔషధాలు, ఆరోగ్య సేవలు, మెడికల్ టెక్నాలజీ, అర్టిఫీషియల్ ఇంట ెలిజెన్స్(ఏఐ) వంటి రంగాల మీద కీలకోపన్యాసం చేయనున్నారు. ఈ సదస్సులో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు ప్రొఫెసర్ బ్రూస్ ఎల్. లెవిన్, అమ్జెన్ సంస్థ సీఎస్‌వో డా. హోవర్డ్ వై. చాంగ్, జర్మనీకి చెందిన మిల్టెనీ బయోటెక్ వ్యవస్థాపకులు డా.స్టెఫాన్ మిల్టెనీ, సానోఫీ సంస్థ ఈవీపీ మాడలీన్ రోచ్ వంటి ప్రముఖులు కీలకంగా మాట్లాడనున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ కూడా హాజరుకానున్నారు.

భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారు(సైన్స్) ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డా. రాజీవ్ సింగ్ రఘువంశీ ఈ బయో ఆసియాలో ప్రసంగించనున్నారు. 'ఫార్మా బయోటెక్ భవిష్యత్తు' అంశంపై ఒక ప్రత్యేక సీఈఓ కాన్‌క్లేవ్ నిర్వహించనుండగా, అందులో డాక్టర్ రెడ్డీస్, జైడస్, బయోకాన్, సిప్లా వంటి భారతీయ ప్రముఖ సంస్థల సీఈఓలు పాల్గొననున్నారు.అలాగే నోవార్టిస్, రోష్, నోవో నార్డిస్క్, మెడ్ట్రానిక్, మెర్క్, ఆస్ట్రాజెనెకా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ప్యానెల్ చర్చలు జరుగుతాయి.

ఈ చర్చల్లో ప్రధానంగా కొత్త తరహా బయోలాజిక్ ఔషధాలు, సెల్ జీన్ థెరపీలు, ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ వంటి అంశాలపై సమాలోచనలు జరపనున్నారు. బయోఏసియా-2026 సదస్సు ద్వారా హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ రంగాల్లో హబ్‌గా గుర్తింపు పొందనుంది. టెక్-బయోతో వ్యాధులపై సుదీర్ఘంగా అధ్యయనం చేయడం, అర్థం చేసుకునే విధానం,చికిత్సలను రూపకల్పన చేసే పద్ధతి, వైద్య సేవలను అందించే విధానం పూర్తిగా మార్పు చెందనున్నతున్నది.

గత కొన్ని సంవత్సరాలుగా, హైదరాబాద్ మహానగరం ప్రపంచ ఫార్మా, బయోటెక్ రంగంలో జీసీసీ(గ్లోబల్ కెపాసిటీ సెంటర్) వేగంగా విస్తరణ జరుగుతున్నది. బయో లాజిక్స్, వ్యాక్సిన్ తయారీ సామర్థ్యం, బయోప్రాసెస్ డిజైన్, అధునాతన చికిత్సలు, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్‌లో తెలంగాణకి కొత్త పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ సదస్సులో తెలంగాణలో బయో ఉత్పత్తుల పరిధి మరింత పెంచేందుకు, అవసరమైన భాగస్వామ్యాలను కలుపుకుపోయేందుకు సమగ్రంగా చర్చలు చేయను న్నారు. జీవశాస్త్రంలో వస్తున్న పరివర్తనాత్మక మార్పులు, లైఫ్ సైన్సెస్ రంగంలో నిరంతర వృద్ధి ద్వారా నడిచే గణనీయమైన పురోగతిని ఈ సంవత్సరం సూచిస్తుంది. జీవశాస్త్రం ఏఐ ఆటోమేషన్‌తో కలిసి పని చేసే ఒక అవకాశం కనిపిస్తున్నది. సీఆర్‌డీఎంఓ సేవలలో తెలంగాణ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తూ, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ వేదికపై హైదరాబాద్‌ను ప్రముఖ పాత్ర పోషించే విధంగా చేశాయి. ఈ ఏడాది ప్రారంభంలో దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకటన, కీలకమైన వ్యూహాత్మక పెట్టుబడులతో పాటు, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రభాగాన ఉన్నది.

బయో ఏషియా- 2026 లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టం పరిణామాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడనున్నది. ఈ కార్యక్రమంలో ప్లీనరీలు, భవిష్యత్తులో చేపట్టేటు వంటి అంశాలను ప్యానెల్ సంభాషణలు జరగనున్నాయి.

# కీసరగుట్టకు పోటెత్తిన భక్తజనం

### పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

### పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మైనంపల్లి రోహిత్



శ్రీభవాని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కల్యాణోత్సవం సందర్భంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పవిత్రపుణ్య శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయం శివ నామస్మరణతో మారు మోగింది. ఆదివారం మహాశివరాత్రి పండుగను పురస్కరిం చుకుని కీసరగుట్టకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది వరకు భక్తులు విచ్చేసి ఉంటారని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున శనివారం అర్ధ రాత్రి శ్రీస్వామి వారి కల్యాణోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు దంపతులు (సతీసమేతంగా) విచ్చేసి శ్రీస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి శ్రీస్వామి వారిని దర్శించుకుని ఆ తరువాత జరిగిన కల్యాణోత్సవం లో వారు కూర్చున్నారు. అదే విధంగా మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి కూడ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ కూడ విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కూడ విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆ తరువాత బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు క్యూలీ నిలబడి శ్రీస్వామి వారిని దర్శించుకోవటం, భారీ సంఖ్యలో భక్తజనం రావటంతో భక్తులతో కిటకిటలాడింది. కీసరగుట్టపై ఆలయ ప్రాంగణంలో ఆరుబయట పరిసరాల్లో ఉన్న శివలింగాలను భక్తులు దర్శించుకోవటం శివనామస్మరణతో మారుమోగింది. కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు ఆదివారం సాయంత్రం తమ ఉపవాసాలు ఉండి విడిచారు. కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగను న్నాయి. అయితే ఆదివారం సాయంత్రం సమయంలో కీసరగుట్ట రోడ్డులో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావటం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు స్పందించి ట్రాఫిక్ అంతరాయం లేకుండ వాహనాలను పంపారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భారీ ఎత్తున మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు గట్టి భద్రతా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# మంత్రి కొండా సురేఖ మనవడిని అభినందించిన హీరో ప్రభాస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మనవడు, చిన్నారి కొండా మురళీకృష్ణ పటేల్ భక్తి, ఆధ్యాత్మికత పట్ల చూపిన ఆసక్తి ఎంతో అభినందనీయమని ప్రముఖ హీరో ప్రభాస్ కొనియాడారు. రెండున్నరేళ్ల వయసులోనే మురళీకృష్ణ పటేల్ పఠించిన లింగాష్టకం విడియోకు హీరో రెబల్‌స్టార్ ప్రభాస్ వాయిస్ ఓవర్ అందించారు. ఈ సందర్భంగా రెండు న్నరేళ్ల చిన్న వయసులోనే భక్తిశ్రద్ధలతో లింగాష్టకం పఠించిన చిన్నారి ప్రతిభను ప్రశంసించారు. మిగతా చిన్నారులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందని, కొండా మురళీకృష్ణ పటేల్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నానని ప్రభాస్ తెలిపారు.

# యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టండి

### ప్రొఫెసర్లు లేక ఇబ్బంది పడుతున్నాం..

### ప్రభుత్వానికి విసిల వేడుకోలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో సరిపడా ప్రొఫెసర్లు లేకపోవడంతో.. బోధన ఇబ్బందిగా మారుతోందని వెంటనే యూనివర్సిటీల్లో నియామకాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వర్సిటీల ఉప కులపతులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 20న జరిగిన ఉన్నత విద్యా మండలి ఈసీ మీటింగ్‌లో పాల్గొన్న యూనివర్సిటీల వీసీలు ఇదే అంశంపై మాట్లాడారు. ఆ తరువాత ఈ నెల 4న జరిగిన వీసీల మీటింగ్‌లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వీసీలు కోరుతున్నారు. నియామకాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో.. 2012 నుంచి యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల నియామకాలు చేపట్టలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 2017లో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అచార్య పోస్టులను భర్తీ చేయడానికి అప్పటి ప్రభుత్వం అనుమతించడంతో.. ఆర్థిక శాఖ కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. అయితే అప్పటి నుంచి నియామకాలను చేపట్టడంలో ఎలాంటి పద్ధతిని అవలంభించాలనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీల్లో నియామకాల కోసం ప్రత్యేక నియామక బోర్డును ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ.. అప్పటి గవర్నర్ అందుకు ఆమోదం తెలపకపోవడంతోపాటు ఆ ఫైల్‌ను కాస్త రాష్ట్రపతికి పంపించారు. దీంతో ఈ ప్రక్రియ కాస్త పెండింగ్‌లో పడింది. ఇప్పుడు నియామకాలు చేపట్టాలన్నా దానిపై స్పష్టత రావల్సి ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతేడాది డిసెంబర్10న ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించిన సందర్భంలో వర్సిటీల్లో నియామకాలను చేపడతామని.. ఆయా నియామకాల్లో ఎవరి జోక్యం ఉండబోదని.. ఎవరైనా జోకనయం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆ తరువాత జరిగిన ఉన్నత విద్యా మండలి ఎగ్జిక్యూటీవ్ మీటింగ్‌లో పాల్గొన్న యూనివర్సిటీల వీసీలు నియామకాల గురించి ప్రస్తావించారు. సమావేశంలో పాల్గొన్న విద్యాశాఖ కార్యదర్శి ప్రభుత్వ పరిశీలనలో ఉందని.. ప్రభుత్వ నిర్ణయం రాగానే నియామకాలు చేపడతామని తెలిపారు. ఆ తరువాత వీసీలతో విద్యా శాఖ కార్యదర్శి ప్రత్యేకంగా ఈ నెల 4న సమావేశం ఏర్పాటు చేశారు. అందులోనూ ఇదే అంశాన్ని వీసీలు ప్రధానంగా ప్రస్తావించారు. యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టకపోవడంతో బోధనకు ఇబ్బందులు వస్తున్నాయని, పీహెచ్‌డీ గైడ్‌షిప్‌కు సైతం ఇబ్బంది అవుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నియామకాల కోసం కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు వీసీలతో ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను సమర్పించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 70 శాతానికిపైగా ఆచార్యుల కొరత ఉంది. 11 యూనివర్సిటీల్లో 2878 అధ్యాపక పోస్టులు మంజూరు కాగా వాటిల్లో 2125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మొత్తం కలిపి 2878 పోస్టులు మంజూరు చేయగా.. వాటిలో కేవలం 753 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మంజూరైన ప్రొఫెసర్ పోస్టుల్లో ఉస్మానియా, తెలంగాణ, జేఎన్‌టియుహెచ్, జెఎన్ఎఫ్ఏయూలో మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగిలిన కాకతీయ, మహాత్మాగాంధీ, శాతావాహన, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్‌జీయుకేటిల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు, అసిస్టెంట్ ప్రొపెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి, ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీల్లోనూ కొత్తగా నియామకాలను చేపట్టలేదు. కొద్దిరోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్)లో భాగంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించారు. దీంతో ఇప్పటికే ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ఖాళీలకు అదనంగా మరో 20 నుంచి 30 ఖాళీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి 2017లోనే సుమారు 1000కిపైగా పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 8 సంవత్సరాలుగా నియామక ప్రక్రియ ప్రారంభం కాకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా నిలిచిపోయింది.

# రాష్ట్రంలో 50.48 లక్షల యూరియా బుకింగ్

### అన్ని జిల్లాల్లోనూ యాప్ సేవలు

### వ్యవసాయ శాఖ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ప్రస్తుత యాసంగి సీజనులో 50.48 లక్షల బస్తాల మేర యూరియాను రైతులు బుక్ చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో ప్రస్తుతం ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాలకే పరిమితమైన యాప్ ద్వారా యూరియా బుకింగ్‌ను అన్ని జిల్లాలకు విస్తరింపచేస్తున్నట్లు ఆదివారం తెలిపింది. ఇప్పటి వరకూ వరకు 12.73 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 50.48 లక్షల యూరియా సంచులు బుక్ చేసుకున్నారని తెలిపారు. ఈ విధంగా బుక్ చేసుకున్న వాటిలో 46.13 లక్షల బ్యాగ్‌లను రైతులు ఇప్పటికే కొనుగోలు చేశారన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది.

యూరియా బుకింగ్‌లో రైతులకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించేలా అవసరమైన సవరణలు చేస్తూ యూరియా యాప్ అమలు కొనసాగించ బడుతోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఈ యాప్ ద్వారా పట్టాదార్ పాస్ బుక్ కలిగిన రైతులు, అటవీ హక్కుల చట్టం లబ్దిదారులు, భూమిని నిజంగా సాగు చేస్తున్న రైతులు మాత్రమే యూరియాను బుక్ చేసుకునే విధంగా నిబంధ నలు అమలు చేస్తున్నట్లు పేర్కొంది. దీని దీనివల్ల ఎరువులు నిజమైన రైతులకే చేరేలా పర్యవేక్షణ జరుగుతోందని తెలియచేసింది.

రైతు బుక్ చేసుకునే యూరియా సంచుల సంఖ్య పంట రకం, సాగు విస్తీర్ణం వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా నిర్ణయించబడుతోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.

# సేవాలాల్ మహారాజ్ జీవితం బిజెపి సిద్ధాంతాలకు ఎంతో చేరువ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం భారతీయ జనతా పార్టీ నమ్మే సిద్ధాంతాలకు ఎంతో దగ్గరగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశాన్ని విదేశీ శక్తుల ఆధిపత్యం నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో పాటు, ప్రకృతి పర్యావరణ పరిరక్షణకు ఆయన జీవితాంతం అంకితమయ్యారని తెలిపారు. బంజారా సమాజానికి సంత్ సేవాలాల్ మహారాజ్ ఆరాధ్య దైవమని, పర్యావరణాన్ని కాపాడే దేవుడిగా ఆయనను గిరిజన సమాజం భావిస్తుందని అన్నారు. విదేశీ పాలన కాలంలో ఒకవైపు విదేశీయులపై పోరాటం చేస్తూనే, మరోవైపు ప్రకృతి పరిరక్షకుడిగా నిలిచిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. జగదాంబ మాత ఉపాసకుడిగా, భక్తిశ్రద్ధలతో జీవించిన సేవాలాల్ మహారాజ్ బోధనలు నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. అందుకే దేశవ్యాప్తంగా గిరిజన సమాజం సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకుంటోందన్నారు. గిరిజనుల సంక్షేమానికి సంబంధించి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నది నరేంద్ర మోడీ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ట్రైబల్ కమిషన్ ఏర్పాటు, ప్రత్యేకంగా ట్రైబల్ మినిస్ట్రీ, గిరిజన సంక్షేమానికి అత్యధిక నిధుల కేటాయింపులు చేశారన్నారు. ఇవన్నీ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలేనని గుర్తుచేశారు. ములుగులో సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు విస్తరించాయని తెలిపారు. అలాగే మహారాష్ట్రలో సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణం చేపట్టడం గిరిజన సంస్కృతికి ఇచ్చిన గౌరవంగా అభివర్ణించారు.ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గిరిజనుల విద్య, ఉపాధి, ఆరోగ్య సంక్షేమం కోసం అనేక పథకాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. గిరిజన సమాజాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే బిజెపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ నవదుర్గ అమ్మవారి ఆలయంలో పాలాభిషేకం

రాజాం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

రాజాం పట్టణం పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న శ్రీ నవ దుర్గ అమ్మవారి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా అమ్మవారికి పాలాభిషేకం చేశారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వానపల్లి నర్సింగరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన అమ్మవారికి పాలాభిషేకం చేయడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అమ్మవారికి ఈ విధంగా పాలాభిషేకం చేయడం చేత తమ కోరికలు తీరుతాయని ప్రగాఢ నమ్మకంగా భావిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నర్సింగరావుతో పాటు ఆలయ పురోహితులు రామాయణం శ్రీనివాసరావు, ఈవో శ్యామలరావు, భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో విజేత పల్నాడు టీమ్

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



సంతబొమ్మాళి మండలం గొదలాం గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలలో చివరకు పల్నాడు టీమ్ విజేతగా నిలిచింది. 59 వనందన్న వార్షికోత్సవం ఉత్సవాలు సందర్భంగా జరిగిన ఈ పోటీలలో శనివారం రాత్రి ఫైనల్‌లో రెండు టీమ్‌ల మధ్య హోరా హోరి పోటీ జరిగింది. ఈ పోటీలలో పల్నాడు టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా, గుంటూరు టీమ్ రెండో స్థానం లోనూ, మూడో స్థానంలో కృష్ణ జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో నిర్వాహకులు విజేతలకు మొదటి బహుమతిగా రూ. 50వేలు నగదు బహుమతితో పాటు, షీల్డ్‌లు అందజేశారు. అలాగే రెండో బాహుమతిగా రూ.30వేలు నగదు షీల్డ్ అందించారు. మూడో బహుమతిగా రూ.20వేలు నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. ఈ రాష్ట్ర స్థాయి అహ్వానిత కబడ్డీ పోటీలలో జాతీయ కబడ్డీ ప్లేయర్ హరీష్ పాల్గొనడంతో క్రీడాభిమానులకు ఎంతో ఆనందం కలిగింది. ఈ టోర్నమెంట్‌లో బెస్ట్ రైడర్‌గా బ్రహ్మారెడ్డి( పల్నాడు), బెస్ట్ డిఫెండర్‌గా ఇమ్మ్యాల్ (గుంటూరు), ఆల్ రౌండర్‌గా హరీష్ నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు, నిర్వాహకులు అడ్డి తురుపతి సోదరులతో పాటు గ్రామస్తులు పిలక ధనుంజయ కుమార్ అలాగే ముఖ్య అతిధులు రమణారెడ్డి, రెడ్డి అప్పన్న, సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం, సూరాడ దాసురాజు, అప్పిని వెంకటేష్ బహుమతులు అందజేశారు.

## సీధిలో ఘనంగా ప్రారంభమైన 9వ గ్రామీణ క్రీడా పోటీలు



సీతంపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: సీతంపేట మండలం సీధి సామరెల్లి గ్రామంలో 'మన్య ప్రగతి' సంస్థ ఆధ్వర్యంలో 9వ గ్రామీణ యువజనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామీణ యువతలోని ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళ శాసనములతో, వారి శిష్యులు జనార్ధన రామానుజ దాసు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్య ప్రగతి చైర్మన్ డాక్టర్ గేదెల రవి మాట్లాడుతూ ఫిబ్రవరి 19 వరకు జరిగే వాలీబాల్, షటిల్, చెస్ వంటి క్రీడలతో పాటు వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గెదల జనార్ధనరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీనక ఉమామహేశ్వరరావు, బిడ్డిక దమయంతి నాయుడు, మూటక అప్పల నాయుడు, బిడ్డిక నీరజ డాక్టర్ నిరోషా, గేదెల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## శివ స్వాములకు అన్న సంతర్పణ



కంచిలి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మహాశివరాత్రి సందర్భంగా కంచిలి పాతాళేశ్వర దేవాలయంలో శివ స్వాములకు భక్తులకు వైఎస్ఆర్ పార్టీ నాయకుడు గుమ్మడి రామ దాసు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.



## వృధాగా పడి ఉన్న ఏంగుపేట ఎత్తిపోతల పథకం

సీతంపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

సీతంపేట మండల పరిధిలో ఉన్న ఏంగుపేట ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురై గడిచిన మూడు సంవత్సరాలుగా వృధాగా పడి ఉంది. దీంతో రైతులు సాగునీటి అవసరమైన నీరు అందకపోవడంతో 100 ఎకరాల సాగుభూమికి నీరు లభించక గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు చెట్టు పునరుద్ధరణ పథకం క్రింద రూ.27 లక్షలు వెచ్చించి గతంలో మరమ్మత్తు పనులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో సాగునీరు అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మోటార్లు ఏర్పాటు చేసుకొని పొలాలకు సాగునీరు అందించుకోవడం జరుగుతుందని జక్కర వలస గ్రామానికి చెందిన సవర మంగయ్య. సవర కరువు స్పష్టం చేశారు. గతంలో అధికారులకు అనేకసార్లు వినతలు ఇచ్చినప్పటికీ మరమ్మత్తులు చేయలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకం పనులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

## మహిళల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన

ఆమదాలవలస, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త)



మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం జండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ మహిళల సాధికారత దిశగా మరో కీలక ముందడుగు పడిందని అన్నారు. మహిళలు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా మరియు సామాజికంగా ఉన్నతమైన స్థానంలో ఉండగలరని తెలిపారు. మహిళలే ఆర్థికంగా ఎదిగి, అభివృద్ధి చెంది, సమాజంలో నాయకత్వం వహించడానికి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం మహిళల చేతుల్లోనే ఉందని అని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. జెండర్ రిసోర్స్ సెంటర్ ద్వారా మహిళలకు శిక్షణ కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి తరగతులు, స్వయం ఉపాధి మార్గదర్శకత్వం, న్యాయ మరియు సామాజిక అవగాహన సేవలు అందించబడతాయని తెలిపారు. ఈ కేంద్రం మహిళలకు మార్గనిర్దేశక వేదికగా నిలిచి, వారి సామాజిక, ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సమాన అవకాశాలు సృష్టించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళల అభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రవికుమార్ స్పష్టం చేశారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మహిళలకు కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. అనంతరం స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, డిఆర్‌డిఏ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణాలతో దగదగా మెరిసిపోతున్న పల్లెలు

### నియోజకవర్గ టిడిపి మాజీ ఇంచార్జ్ నిమ్మక పాండురంగ



వీరఘట్టం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: రహదారుల నిర్మాణాలతో పల్లె ప్రాంతాలు దగదగా మెరిసిపోతున్నాయని, దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందంతో చిరునవ్వులు చిందిస్తున్నారని నియోజకవర్గ టిడిపి మాజీ ఇన్‌చార్జ్, తోటపల్లి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ అన్నారు. ఆదివారం మండలంలోని ను.వెంకంపేట గ్రామంలో సీసీ రహదారి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాండురంగ సోదరుడు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఈ రహదారి నిర్మాణం కోసం ఐటీడీఏ నిధుల నుండి 25 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. ఈ రహదారి వెంకంపేట నుండి చిదిమి గ్రామం వరకు సీసీ రహదారిని నిర్మించనున్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలతో పాటు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ రహదారిని నాణ్యతతో పాటు ఎంతో సుందరంగా రహదారి పనులను చేపట్టాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆ క్రమంలోనే చాలా గ్రామాలకు కొత్తగా సీసీ రోడ్లను, బిటి రోడ్లు నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రతి గ్రామానికి, అలాగే ప్రతి గిరిజన గ్రామానికి కూడా సరైన రహదారి ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇందుకు నాయకులు చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, వీరఘట్టం టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, మాజీ నీటి సంఘం అధ్యక్షులు బల్ల హరిబాబు, నీటి సంఘం అధ్యక్షులు చింత ఉమామహేశ్వరరావు, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు గొర్లె.గౌర్నాయుడు శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, కూటమి నాయకులు మద్ది వెంకటరమణ, మద్ది వెంకట రమణ, ముక్క శ్రీనివాసరావు తోపాటు వెంకంపేట కూటమి నాయకులు వారాడ భాస్కరరావు, ఉత్తరపల్లి శ్రీరాములు నాయుడు, వారాడ పారినాయుడు, వాన రాముకృష్ణ పిన్నింటి చిరంజీవి, వారాడ లక్ష్మునాయుడు, వారాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఘనంగా మహా మృత్యుంజయ హోమం



కంచిలి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమం ప్రాంగణంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లోక కల్యాణార్థం బ్రహ్మశ్రీ బంకుపల్లి సురేష్ శర్మ ఆధ్వర్యంలో అశేష భక్త జన సమూహంతో 'మహా మృత్యుంజయ హోమం' కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. మహా శివరాత్రి మహోత్సవంకు విచ్చేసిన 10 వేల మంది భక్తులకు 'అన్నప్రసాద' వితరణను సమర్పించిన కంచిలి గ్రామస్తులకు పరమ శివుని ఆశీస్సులు ఉండాలని సీతయ్య ఫౌండేషన్ తరఫున నిర్వాహకులు గుల్ల రమేష్, మోహన్‌లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజలలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందాలి



వీరఘట్టం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త : ప్రజలలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందాలని, ఆ దిశలోనే ప్రజలు పయనించాలని నియోజకవర్గం టిడిపి మాజీ ఇన్‌చార్జ్, తోటపల్లి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ అన్నారు. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని చిదిమి గ్రామంలో వారాహి లక్ష్మీ నరసింహస్వామి సింహాద్రి అప్పన్న సంబరాల కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మాట్లాడారు. గ్రామాలలో ఇటువంటి సంబరాలు చేసేటప్పుడు గ్రామం కలకలాడుతుందని, అంతేకాకుండా ఆ పరమేశ్వరుడు ప్రజల్ని, రైతులని చల్లగా చూస్తాడని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ముందుగా కూటమి నాయకులు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ పార్టీ నాయకులు ప్రస్తుతం తోటపల్లి ప్రాజెక్ట్ చైర్మన్ ప్రతినిధి పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, టీడీపీ పట్టణ నాయుకులు జామి లక్ష్మీ నారాయణ, బళ్ళ హరిబాబు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, వీరఘట్టం నీటి సంఘం అధ్యక్షులు చింత ఉమా మహేశ్వరరావు, కూటమి నాయుకులు గొర్లె గౌరునాయుడు, మత్స వెంకట రమణ, ముద్ద వెంకట రమణ, వారాడ పారినాయుడుతో పాటు చిదిమి కూటమి నాయుకులు బి.నీలకంఠం మాష్టారు, బి.శ్రీహరిరావు, పున్ననా మురళి, బి.లక్ష్మణరావు, బి.విజయ్, బి.రాజేష్, బి.రమణమూర్తి, బి.ఉగాది నాయుడు, బి.సత్యన్నారాయణ, బి.వరాహలునాయుడు, బి.శ్రావణ్ కుమార్, బి.వరహాలు నాయుడు, బి.శషి కుమార్, బి.కుమార్, అల్లు కృష్ణ, రౌతు సురేష్, బి.సింహాద్రి నాయుడు, బి.ఉణీత్, బి.గోవింద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హరిశ్చంద్రపురం రైలు నిలయంలో ఎక్స్‌ప్రెస్ రైలు త్వరలో ఆగుతాయి

### కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త): హరిశ్చంద్రపురం రైలు నిలయంలో మరి కొద్ది నెలల్లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగుతాయని మహాశివరాత్రి రోజున ఇక్కడ ప్రజలకు మాటిస్తున్నానని కేంద్ర పౌరవిమానయానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆయన ఆదివారం మండలం హరిశ్చంద్రపురం గ్రామస్తులతో మాట్లాడుతూ సుమారు 100 గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న హరిశ్చంద్రపురం రైలు నిలయం అభివృద్ధి, ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపదల కోసం ఎన్నో ఏళ్లుగా చూస్తున్నామని, ఇప్పటికే రైల్వే స్టేషన్‌కు పలు అభివృద్ధి పనులు చేయటం జరిగిందని మిగిలింది ఎక్స్‌ప్రెస్ రైలు నిలవడమేనని ఈ విషయం ఇప్పటికే రైల్వేశాఖ మంత్రితో మాట్లాడడం జరిగిందని నాకు తప్పకుండా ఈ పని చేయాలని మంత్రి వివరించానని ఆయన ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, దేశం నేతలు తర్ర రామక్రిష్ణ, బోయిన గోవిందరాజులు, వెలమల కామేశ్వరరావు, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 17న యుటిఎఫ్ రణభేరి జయప్రదం చేయండి



సీతంపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త : విజయవాడలో ఈ నెల 17న యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రణభేరి 2.0 విజయవంతం చేయాలని మన్యం జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు కే.కృష్ణారావు స్పష్టం చేశారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిషన్ చైర్మన్ వెంటనే నియమించాలని, 29 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలి, పెండింగ్ డీఏలను విడుదల చేయాలి, ఉద్యోగులు పెన్షనర్ల బకాయి చెల్లింపులకు రూట్ మ్యాప్ ప్రకటించాలి. హెల్త్ కార్డ్ మెడికల్ బిల్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి. సిపిఎస్ రద్దు చేయాలి మెమో 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీతంపేట మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి కె.ఆనందరావు, బి.పకీరు, ఎ.ప్రకాశం, ఈ.సింహాద్రి, పి.చంద్రకళ, పి.శ్రీనివాసరావు, డివి.రమణ, తరుణ్, నవీన్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మహా శివరాత్రి పూజలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అన్ని శివాలయాలు భక్తులు తో పోటెత్తాయి. వేకువ జామున 2 గంటలు నుండి భక్తులు బారులు తీరారు. పాతలేశ్వర ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నీలకంటేశ్వర, ఉమా మహేశ్వర, కాశీ విశ్వేశ్వర, రామ లింగేశ్వర తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. నరమదేశ్వర ఆలయంలో పూర్ణ పాండా ఫణి శర్మ ఆధ్వర్యంలో లింగోద్భవం నిర్వహించారు. చితంబరేశ్వర ఆలయంలో పార్థివ లింగం ప్రతిష్ట నిర్వహించారు.



## సెమిస్‌కు చేరిన జట్లు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మకరాంపురం లీడ్స్ బేర్హంపూర్ భీమవరం అర్ కే అకాడమీ వైజాగ్ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. వెచ్చా జయంతి స్మరక అంతరాష్ట్ర క్రికెట్ పోటీల్లో భాగంగా ఎఫ్ సిసి జట్టు అర్ కె అకాడమీ జట్టు మధ్య జరిగిన భాగంలో టాస్ గెలిచి అర్ కె అకాడమీ బౌలింగ్ ఎంచుకోగా నిర్ణీత 20 ఓవర్లలో 162 పరుగులు చేసారు. ప్రశాంత్ 67 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం అర్ కే అకాడమీ 17.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయం సాధించారు. అకాడమీ బాట్స్‌మెన్ త్యాగి 62 పరుగులతో మన అఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. మకరాంపురం, రంభ జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో మకరాంపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా నిర్ణీత 20 ఓవర్లలో 144 పరుగులు చేసారు. మకరంపురం బాట్స్‌మెన్ కృష్ణ 43 పరుగులు చేసారు. అనంతరం రంభ జట్టు 19.4 బంతుల్లో 134 పరుగులకి ఆలౌట్ అయిపోయారు. రంభ బాట్స్‌మెన్ సంతోష్ 34 పరుగులు చేసాడు. మకరాంపురం బౌలర్ చిన్నరాజు 4 వికెట్లు తీసుకుని మ్యాన్ అఫ్ ది మ్యాచ్‌గా ఎన్నుకోబడ్డాడు. అంపైర్లుగా షాను శ్రీను ప్రేమ్ వాసు వ్యవహారించారు. మ్యాచ్ విజేతలకు సిఐ ఎం.చిన్నమ్మనాయుడు బహుమతులు అందజేశారు.

## హరహర మహాదేవ శంభో శంకరా..!

### శివనమా స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా సంతబొమ్మాళి మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. హరహర మహాదేవ శంభో శివ శంకరా అంటూ శైవ క్షేత్రాలు మర్మోగాయి. సంతబొమ్మాళి ఉమా పాలేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేకువ జాము నుంచి శివునికి పూజలు ప్రారంభమయ్యాయి. భక్తి శ్రద్దలతో శివునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతబొమ్మాళి గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో గుడి బయట ప్రధాన రహదారి పైకి క్యూ లైన్‌లో నిలబడి శివునికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీసభ్యులు, పోలీసులు సహకారంతో గట్టి బందోబస్త్ ఏర్పాటు చేసి ప్రశాంతంగా శివునికి అభిషేకాలు జరిగేలా చర్యలు చేపట్టారు. అలాగే కాపుగోదాయవలస శివ సన్నిధి ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగ సమేత శివకోటి శివ లింగ శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలపేట ముక్తేశ్వరస్వామి ఆలయంలో, నౌపడ, బోరుభద్ర, డిజి పురం, కొల్లిపాడు, ఎన్.జగన్నాధపురం, వల్లేవలస, వడ్డివాడ గ్రామాల్లో శివాలయాలలో విశేష పూజలు నిర్వహించారు. ఈ పర్వదినం పురస్కరించుకొని మండలం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు రావివలస తరలి వెళ్లి ఎండల మల్లికార్జున స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాలు వద్ద రాత్రి భజనలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## నేటి నుంచి పీఏసీఎస్ ఉద్యోగులు సమ్మె ..నిలిచిపోనున్న రైతాంగ సేవలు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):




రాష్ట్ర ప్రభుత్వానికి పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గత 18 నెలలుగా ఎన్నోసార్లు కోరినప్పటికి ప్రభుత్వంలో గాని అధికారులలో గాని చలనం లేక పోవడంతో రాష్ట్ర జె.ఏ.సి. నిర్ణయం మేరకు పోరాటాన్ని ఉధృతం చేసే దిశగా గత్యంతరం లేని పరిస్థితులలో సోమవారం నుండి సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు రాష్ట్రంలో గల 2060 పి.ఏ.సి.యస్ ల ఉద్యోగులు నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులందరికి సమ్మె నోటీసులు ఇచ్చి సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందని అందులో భాగంగా స్థానిక పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మికు సమ్మె నోటీస్‌ను స్థానిక పీఏసీఎస్ ఉద్యోగులు అందజేశారు. దీంతో సోమవారం నుండి సహకార సంఘ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. దీనివలన వ్యవసాయ అవసరాల కొరకు భూములపై రుణాలు పెట్టుకున్న రైతాంగానికి రుణాలు నిలిచిపోనున్నాయి, సకాలంలో లో చెల్లించ వల్సిన వడ్డీలకు అపరాధ వడ్డీలు చెల్లించాల్సి వస్తుంది అదే విధంగా, సంఘాసల నుండి సబ్సిడీపై విక్రయిస్తున్న ఎరువులు విత్తనాలు, పురుగు మందులు విక్రయాలు నిలిచిపోనున్నాయి. రైతాంఘం తీవ్ర నష్టాలు ఎదుర్కోవల్సి వస్తుంది. ఎ.పి.పి.ఏ.సి.యస్. ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గిరి బుచ్చిరంగనాథ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎరనేని పాపినాయుడు, మెండ సత్యన్నారాయణ, బల్లెడ రామారావులు వినతిపత్రం అందజేశారు.

# శ్రీకాకుళం వార్త



## పరమ పవిత్రం... మహాశివరాత్రి పర్వదినం



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 15 (ప్రభాత వార్త): మన ముఖ్యమైన పండుగల్లో మహా శివరాత్రి ఒకటి. ఏటా మఘబహుళ చతుర్ధశిని శివరాత్రిగా జరుపుకుంటామని కేంద్ర పౌరవిమానాయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆయన ఆదివారం శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్‌తో కలిసి మండలం చిన్నహరిశ్చంద్రపురం శ్రీపంచధామ క్షేత్రాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనతో పాటు రాష్ట్ర కళింగ కోమటి కార్పోరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, మాజీ పీఏసీఎస్ అద్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, దేశం నేతలు వెలమల కామేశ్వరరావు, తర్ర రామక్రిష్ణలు ఉన్నారు. అలాగే మండలంలో శివాలయాల్లో భక్తులు హరనామస్మరణతో మార్మోగాయి. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచి భక్తులు క్యూ కట్టారు. స్థానిక ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సదుపాయం కల్పించారు. అలాగే ఆలయం చుట్టు పరిశుద్యపు పనులు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా ప్రసాధం పంపిణీ చేశారు. కొత్తపేట శివకేశవ పంచాయతన ఆలయంలోను భక్తులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కురుడు, సుబ్బారావుపేట, లఖందిడ్డి, గంగరాం, ఊడికలపాడు, యలమంచిలి, జర్జంగి, చవితిపేట ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టేవలస శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున అరటి గెలలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి పూజలు



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార

విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం వీరబ్రహ్మేంద్రస్వామి పూజలు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటంతో దాసన్నపేట బస్టాండ్, మెయిన్ రోడ్డు, హాస్పిటల్ రోడ్డు, మంగళవారంపేట, చినమేదరివీధి మీదుగా డైలీమార్కెట్ జంక్షన్ రథం వీధిలో ఉత్సవ మండపం ఏర్పాటు చేశారు. అక్కడ పూజలు నిర్వహించారు.ప్రజలు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు.


## శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీముఖలింగం గ్రామంలో వెలసియున్న శ్రీ ముఖలింగేశ్వర స్వామివారిని ఆదివారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు వేదమంత్రాలతో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ఎమ్మెల్యే గోవిందరావుకు తీర్థప్రసాదాలు అందజేశారు.


## కొల్లిపాడులో షామియానా సామాన్లు దగ్ధం ..రూ.20 లక్షల ఆస్థి నష్టం

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు గ్రామంలో శనివారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో దూపాన భాస్కరరావుకు చెందిన షామియానా (టెంట్ హౌస్) సామాన్లు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల విలువైన సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామంలోని ఓ రూంలో టెంట్లు, మైక్ సెట్, క్లాత్ డెకరేషన్, లైటింగ్ సామాన్లు భద్రపపరిచారు. అగ్ని ప్రమాదంలో మొత్తం కాలి బూడిదయ్యాయి. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండడంతో పాత సామానులతో పాటు కొత్త సామానులు తెచ్చి భద్రపర్చాడు. కోటబొమ్మాళి అగ్నిమాపక కేంద్రం సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆపినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే మొత్తం సామాన్లు కాలిపోయాయి. 20 లక్షల రూపాయిల సామాన్లు కాలిపోవడంతో బాధితుడు అబోదిబోమంటున్నాడు. ప్రభుత్వపరంగా తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నాడు.

## శివ నామస్మరణతో మారుమ్రోగిన శైవ క్షేత్రాలు



పాతపట్నం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఓం నమః శివాయ అంటూ పంచాక్షరి మంత్రంతో శైవక్షేత్రాలు మారుమోగాయి. వేకువజాము నుంచి శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహా శివరాత్రి అంటే శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజని భక్తుల విశ్వాసం. మాఘ బహుళ చతుర్దశి నాడు వచ్చే ఈ పర్వదినాన్ని భక్తులు ఎంతో నిష్టతో రోజంతా ఉపవాసం ఉండి శివధ్యానంలో గడుపుతారు. శివుడు లింగాకారుడిగా ఆవిర్భవించిన సమయం ఇదేనని పురాణాలు చెబుతున్నాయి. స్థానిక శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయం, శ్రీ కేదారేశ్వర స్వామి ఆలయం, శ్రీ మంజునాథ స్వామి ఆలయం, జోగి కొండపై గల శ్రీ జోగేశ్వరస్వామి ఆలయంతో పాటు, మండలంలోని శైవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుండే భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు మరియు బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. ఆలయాల్లో తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం పంచాయతీ ద్వారకాపురం గ్రామంలో స్వయంభుగా వెలసినటువంటి శ్రీఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో సర్పంచ్ ప్రతినిధి, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామివారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో భక్తులకు మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పాతపట్నంలోని జోగేశ్వర ఆలయానికి విచ్చేసిన భక్తులకు స్థానిక పంచాయితీ కార్యాలయ ఆవరణలో టీడీపీ నాయకులు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, నీలమణి దుర్గా ఆలయ కమిటీ చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, ఆర్ చలపతి, దుర్గారావు, నారాయణ, శ్రీను, దాసరి రమణ, మజ్జి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## బొలెరో వాహనం ఢీకొని ఆరేళ్ల బాలుడు మృతి





రాజాం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

రాజాం మండలం గార చీపురుపల్లి గ్రామానికి చెందిన మద్దు నారాయణరావు కుమారుడు మద్దు లోహిత్ సాయి (6) అనే బాలుడు తన తాత గారి ఇప్పిలిపేట గ్రామానికి శివరాత్రి పండుగ సందర్భంగా వచ్చినట్లు అచ్చుట గల మెయిన్ రోడ్డును దాటుచుండగా చీపురుపల్లి వైపు నుండి రాజాం వైపు వస్తున్న బొలెరో వాహనంను నడుపుతున్నటువంటి డ్రైవర్ వాహనాన్ని అతివేదంగా అజాగ్రత్తగా హారన్ కొట్టకుండా నడుపుకుంటూ వచ్చి రోడ్డు దాటుతున్న బాలుడిని గుద్దించి వేసినట్లు, బాలుడు రోడ్డుపైన పడిపోగా వీపుకు వెనుకవైపు రగుడు గాయలు కలిగినట్లు, వెంటనే అచ్చుట ఉన్న వారి బంధువులు దెబ్బలు తగిలిన బాలుడిని రాజాం జిఎంఆర్ కేర్ హాస్పిటల్ తీసుకొని వచ్చి చేర్పించగా డ్యూటీ డాక్టర్ చికిత్స చేసినట్లు నిర్ధారించినట్లు సదరు విషయంను తన తండ్రి మద్దు నారాయణరావు ఫిర్యాదు మేరకు రాజాం పట్టణ ఎస్సై పి.ఉమా వెంకటేశ్వరరావు కేసు నమోదు పరిచి దర్యాప్తు చేయుచున్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీవాణీ విద్యానికేతన్ ప్రతిభ





ఆమదాలవలస, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త) విజయవాడకు చెందిన "విశ్వం ఎడ్యుటెక్" సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మేథ్స్ పోటీల్లో ఆమదాలవలస శ్రీ వాణీ విద్యా నికేతన్ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. 9 వ తరగతి విద్యార్థి పి.వెంకట సాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో తృతీయ బహుమతిని, 5వ తరగతి విద్యార్థిని కె.మమత రాష్ట్ర స్థాయి తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో శ్రీవాణీ విద్యానికేతన్ మెడల్, ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అధికారులు చేతులు మీదుగా అందజేశారు. శ్రీ వాణీ విద్యానికేతన్ డైరెక్టర్ బలివాడ వేంకటేశ్వర్లు, కరస్పాండెంట్ బలివాడ నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ బలివాడ సంపత్ కుమార్, వేదిక్ మ్యాథ్స్‌లో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయినుల మూలంగా ఆమదాలవలసకు స్టేట్ లెవెల్ విజయం దక్కినందుకు పలువురు విద్యావేత్తలు శ్రీ వాణీ విద్యానికేతన్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో విజేతగా నిలిచిన కె.మమత తండ్రి సామాన్య వ్యవసాయదారుడు, వేదిక్ మ్యాథ్స్‌లో పతకం సాధించిన పి.వెంకట సాయి తండ్రి ఆటో డ్రైవర్. సాధారణ కుటుంబాల్లో పుట్టిన ఈ ఇరువురు ఇంతకు ముందు కూడా చాలా పోటీల్లో పలు బహుమతులు సాధించారు. రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించిన పాఠశాలతో పాటు విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు.

16- 2 pg 9.qxd:16- 2 pg 9.qxd 1/1/02 5:58 AM Page 1





ప్రసవం అయ్యాక బాలింతల్లో అనేక సమస్యలు తలెత్తుతాయి. బరువు పెరుగుతారు. సరిగా నిద్ర ఉండదు. తరచూ కోపం, చిరాకు వంటి వాటికి లోనవుతారు. అనుక్షణం పసి పిల్లల్ని కనిపెట్టుకుని ఉండటమే తప్ప తమ గురించి పట్టించుకునే తీరిక ఉండదు. కొందరిలో గుండెజబ్బులు, డయాబెటిస్ వంటివీ రావొచ్చు. వీటన్నింటితో వాళ్లు

## పెల్విక్ ఎక్సర్‌సైజులు

డిప్రెషన్‌కి లోనవుతారు. పరిస్థితి అంతవరకూ వెళ్లకూడదంటే ప్రసవం అయిన తొలి మూడు నెలలూ బాలింతలు చురుగ్గా ఉండటం చాలా అవసరమని అంటోంది బ్రిటిష్ కొలంబియా యూనివర్సిటీ, కెనడియన్ సొసైటీ ఫర్ ఎక్సర్‌సైజ్ సైకాలజీ సంస్థలు చేసిన అధ్యయనం. బాలింతలు తొలి మూడు నెలలు తప్పనిసరిగా నడవడం, వీలుంటే సైక్లింగ్, ఇతర తేలికపాటి వ్యాయామాలకి రెండు గంటల సమయం కేటాయిస్తే తీవ్ర భావోద్వేగాలకు దూరంగా ఉండటమే కాదు శారీరకంగా పూర్వపు స్థితికి రావడం తేలిక అవుతుందని పరిశోధకులు అంటున్నారు. సాధారణ వ్యాయామాలతో పాటు కండరాలకు సంబంధించిన పెల్విక్ ఎక్సర్‌సైజులు చేయడం, సరైన సమయానికి నిద్రపోవడం కూడా ముఖ్యమేనట. పెల్విక్ ఎక్సర్ సైజులు చేయడం ద్వారా ప్రసవం తర్వాత రికవరీకి సహాయంగా ఉంటుంది. నడుము భాగం బలంగా ఉంటుంది. ఈ ఎక్సర్‌సైజులు చేసేటప్పుడు ఖాళీ మూత్రాశయంతో చేయాలి. నొప్పి ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి. ◆

## వీఆర్‌తో స్టేజ్ ఫియర్‌కు చెక్



కొంత మందికి స్టేజ్ ఎక్కాలంటే వణుకు పుడుతుంది. నలుగురిలోకి వచ్చి మాట్లాడాలంటే నోరు పెగలదు. నిజానికి చావు భయం తర్వాత అంతగా భయపెట్టే సందర్భం పబ్లిక్ స్పీకింగ్ సమస్యే అని గత అధ్యయనాలూ తేల్చాయి.
ఈ భయాన్ని పోగొట్టుకుని కెరీర్‌లోనూ, వ్యక్తిగతంగానూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసేందుకు అనేక రకాల పుస్తకాలూ మార్కెట్‌లోకి వచ్చాయి. వాటితోపాటు కోచింగ్‌లూ, సాధన చేయడం కొంతవరకూ ఈ సమస్యకు పరిష్కారం చూపించినా, వర్చువల్ రియాలిటీ పరిజ్ఞానం మరింత మెరుగైన ఫలితాలని అందిస్తోందట లండన్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'వీ ఆర్ ప్లాట్‌ఫామ్' వీటిపైన ఇటీవల ఓ అధ్యయనం నిర్వహించింది. వెయ్యి మంది విద్యార్థులని తీసుకుని వాళ్లకు వర్చువల్ రియాలిటీలో సైన్స్ ఫెయిర్లూ, పెద్ద పెద్ద ఆడిటోరియాలూ, కాన్ఫరెన్స్ హాళ్లను చూపిస్తూ ఆయా ప్రదేశాల్లో బెదురు లేకుండా ఎలా మాట్లాడాలో శిక్షణ ఇచ్చింది. వాళ్లు మాట్లాడుతున్నప్పుడు ఏఐ కోచ్ వారి హావభావాలనీ, ఆత్మవిశ్వాసాన్నీ పరీక్షిస్తుంది.



ఇలా వీఆర్ పద్ధతిలో మాట్లాడిన విద్యార్థులు ఒకటి, రెండు సెషన్ల తర్వాత క్రమంగా ఆత్మవిశ్వాసం పెంచుకుంటూ బెరుకు లేకుండా ధైర్యంగా మాట్లాడటాన్ని వీఆర్ ఫ్లాట్‌ఫామ్ టీమ్ గమనించింది. తక్కిన పద్ధతుల్లో పోలిస్తే వీఆర్ విధానంలో పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలు తొందరగా పట్టుబడుతున్నాయని ఈ అధ్యయనం తేల్చింది. □

## ఆదర్శ మహిళ



ఆధ్యాత్మికం, పురాణాలు, చరిత్రలో చూసుకుంటే ఎందరో మహిళలు మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచారు. వారిలో సీతమ్మతల్లికి సాటిగా ఉదాత్త వ్యక్తిత్వం కలిగిన స్త్రీ ఊర్మిళాదేవి. అయోధ్యలో ఆనాడు సీతారాముల పట్టాభిషేకం అనే మంగళకర సమాచారం విని ఎంతో సంబరపడుతూ, ఆనందంతో సీతారాముల వైభవాన్ని తలచుకొంటూ, అంతఃపురంలో ఒక ఊహాచిత్రాన్ని గీస్తూ ఉన్న సమయంలో లక్ష్మణుడు ఎంతో కలవరపాటుతో మందిరంలో అడుగు పెడతాడు. అది గమనించిన ఊర్మిళ మనసులో అలజడి మొదలై, తొట్రుపాటుతో వణికిపోగా, రంగులన్నీ ఒలికి ఆమె గీస్తున్న చిత్రం చెడిపోతుంది. "కైకమ్మ వల్ల శ్రీరామచంద్రుని పట్టాభిషేకమే భంగమైంది! ఇక ఈ చిత్రానిదేముంది?" అంటూ కుమిలిపోతాడు లక్ష్మణుడు.
"అన్నగారితో తానూ 14 సం॥ వనవాసం వెళ్లి సీతారాముల సేవ చేసుకొంటాను" అని ఊర్మిళతో చెబుతాడు. భర్త తనను రమ్మని అనలేదు. తను కూడా వెంట వస్తాననీ పట్టుబట్టలేదు. పైగా, "మీ అన్నా వదినల సేవలో మీరు తరించండి. కానీ వనవాస కాలంలో నా గురించి ఆలోచించకండి" అని అంటుంది. అందుకే సీతారామ లక్ష్మణులకు వీడ్కోలు చెప్పేందుకు కూడా ఆమె అంతఃపురం విడచి బయటకు రాలేదు. భర్తతో అరణ్యవాసాన్ని అయోధ్య వాసంలా భావించి, చరించిన చరిత సీతమ్మతల్లిదైతే, భర్త చేసిన త్యాగానికి ప్రతిఫలంగా అయోధ్యనే అరణ్యంగా భావించి జీవనం సాగించి ఘనత ఊర్మిళది.
రామ-రావణ యుద్ధంలో లక్ష్మణ మూర్ఛతో రాముడు అల్లాడుతుండగా, హనుమంతుడు సంజీవని పర్వతాన్ని పెళ్లగించి, చేతబట్టి అయోధ్య మీదుగా వెళ్తుండగా, విషయం తెలుసుకోవాలనే కోరికతో భరతుడు పర్వతంతో సహా హనుమంతుడిని కిందికి తన దివ్యశక్తితో దించుతాడు.
కౌసల్యతో సహా అందరూ హనుమంతుని ద్వారా లక్ష్మణుడి దుస్థితిని తెలుసుకొని దుఃఖిస్తూ ఉంటారు. కానీ ఊర్మిళ మాత్రం నిశ్చలంగా ఉండటాన్ని గమనించి హనుమంతుడు ఆశ్చర్యంగా "అమ్మా, నీవు ఇంత నిర్భయంగా ఎలా ఉండగలుగుతున్నావు? నేను సూర్యోదయం లోపలే నీ భర్త దగ్గరకు చేరకపోతే ఆయన ప్రాణాలకే ముప్పు కలుగుతుంది కదా! నీకు ఏమాత్రం ఆందోళన కలగటం లేదా?" అని అడుగుతాడు.
అప్పుడు ఊర్మిళాదేవి "మీరు ఎంతో అమాయకులు. నిరంతరం రామ నామ 'అమృత' పానం చేసే నా భర్తను ఆ రామచంద్రుడు రక్షించకుండా ఉంటాడా? మూర్ఛ పేరుతో నా భర్తకు కొంతసేపు విశ్రాంతి ఇచ్చాడు అంతే! అయినా నా మంగళసూత్రంపై ఒట్టు పెట్టి చెప్తున్నా. హనుమా! నీవు లంకకు చేరి నీ సంకల్పం నెరవేరేవరకు సూర్యోదయం కాదు" అన్నది. అక్కడ ఉన్న అందరూ ఆమె మనోధైర్యానికి ఆశ్చర్యపడతారు.
పట్టాభిషేకం తరువాత శ్రీరాముడు ఊర్మిళతో "తల్లీ! నీవు చేసిన త్యాగంతోనే మేం అక్కడ అన్ని సమస్యలను తట్టుకొని నిలబడగలిగాం. అందుకే నా సీత, నా సోదరుడు లక్ష్మణుడితో పాటుగా నువ్వు కూడా మా పక్కనే ఆసీను రాలివై ఉండమని" అన్నాడు. అంతటి రామానుగ్రహానికి పాత్రమైన ఊర్మిళ కళ్లు చెమ్మగిల్లడంతో "ప్రభూ! మీ పాదాల వద్ద చోటు కన్నా పరపావనమైనది ఏదీ లేదు. ప్రతి రోజూ మీ అనుగ్రహాన్ని పొందే నైవేద్య రూపంలో నేను ఉండేలా నన్ను అనుగ్రహించండి" అని వేడుకొన్నది.
అప్పుడు శ్రీరాముడు కలియుగంలో పూరీ క్షేత్రంలో నేను కృష్ణావతారంలో వెలుస్తాను. నా సోదరుడు బలరాముడి నాకు తోడుగా ఉంటాడు. నువ్వు విమలాదేవిగా, ఆ ఆలయ క్షేత్రపాలకురాలిగా, అక్కడ నిత్యం నైవేద్యం కోసం తయారు చేసే మహాప్రసాదంలో కొలువై ఉంటావు" అంటూ వరం ఇచ్చాడు. ఇప్పటికీ పూరీ జగన్నాథుని ఆలయం పక్కన విమలాదేవి ఉపాలయం కనిపిస్తుంది. అక్కడ నిత్యం తయారయ్యే ప్రసాదాన్ని ఆ అమ్మవారికి నివేదించిన తరువాతే భక్తులకు అందిస్తూ ఉంటారని ప్రతీతి.

– పద్మ

## ఎంత ఉంటే ఏమి ప్రయోజనం?

అతడు చాలా అందగాడు. యువకుడు. ధనం వుంది. గొప్ప కులంలో పుట్టాడు. అయినా అతను, అతని జీవితమూ వృథా చేస్తూ వున్నాడు. మంచి వర్ణంతో కూడినది ఆ పుష్పం. వికాసంగా వుంటుంది. కానీ దానికి వాసనయోగ్యం లేదు. అదే బాడిన పుష్పం. అలాగే హంసల గుంపులో కొంగ ఎలా ప్రకాశింపదో, ఆ విధంగానే విద్యావిహీనుడు సర్వ ఐశ్వర్యములుండి కూడా జనాల మధ్యలో శోభింపడు. మీరు గమనించే వుంటారు.. కొన్ని మేకలకు గళంలో స్తనాలుంటాయి. అవి పరిహాసపాత్రములేగానీ, పాలుమాత్రం వుండవు. విద్యలేని జన్మం కూడా ఆ విధంగా రాణించదు. విద్య లేని మానవ జన్మ కుక్కతోకవలే వ్యర్థం. అంటే కుక్కతోక దాని మర్మస్థానమును మెరుగుపరచుటకు, దేహమును బాధించే ఈగలను తోలుకోడానికి కూడా ఉపయోగపడదు. కానీ ఇతర జంతు వుల తోకలు అలా కాదు. కనుక విద్యాహీనుడు కేవలం భూమికి భారమేగానీ దానివలన కొంచెం అయినా ఉపయోగం లేదు. విద్య అనేది రహస్యంగా దాచిపెట్టిన ధనం. విద్యయే సకల భోగాలను, కీర్తినీ, సుఖాన్నీ ఇస్తుంది. విద్య గురువు లాగా అన్నింటినీ బోధిస్తుంది. పరదేశంలో చుట్టం లాగా సహాయం చేస్తుంది. విద్యాధనమే అసలైన ధనం.



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి

## ఉప్పుతో ముప్పు!



ఉప్పు తింటే బిపి పెరుగుతుందన్నది తెలిసిందే! కానీ ఉప్పుకీ మానసిక ఆరోగ్యానికి కూడా సంబంధం ఉందని చెబుతోంది చైనాలోని నాన్జింగ్ యూనివర్సిటీ చేసిన ఈ పరిశోధన. అతిగా ఉప్పు తీసుకోవడం కుంగుబాటుకీ దారితీస్తుందని హెచ్చరిస్తోంది. ఉప్పు మన శరీరంలోని ఐఎల్-17ఏ అనే ప్రోటీన్‌ని పెంచుతుండడాన్ని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు గమనించారు. ఇది ఆటో ఇమ్యూనిటీని పెంచే ప్రోటీన్. కొవిడ్ వంటివి వచ్చినప్పుడు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ అవసరాని కంటే ఎక్కువగా స్పందించి (సైటోకైన్ రియాక్షన్ అంటారు) మనకెక్కువ చెడు చేయడానికి ఇదే కారణం. అదొక్కటే కాదు.. మన మెదడులోని కుంగుబాటుకి కారణమయ్యే రసాయనాలన్నీ ఈ ప్రోటీన్ ప్రేరేపిస్తుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఇన్ని సమస్యలకి కారణమయ్యే ఐఎల్-17ఏ ప్రోటీన్ ఉప్పుతో పెరుగుతోందని నాన్జింగ్ వర్సిటీ పరిశోధకులు గుర్తించారు. కాబట్టి మానసిక సమస్యలకి చికిత్స తీసుకుంటున్నవాళ్లు ఉప్పుని ఎంత తగ్గిస్తే అంత మేలని చెబుతున్నారు. □

## పనీర్ బాదుషా

పనీర్ బాదుషా అనేది సాంప్రదాయ దక్షిణ భారతీయ మిఠాయి అయిన బాదుషాకి ఒక ప్రత్యేక రూపం. ఉత్తర భారతదేశంలో ఇదే మిఠాయిని బాలూశాహీ అని పిలుస్తారు. సాధారణ బాదుషాలో మైదా ప్రధాన పదార్థం కాగా, పనీర్ బాదుషాలో పనీర్ కలపడం వల్ల ఇది మరింత మృదువుగా, రిచ్‌గా ఉంటుంది. దీనికి కావలసినవి: **మైదా:** ఒకటిన్నర కప్పు, **పనీర్ తురుము:** రెండు వందల గ్రాములు, **నెయ్యి:** ఆరు టేబుల్ స్పూన్లు, **పెరుగు:** నాలుగు టేబుల్ స్పూన్లు, **పాలు:** అరకప్పు, **బేకింగ్ సోడా:** పావుచెంచా, **కుంకుమపువ్వు రేకలు:** పది, **యాలకుల పొడి:** పావుచెంచా, **చక్కెర:** రెండు కప్పులు, **నీళ్లు:** కప్పు, నూనె లేదా నెయ్యి వేయించేందుకు సరిపడా. **తయారు చేసే విధానం:** చక్కెర, నీళ్లు ఓ గిన్నెలో వేసుకొని స్టవ్‌మీద పెట్టాలి. చక్కెర కరిగాక కుంకుమపువ్వు రేకలు, యాలకులపొడి వేసి లేతపాకంగా ఉన్నప్పుడే దింపేయాలి. ఓ గిన్నెలో మైదా, బేకింగ్‌సోడా వేసి కలుపుకోవాలి.



తరువాత నెయ్యి వేస్తూ కలపాలి. ఇప్పుడు పనీర్ తురుము కూడా వేసుకుని బాగా కలిపి పాలు, పెరుగు వేసుకోవాలి. ఇవన్నీ బాగా కలిశాక నీళ్లు చల్లుకుంటూ గట్టి పిండిలా చేసుకుని మూత పెట్టాలి. అయిదు నిమిషాలయ్యాక కొద్దిగా పిండిని తీసుకుని వెడల్పుగా చేసి మధ్యలో చిల్లులా పెట్టుకోవాలి. ఇలా అన్నింటినీ చేసుకుని రెండు మూడు చొప్పున కాగుతున్న నూనె లేదా నెయ్యిలో వేస్తూ ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. వీటిని చక్కెర పాకంలో వేసుకుని అయిదు నిమిషాలయ్యాక విడిగా తీసుకోవాలి. □



## కుటుంబ విలువలు ప్రతిబింబించేలా

గ్రామీణ నేపథ్యంతో కుటుంబ బంధాల ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా రూపొందుతున్న రాయుడి గారి తాలుకా చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఉలిశెట్టి మూవీస్ బ్యానర్‌పై ొరపాటి నవీన్ శ్రీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రీనివాస్ ఉలిశెట్టి, సత్య ఈషా జంటగా నటిస్తున్నారు. నిత్యశ్రీ, పునర్వికా వేద శ్రీ, నవీన్ శ్రీ, పీజే దేవి, కరణం పేరినాయుడు నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్‌దశలో వేగంగా పనులుజరుపుకుంటోంది. మ్యూజిక్, ఎడిటింగ్, డబ్బింగ్ వంటి కార్యక్రమాలు పూర్తయ్యే దశకు చేరుకున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను బంగార్రాజు ఫేమ్ దర్శకుడు కళ్యాణ్ కృష్ణ చేతుల మీదుగా విడుదలచేశారు. ట్రైలర్‌లో కుటుంబ బంధాలు, భావోద్వేగాలు, గ్రామీణ జీవనశైలి ప్రధానంగా కనిపించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో కళ్యాణ్ కృష్ణ మాట్లాడుతూ.. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా గురించి ఇప్పటికే చాలా మంది ద్వారా విన్నాను

## కావేరితో ముద్దుగా



మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఇరుముడి చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. రవితేజకు ఇది 77వ సినిమా. మైత్రి మూవీ మేకర్స్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తోంది. ఇటీవల రవితేజ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఆదివారం మహా శివరాత్రి శుభ సందర్భంగా హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె కావేరి పాత్రలో కనిపించనుంది. రవితేజ రగ్గడ్ లుక్‌లో ఆమె చెంపపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించగా, ఇద్దరి మధ్య ఉన్న పోస్టర్ ఇద్దరి మధ్య ఇంటెన్స్‌ను చూపిస్తుంది. ఈ లుక్‌ను బట్టి చూస్తే గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా లాగా అనిపిస్తుంది. శివ నిర్వాణ ఇంటెన్స్, ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. ముఖ్యంగా తండ్రి-కూతురు అనుబంధం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. రవితేజ గత సినిమాలకంటే భిన్నంగ కొత్త ఎమోషనల్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించబోతున్నారు. బేబీ నక్షత్ర రవితేజ కుమార్తెగా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# తెర

## మహావతార్‌ను మించి...

కోట్ల రూపాయల కలెక్షన్లను రాబట్టుకున్న మహావతార్ చిత్రాన్ని మించిన అద్భుతాలతో మరో యానిమేటెడ్ ఫిల్మ్ తెరకెక్కుతోంది. దీని టైటిల్.. పినాకిన్. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నిర్మాతలు ఆవిష్కరించారు. ఈ ఏడాది దసరా దీపావళి పండగ సీజన్ సమయంలో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన తొలి అధికారిక ప్రకటన ఇదే. ఈ చిత్రం విధి, విశ్వం, శివతత్వం వంటి అంశాలను ఇతివృత్తంగా తెరకెక్కుతున్నట్లు చెబుతునారు. ఓ అద్భుతమైన దృశ్యరూపంగా చిత్రీకరణ జరుపుకొంటోంది. పినాకిన్ మూవీ దర్శకుడు నితిన్ జీ. ఆయనే రచనను కూడా సమకూర్చారు. ఈ చిత్రానికి కమల్ భారతి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్



రూపొందిస్తోంది. హర్ష్ పండిట్, వామన్ రాణే నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. పినాకిన్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్.. హిందీ, ఇంగ్లీష్, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. మహావతార్ నరసింహను మించిపోతుందనే అంచనాలు ఉన్నాయి.

## పూరీ ఆలయ నిగూఢ రహస్యాలతో

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా మూవీ నాగబంధం. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మాతలు. మహా శివరాత్రి సందర్భంగా సూపర్‌స్టార్ మహేష్ బాబు టీజర్‌ను విడుదల చేశారు. రీబీసీ ఫేమ్ గరుడ రామ్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ ఆయన పాత్ర బైరాగిని పరిచయం చేశారు. బూడిదతో అలంకరించిన శరీరం, జటలతో కూడిన ఆతన లుక్ మిస్టికల్ టచ్ ఇచ్చింది. ఇంటెన్స్ లుక్స్, రుద్రాక్షలు, ఎముకలతో చేసిన మాలలు ఆయనను శక్తివంతమైన తాంత్రిక యోధుడిగా కనిపిస్తున్నారు. దర్శకుడు అభిషేక్ నామా మాట్లాడుతూ.. ఇది కేవలం రాసుకున్న కథ కాదని, ఏ చరిత్ర పుస్తకాల్లోనూ లేని ఒక అద్భుతమైన గాథ అని తెలిపారు. అనంత పద్మనాభ స్వామి ఆలయం, పూరీ జగన్నాథ ఆలయాల్లోని నిగూఢ రహస్యాలు, వాటిని రక్షి ంచే నాగబంధం అనే ఆధ్యాత్మిక శక్తుల నేపథ్యంతో 1750 కాలంలో సాగే కథగా ఇది తెరకెక్కుతుందని తెలిపాడు. టీజర్‌లో విజువల్స్ ఉద్భుతంగా ఉన్నాయి. ప్రెజెంట్ జనరేషన్‌కి శివతత్వానికి లింక్ చేస్తూ వచ్చిన ఈ టీజర్ మైండ్ బ్లాంక్ చేసింది అనే చెప్పాలి. ఇక శివుడిగా విరాట్ కర్ణ లుక్ అదిరిపోయింది. ఈ ఒక్క టీజర్ సినిమాపై అంచనాలను ఒక



రేంజ్‌లో పెంచేసింది. ఇప్పటికే దాదాపు షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్స్ లోకి రానుంది. ఇక నాగబంధం సినిమాలో జగపతి బాబు, నభా నటేశ్, ఐశ్వర్యా మేనన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు.



## మొదటి శుభలేఖ మామయ్యకే

యంగ్ హీరో అల్లు శిరీష్ పెళ్లి పనులు అధికారికంగా మొదలయ్యాయి. తన వివాహ మహోత్సవానికి సంబంధించిన తొలి శుభలేఖను ఆయన తన మామయ్య, మెగాస్టార్ చిరంజీవికి అందజేశారు. నయనికా రెడ్డితో త్వరలో ఏడడుగులు నడవనున్న శిరీష్, కుటుంబంలో పెళ్లి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అల్లు శిరీష్ తన తల్లిదండ్రులైన అల్లు అరవింద్, నిర్మలతో కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారు. తన మేనత్త సురేఖ, చిరంజీవి దంపతులకు పెళ్లి పత్రికను ఇచ్చి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఫొటోలను శిరీష్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. మా సంప్రదాయం ప్రకారం, మామయ్య చిరంజీవి గారికి, అత్త సురేఖ గారికి మొదటి పెళ్లి పత్రిక ఇచ్చాం.. అని పోస్ట్‌లో పేర్కొన్నారు.


## భయం గుప్పిట్లో సెలబ్రిటీలు..

కొన్నేళ్ల క్రితం బాలీవుడ్‌కి మాఫియా నుంచి బెదిరింపులు వచ్చేవి అని వార్తలు వచ్చేవి. ఇప్పుడు మళ్ళీ బాలీవుడ్‌కి వరుస బెదిరింపులు వస్తున్నాయి. మొన్నటి దాకా సల్మాన్ ఖాన్ ఒక్కడికే చంపేస్తామని లారెన్స్ బిష్ణోయ్ అనే గ్యాంగ్ బెదిరించేది. కానీ ఇప్పుడు వరుసగా దర్శకులు, హీరోలు, హీరోయిన్స్‌కి బెదిరింపులు వస్తున్నాయి. గత వారం రోజుల గ్యాప్‌లోనే బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్, స్టార్ డైరెక్టర్ రోహిత్ శెట్టి, సల్మాన్ ఖాన్ బామ్మర్ది ఆయుష్ శర్మకు బెదిరింపులు వచ్చాయి. వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా వీళ్ళని బెదిరిస్తున్నారు. ఇందులో కొంతమంది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనే చెప్తున్నారు.
కొంతమందికి అజ్ఞాత వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వస్తున్నాయి. పోలీసులు ఇప్పటికే వీటిపై విచారణ చేస్తున్నారు. తాజాగా ఓ హీరోయిన్‌కి బెదిరింపులు వచ్చాయి. నటి, సింగర్ హిమాన్షీ ఖురానాని 10 కోట్లు ఇవ్వాలంటూ ఓ దుండగుడు ఈమెయిల్ ద్వారా వాయిస్ నాట్ పంపించాడు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భయపెట్టాడు. దీంతో హిమన్షి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ ఈమెయిల్‌తో పోలీసులు విచారణ చేపట్టారు. ఇలా వరుసగా రోజూ బాలీవుడ్ సెలబ్రిటీలకు బెదిరింపులు వస్తుండటంతో వాళ్ళ విజ్ఞప్తి మేరకు పోలీసులు వాళ్లకు సెక్యూరిటీని కూడా ఏర్పాటు చేస్తున్నారు. స్టార్ హీరోలకు, బాలీవుడ్ సెలబ్రిటీలకు ఇలా వరుస బెదిరింపులు రావడంతో మిగతా వాళ్ళు భయపడుతున్నారు. ఇదంతా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చేస్తుందా లేదా ఇంకెవరైనా చేస్తున్నారా అనేది పోలీసులు విచారణ చేస్తున్నారు. చాన్నాళ్ల తర్వాత ఇలా బాలీవుడ్ స్టార్స్‌కి బెదిరింపులు వస్తుండటంతో అంతా భయపడుతున్నారు.



## వాళ్లలా ఎఐ వాడలేదు

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ నటిస్తున్న తాజా చిత్రం స్వయంభు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించిన ఈ పాన్ ఇండియా సినిమాని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. ఇటీవలే ఈ మూవీ టీజర్ రిలీజ్ అయింది. అయితే సాంకేతిక కారణాల వల్ల టీజర్‌ను రీఅప్‌లోడ్ చేస్తూ, హీరో నిఖిల్ పెట్టిన ఒక పోస్ట్ వివాదాస్పదంగా మారింది.



## రేవంత్‌రెడ్డికి విజయ్ దేవరకొండ పెళ్లి పిలుపు

టాలీవుడ్ ప్రేమ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహం ఈ నెల 26న రాజస్థాన్‌లోని ఉదయ్ పూర్‌లో వీరి వివాహం అత్యంత వైభవంగా జరగబోతోంది. ఉదయ్‌పూర్‌లోని ప్యాలస్‌లో ఇరువురి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం జరగనుంది. వివాహానంతరం ప్రముఖుల కోసం హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేసే



అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ కలిశాడు. హైదరాబాద్ లోని రేవంత్ నివాసానికి వెళ్లి స్వయంగా పెళ్లి పత్రికను అందించాడు. తన పెళ్లికి రావాలని ఆహ్వానించాడు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండకు ముఖ్యమంత్రి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైభవోపేతంగా మహా శివరాత్రి ఉత్సవాలు..శివనామస్మరణతో మార్మోగిన గరివిడి



గరివిడి ఫిబ్రవరి,15 ప్రభాత వార్త

గరివిడిలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. శివ నామస్మరణ తో గరివిడి మార్మోగింది. శంభో శంకర అంటూ భక్త జనావళి చేసిన ప్రార్ధనలతో ఆయా ప్రాంగ ణాలు పునీతమయ్యాయి. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. విశ్వభారత్ సేవా ట్రస్ట్, రీ యూనియన్ ఆఫ్ గరివిడి సంయుక్త ఆధ్వర్యంలో విశ్వ భారత్ ట్రస్ట్ చైర్మన్ బలివాడ రమేష్, రీ యూనియన్ ఆఫ్ గరివిడి ప్రధాన కార్యదర్శి ముదునూరు జగన్నాధరాజుల నేతృత్వంలో గరివిడి రతన్ చంద్ నగర్ ప్రాంగణంలో నిర్వహించిన శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ద్వాదశి లింగ ప్రతిష్ఠాపన,అష్టోత్తర నిమిశతీ లింగ స్థాపన వేలాది శివలింగాల మధ్య భక్తులు పూజలు చేసి తరించారు.వేద పండితులు రాంభట్ల సుబ్బారావు భక్తులు తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరివిడి, సమీప ప్రాంత ప్రజానీకం పూజల్లో పాల్గొని శివునికి కొలుచుకొని తరించారు. షష్టి పూర్తి మహోత్సవాల్లో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా రుద్రాభిషేకం, సాహస జ్యోతిర్లింగార్చన, కోటివత్తి దేపార్చనతో ఉత్సవ ప్రాంగణం పునీత మైంది. కార్యక్రమంలో తొలుత విశ్వ భారత్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక,అధ్యక్షుడు బలివాడ రమేష్ ఆధ్యాత్మికోపన్యాసం గావించగా, ప్రముఖ వ్యాఖ్యత ఉప్పు శ్రీను స్వాగత పలుకులు పలికారు.కార్యక్రమంలో విశ్వ భారత్ సేవా ట్రస్ట్ ,గరివిడి రీ యూనియన్ ప్రతినిధులు కంబాల శివ,సాగి భాస్కర రాజు,బొంపల్లి వెంకట రావు, బొడ్డేపల్లి ప్రసన్న కుమార్,కృష్ణారావు రఘు,టి వి రమణ, పి.కుమార్ లతో పాటు పలువురు సినీ తారలు , రాజకీయ ప్రముఖులు, ఉపాధ్యాయులు, వివిధ వర్గాలప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా మండల కేంద్రంలో గల వెంకటేశ్వర ఆలయంలో ఉన్న శివాలయం లోను, వెదుల్ల వలస, కోడూరు, గ్రామాల్లో గల శివాలయల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.అలాగే శివరాత్రి ఉత్సవ ప్రాంగణంలో శిష్ట కరణ సేవా సంఘ సభ్యులు వాండ్రంగి వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి భక్తులకు వైద్య పరమైన సేవలను అందించారు.

## రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధికి పునాది.. జనసేన ఇంచార్జ్ వబ్బిన.యం



శృంగవరపుకోట,ఫిబ్రవరి14, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి పునాది వేసినట్లేనని ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు.ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ బడ్జెట్ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు అన్ని వర్గాల వారికి దోహదం చేస్తుందని తెలిపారు. రైతు సంక్షేమం,విద్య వైద్యం, మహిళల సంక్షేమం,ప్రాజెక్టుల అభివృద్ధి,రోడ్లు, తాగునీరు,పారిశుద్ధ్యం,నిరుద్యోగులకు ఉపాధి కల్పన,భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి తదితర రంగాలకు రాష్ట్ర బడ్జెట్ ఎంతో మేలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబు రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జనసేన పార్టీ ఎస్.కోట ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు.

## ఘనంగా మహా శివరాత్రి వేడుకలు.. భక్తులతో శివాలయాలు కిటకిట..

శృంగవరపుకోట,ఫిబ్రవరి15,ప్రభాతవార్త



మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని అన్ని శివాల యాలు ఆదివారం భక్తులతో కిటకిట లాడాయి. ఉదయం మూడు గంటల ప్రాంతాల నుంచి ముఖ్యంగా ఎస్.కోట పుణ్యగిరి,ధర్మవరం శ్రీసన్యాశేస్వరస్వామి ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమ్రోగి పోయాయి.అలాగే తాటిపూడి,కొత్తూరు, గోపాలపల్లి, రాజీపేట శంభలనగరి, మండలం సమీపంలో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐదు వందల సంవత్సరాలు చరిత్ర కలిగి ఒక మర్రి రావిచెట్టు తొరలలో వెలిసిన అల్లూరి సీతారామరాజు జిల్లా కాశీపట్నం శ్రీఉమారామ కోటీశ్వర ఆలయానికి భక్తులకు వివిధ జిల్లాల నుంచి బారులు తీరారు.ఈసందర్భంగాస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మొత్తం మీద మహా శివరాత్రి వేడుకలు మండలంలోని అన్ని శివాలయాల్లో భక్తుల రాకతో ఘనంగా జరిగాయి.

## పారమ్మ కొండ పార్వతి పరమేశ్వరులు ఆలయానికి పోటెత్తిన భక్తజనం

పాచిపెంట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర నుండి ఒకటైన, ఈ ప్రాంత ఆరాధ దైవమైన పారమ్మ కొండపై వెలసిన పార్వతీ పరమేశ్వరులు ఆలయానికి ఆదివారం సూర్యోదయం కాకముందు నుండి భక్తులు పోటెత్తారు. (ఈ ఆలయము పాచిపెంట మండలం పలుకు వలస పంచాయతీ పెద్ద చీపురు వలస సమీపమున ) దశాబ్దాల కాలం నుండి ఈ ఆలయానికి ఎంతో ప్రాచనిత ఉంది. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో భక్తులు నాలుగు సోమవారాలు తరలి వెళ్లి పార్వతీ పరమేశ్వరుని దర్శించుకుంటారు. అదేవిధంగా మహాశివరాత్రి పురస్కరించుకొని సాలూరు నుండి ఆర్టీసీ బస్సులు భక్తుల కొరకు ఏర్పాటు చేశారు. సాలూరు పట్టణానికి సుమారుగా 7 కిలోమీటర్లు దూరంలో ఉండడంతో అధిక సంఖ్యలో మహిళలు పారమ్మ కొండకు ప్రతి ఏటా శివరాత్రి త్రీ సందర్భంగా అధిక సంఖ్యలోపార్వతి పరమేశ్వరిలు దర్శనం చేసుకుంటారు. మంత్రి సంధ్యారాణి ప్రత్యేక దృష్టిసారించి మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులకి ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా ఒక జాగ్రత్త తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి జిల్లా పోలీస్ సూపర్డెంట్ మాధవ రెడ్డి అసౌకర్యాలు కలవకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే కొండపైకి ఎక్కిన భక్తులకు ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా బార్కెట్లను నిర్మించి ప్రతి పది ఇరవై అడుగులకు ఒలంటీర్లను ఏర్పాటు చేసి భక్తులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. పారంకొండ దిగున అనేక సాంస్కృతి కార్యక్రమాలు టీ స్టాల్ లో అంగడి ఉచిత భోజనం ప్రసాదాలు ఆలయ నిర్వహణకు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఈరోజు ఉదయం నుండి రేపు ఉదయం వరకు భక్తులు గా తరలి వస్తుంటారు. ఎప్పటికప్పుడు ఎస్పి మాధవరెడ్డి శివరాత్రి సందర్భంగా స్వామివారిని దర్శించి కొని పోలీస్ అధికారులతో మాట్లాడి భక్తులకు వివిధమైన ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో భక్తులకు సహకరించి వారి మనోభావాలకు దెబ్బతినకుండా భక్తులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా పోలీసులు సాలూరు నుండి వచ్చిన బస్సులకు ట్రాఫిక్కు ఇబ్బందులు కలక్కుండా మధ్య మధ్యలో పోలీసులు పహారకాస్తు వైర్లెస్ సెట్ ద్వారా బస్సులను ఒకటి తర్వాత ఒకటి పంపుతున్నారు. మైకల్ ద్వారా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలకుండా అనౌన్స్ చేస్తున్నారు. ఏడాది లేనివిధంగా ఏడాది పారం కొండకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్లడంతో పాటు ప్రత్యేక శ్రద్ధ జిల్లా యంత్రాంగం చూపిన చొరవ పలువుర భక్తజనం ప్రశంసలు అందిస్తున్నారు. డ్రోన్ కెమెరాలు ద్వారా ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగాపాచిపంట తహసిల్దార్ డి రవి ఎంపీడీవో బీవీజే పాత్రో, సారూ రూరల్ సిఐ రామకృష్ణ టౌన్ సిఐ పలువురు సిఐలు స్థానిక ఎస్సై అర్జున్ఎస్సైలు పారమ్మ కొండకు వచ్చిన భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలక్కుండా పర్యవేక్షిస్తున్నారు.

## ప్రతీ భక్తుడుకు శివ దర్శనం కలగాలి :ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,ఫిబ్రవరి15, ప్రభాతవార్త



మహా శివరాత్రి సందర్భంగా శివాలయాలకు వచ్చే ప్రతీ భక్తుడుకు ప్రశాంతమైన శివ దర్శనం కలగాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల వారి కుటుంభం సభ్యులతో కలిసి మండలంలోని ధర్మవరం శ్రీసన్యాశేస్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా ఆలయ అధికారులు ఎమ్మెల్యే కోళ్లకు ఘనంగా స్వాగతం పలికారు.మహా శివరాత్రి సందర్భంగా పుణ్యగిరి,ధర్మవరం శ్రీసన్యాశేస్వర స్వామి ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పక్కగా ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు,మండల టీడీపీ అధ్యక్షుడు డి.అచ్చం నాయుడు,రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధురాలను స్వామివారిని దర్శించుకునేందుకు ద్విచక్ర తోపుడు బండితో తీసుకెళ్తున్న పోలీసులు



పాచిపెంట ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం పారమ్మకొండకు పార్వతీపర పరమేశ్వరులు దర్శించుకున్నందుకు వృద్ధురాలనీ పోలీసులు రెండు చక్రాల బండితో తీసు వెళ్తున్న దృశ్యం పలువురిని ఆకర్షితులు చేసింది. ఇన్నోవియా ప్రియాసులు గుర్రై భక్తిశ్రద్ధలతో ఇంత జన సమూహంలో పారమ్మ కొండకువచ్చి, స్వామివారిని దర్శించు కుందమని ఆమె కోరికను పోలీసులు స్థానిక తహసిల్దారు రవి మానవతా దృక్పథంతో పాటు సేవా భావంతో ఆమెకు దగ్గరుండి ఆలయము కిందనున్న పార్వతి పరమేశ్వరులు దర్శినము చేయించారు. అదేవిధంగా అన్ని విధాలుగా భక్తులకు ఏ విధమైన ఇబ్బం దులు కలగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం పోలీసులకు అభినందనలు తెలియజేస్తున్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన పంచముఖేశ్వర దేవాలయం

### విశేష రుద్రాభిషేక పూజలు అందుకున్న అద్భుత శివలింగం



సాలూరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

సాలూరు పట్టణంలో ఎన్నో వేల సంవత్సరాలు చరిత్ర కలిగిన పంచముఖి శివలింగం దర్శనం కోసం మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తులు పోటేత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుండే శివభక్తులు ఇంకా మహిళలు అలాగే టౌన్ చుట్టుపక్కల విలేజీల్లో నుంచి ప్రజలు ఆలయానికి చేరుకున్నారు.అలాగే పంచముఖి శివలింగం దర్శనం చేసుకుని అభిషేకాలతో పూజలు నిర్వహించారు.అంతేకాకుండా ధ్వజ స్తంభం దగ్గర మహిళలు దీపారాధన చేసి పసుపు కుంకుమ పూలతో పూజలు చేసారు.ఇక్కడ ఇంకో విశేషం పంచ ముఖాలు కలిగిన శివలింగం ఒకటి ఇక్కడ రెండు నేపాల్లో మాత్రమే ఉందని సమాచారం.అలాగే శివరాత్రి రోజు ఉదయం నుంచి రాత్రంతా దేవాలయం తెరిచే ఉంటుందని లింగాష్టకం,శివమంత్రాక్షరి అలాగే రుద్రాభిషేకాలతో పూజలతో భక్తులు నిర్వహించి జాగారం చేస్తారని ఆలయ అర్చకులు స్పష్టం చేశారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

కురుపాం, ఫిబ్రవరి15ప్రభాతవార్త



మహిళా చట్టాలపై, సైబర్ నేరాలపై కురుపాం కేజీబీవీ పాఠశాల బాలికలకు సబ్ ఇన్స్పెక్టర్ పి నారాయణ రావు అవగాహన కల్పించారు. ఆదివారం పాఠశాలను సందర్శించి అక్కడ చదువుతున్న విద్యార్థినిలకు పలు చట్టాల పైన అవగాహన కల్పించారు. మహిళలకు ఇటీవల జరుగుతున్న అనార్థాలు పైన వాటిని ఎదుర్కొనే విషయంపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు .ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తుకు దశాదిశా చూపించే బడ్జెట్: మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

భోగాపురం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దశ, దిశను రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ చూపించిందని ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. బడ్జెట్ పట్ల ఆయన హర్షం ప్రకటించారు. మండలం లోని పోలిపల్లి లోని తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బంగార్రాజు మాట్లాడారు. "రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ-భవిష్యత్కు ఒక బ్లూ ప్రింట్లా బడ్జెట్ ఉందని అన్నారు. ఇది గణాంకాల పుస్తకం కాదని. కోట్లాదిమంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే విజన్ డాక్యుమెంట్ అని పేర్కొన్నారు. మాటల కోసం కాకుండా ప్రగతి కోసం ఏర్పాటు చేసిన బడ్జెట్ ఇదని ఆయన వ్యాఖ్యణించారు. రాష్ట్ర భవిష్యత్కు స్పష్టమైన దశను, దిశను చూపే విధంగా బడ్జెట్ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ను కూటమి ప్రభుత్వం రూపొందించడం జరిగిందని. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు వచ్చేలా ఈ బడ్జెట్ ఉందనిఅన్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్దే లక్ష్యంగా వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం రంగాలను బలోపేతం చేసే విధంగా ఈ బడ్జెట్ను ప్రవేశపెట్టడం జరిగిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.అన్ని వర్గాల సమగ్రాభివృద్దే లక్ష్యంగా రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ ను బంగారు రాజు ఈ సందర్భంగా అభినందించారు.

## గంప దేవాలయాన్ని సందర్శించిన వీరేష్ చంద్ర దేవ్ దంపతులు

కురుపాం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



మహా శివరాత్రి సందర్భంగా కురుపాం నియోజకవర్గం, కొమరాడ మండలం, కోటిపామ్ పంచాయతీ, గుంప గ్రామంలో శ్రీ శ్రీ సోమేశ్వర శివాలయంలో స్వామి వారిని సతీసమేతంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆదివారం సందర్శించారు. త్రీ సంగమంగా పేరున్న ఈ గుడికి కురుపాం, గుమ్మలక్ష్మీపురం నియోజకవర్గాల ప్రజలు కాకుండా సమీపంలో గల ఒడిస్సా ప్రజలు సందర్శించుకుంటారు. వారితో పాటు కొమరాడ మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అంపావల్లి వాటర్ స్కీం లో క్లోరిన్ గ్యాస్ సిలెండర్స్ లీక్ అయి అరుగురికి అశ్వస్థత



బలిజిపేట ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

బలిజిపేట మండలం అంపవల్లి గ్రామంలో వాటర్ స్కీంలో ఉన్నటువంటి ఆర్ఓ ప్లాంట్కు సంబంధించిన గ్యాస్ సిలిండర్లు లీకై గ్రామంలో ఆరుగురుకు అస్వస్థత గురైంది కేంద్రంలో పీహెచ్ఈ తరలించిగా ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు మిగిలిన ముగ్గురు స్థానిక బలిజిపేట వైద్య అధికారిని క్రాంతి కిరణమై ఆధ్వర్యంలో చికిత్స పొందుతూ ఉన్నారు. ఇందులో రాగాల రాధ (37) బొందు సురేష్ (38)బొందు మురళి కుమారి (55) చికిత్స చేసి పార్వతీపురం జిల్లా ఆసుపత్రి కీ 108 లో తరలించారు. మిగిలిన ముగ్గురు కీ చికిత్స చేసారు. పరిశీలనలో ఉంచి వారికీ కూడ పీహెచ్సి నుంచి పార్వతీపురం తరలిం చారు స్థానిక బలిజిపేట పిహెచ్సి వైద్య అధికారిని డా.క్రాంతి కిరణమై వైద్య సేవలు వీరికి అందిస్తున్నారు.

## కిటకిటలాడిన శివాలయాలు ..శివనామ స్మరణలతో కిక్కిరిసిన భక్తులు

దత్తిరాజేరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తులు పలు శివాలయాల్లో శివ నామస్మరణతో ఓం నమ శ్శివాయ శంభో శంకర అంటూ శివాలయంలో పూజలు చేసు కున్నారు పురో హితులు గోత్రనామాలు చదివి అభిషేకాలు చేయించుకున్నారు. పాచలవలస దత్తి దత్తిరాజేరు ఎం లింగాలవలస కోమటిపల్లి శివాలయాల్లో భక్తులు తెల్లవారి నాలుగు గంటల నుండి క్యూ లైన్లో నిలబడి అభిషేకాలు మరియు పూజలు చేసి శివుని ఆశీస్సులు పొందారు సాయంకాలం కొన్ని శివాలయాలు పార్వతీ పరమేశ్వర కళ్యాణం, గురు రవి స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు కల్యాణానికి భక్తులు పాల్గొని పూజలు చేశారు శివాలయంలో రాత్రి 12 వరకు భక్తి పాటలు భజనలు చేపట్టడం జరుగుతుందన్నారు.

## అధ్వాన్నంగా ఇట్లామామిడిపల్లి రోడ్డు

రామభద్రపురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



రామభద్రపురం మండల పరిధిలోని ఇట్లా మామిడిపల్లికి వెళ్లే రహదారి అధ్వాన్నంగా తయారైంది. సుమారు 15 ఏళ్ల కిందట పిఎంజిఎసవ పథకం కింద ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి సంబంధిత శాఖాధికారులు ఈ రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో గోతులు, గుంతలమయం అయింది. దీంతో ఈ రోడ్డుగుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మరికొంత మంది ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారిపోయి నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని గ్రామానికి చెందిన బెల్లాన నరసింగరావు తెలిపారు. ఇటీవల మండల టీడీపీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు తన సొంత నిధులతో ఈ గోతులు, గుంతలు పూడ్చి, పిచ్చిమొక్కలు తొలగించినప్పటికీ మళ్లీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఇప్పటికైనా ఈ రోడ్డు దుస్థితిని దృష్టిలో ఉంచుకొని కొత్త రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
25 Glorious years
వార్త

## శివ నామస్మరణతో హోరెత్తిన శివాలయాలు

లక్క వరపు కోట ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఎల్ కోట మండలంలో గల వివిధ శివాలయాలకు శివ భక్తులు తెల్ల వారు జాము నుంచే పోటెత్తి బారులు తీరారు ఈ సందర్భంగా శివాలయాలు అన్ని శివ నామ స్మరణతో మార్మోగాయి ఈ సందర్భంగా మహా శువునికి అభిశేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని తమని నిత్యం కాపాడాలి అని మనసారా భక్తులు వేడుకున్నారు ఎల్ కోట మండల కేంద్రం లో గల వీరభద్ర స్వామి ఆలయం లో వేద పండితులు అక్కా జోస్యుల శ్రీ హరి శర్మ ఆధ్వర్యంలో సామూహిక రుద్రాభిషేకాలు అన్నాభిషేఖం 50 కేజీ ల అన్నం తో అలాగే మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది సాయంత్రం ప్రాదోష కాల అభిషేకం అర్చన దీపారాధన కార్యక్రమం తో పాటు హరే రామ సంకీర్తన లతో బీసీ కోలని గవర వీధి నెయ్యిల వీది మహిళల కోలాటం తో గ్రామ ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అలాగే రాత్రి 10 గంటలకు నక్షత్ర లింగాలకు 108 కళాశాల తో అభిషేకం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మహా శివ రాత్రి విశేషాలు మహా శివుని లీలలను భక్తులకు శ్రీ హరి శర్మ వివరించడం జరిగింది ఈ కార్యక్రమం లో భక్తులు భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## కిటకిటలాడిన శివాలయాలు

కొత్తవలస ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తులు పలు శివాలయాల్లో శివనామస్మరణతో ఓం నమశ్శివాయ శంభో శంకర అంటూ శివాలయంలో పూజలు చేసరు. పురోహితులు గోత్రనామాలు చదివి అభిషేకాలు చేయించుకున్నారు. కొత్తవలస, మంగళపాలెం, శివాలయాల్లో భక్తులు తెల్లవారి నాలుగు గంటల నుండి క్యూలైన్లో నిలబడి అభిషేకాలు, పూజలు చేసి శివుని ఆశీస్సులు పొందారు. సాయంకాలం కొన్ని శివాలయాలు పార్వతీ పరమే శ్వర కళ్యాణం ఘనంగా చేపట్టారు. స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణానికి భక్తులు పాల్గొని పూజలు చేశారు.శివాలయంలో రాత్రి 12 వరకు భక్తి పాటలు భజనలు చేపట్టడం జరుగుతుందన్నారు.

## శివాలయాల్లో భక్తి సందడి -- భక్తులకు అన్నదానం, సేవా కార్యక్రమాలు

రామభద్రపురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



మహాశివరాత్రి సందర్భంగా రామభద్రపురం కొట్టక్కి, నరసాపురం, అరికతోట కొత్తరేగ, తదితర గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో అర్చకులు రుద్రా భిషేకాలు, ప్రూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయం వద్ద స్వామివారి కళ్యాణోత్సవం, ప్రత్యేక పూజలు, భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా గ్రామంలోని భక్తులకు పులిహార, మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండేటట్లు, తమకు భగవంతుని సేవ చేసే అదృష్టాన్ని ఎల్లప్పుడూ కలిగించాలని, పరమేశ్వరుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ. పురోహితులు ప్రభాకర్ శర్మ కోరారు.

## యధావిధిగా నాలుగవ వారం

మక్కువ ఫిబ్రవరి 15 ప్రభాతవర్త



శంబర గ్రామంలో ఉన్న ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత రాష్ట్ర ప్రభుత్వ జాతరగా గుర్తింపు పొందిన పోల మాంబ అమ్మవారి ఆలయం జాతర ఉత్సవములు నాలుగవ మంగళవారం న యధావిధిగానే భక్తులు అమ్మవారి దర్శనములు చేసుకొనవచ్చునని ఆలయ కార్య నిర్వహణ అధికారి బి శ్రీనివాస్ తెలిపారు. సూర్య గ్రహణం ప్రభావం ఈ ప్రాంతమునకు లేదని పండితులు తెలియజేసారని చెప్పారు. 4 వ మంగళవారం సందర్భంగా భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన క్యూలైన్లు, బార్కెడ్లు, శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం తో పాటు ఉచిత దర్శనం,త్రాగు నీరు కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆలయ చైర్మన్ నైదాన చిన తిరుపతి, ఆలయ కార్య నిర్వహణ అధికారి బి. శ్రీనివాస్ తెలియజేశారు.కావున భక్తులు అందరు కూడా 4వ మంగళవారం పోలమాంబ అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు పొందాలని ఆయన కోరారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



నెల్లిమర్ల నగర పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని అన్నారు. జరజాపు పేటలో సి.సి రోడ్ల నిర్మాణానికి ఆమె లాంఛనంగా ఆదివారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. నగర పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. ఇప్పటికే నిధులు మంజూరు చేశారని, పనులు త్వరి తగతం పూర్తి అయ్యేందుకు ఆమె ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని సరోజని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జనసేన పార్టీ నాయకులు ఎం. ఎం. నాయుడు, జనా ప్రసాద్, రవ్వా నాని, అప్పికొండ రవికుమార్, అవనాపు మురళీకృష్ణ, జన సంధ్యారాణి, తుమ్మ వెంకటరమణ, సుంకర ముత్యాల నాయుడు, నల్లి శేఖర్, మాత మురళీమోహన్ పాల్గొన్నారు.

## సంక్షేమంలోని రాష్ట్ర బడ్జెట్.. కురుపాం కాంగ్రెస్ కో ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు

కురుపాం, ఫిబ్రవరి15ప్రభాతవార్త



ఏపీ 2026 -27 ఆర్థిక సంవత్సరానికి గానూ, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులపై కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు పెదవి విరిచారు. ఈ మేరకు గుమ్మ లక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ సవాళ్లున్నా సంక్షేమం అభి వృద్దే సంకల్పం అంటూ కూటమి ప్రభుత్వాధిపెద్దలు సీఎం చంద్రబాబు, రాష్ట్ర విత్త మంత్రి పయ్యావుల చిలక పలుకులు వినడానికి ఇంపుగా ఉన్నా... "సంక్షేమం- అభివృద్ధి " పథకాలైన పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం మరీ ముఖ్యంగా 'వీబీ రామ్ జీ, పథకానికి రాష్ట్ర వాటా రూ3,346 కోట్లు, వ్యవసాయ, అనుబంధ శాఖలకు రూ 53,752 కోట్లు, సాగునీటి రంగానికి రూ 18,223 కోట్లు, కేటాయింపులను చూస్తుంటే 'సంక్షేమం- సంకల్పం' లేదని ఇట్టే అర్థమవుతుందనిన్నారు. మొత్తంగా రూ 3,32,205కోట్ల బడ్జెట్ అంటూ కూటమి అంకెల గారడీ ప్రదర్శిస్తోందని చిన్నారావు ఎత్తిపొడిచారు.

16-2pg10.qxd:16-2pg10.qxd 1/1/02 6:45 AM Page 1






# ఇషాన్‌దార్

## కొలంబోలో భారత్ శివతాండవం

## బుమ్రా మ్యాజిక్ - చిత్తుగా ఓడిన పాక్

*దాయాది పాకిస్థాన్‌పై చరిత్ర పునరావృతమైంది. బంగ్లాదేశ్ సమస్యలో దూరి బాయ్ కాట్ చేస్తానంటూ ఆగ్నికి ఆజ్యం పోసిన పాకిస్థాన్‌పై కొలంబో ప్రేమదాస స్టేడియంలో భారత్ శివతాండవం చేసింది. మొదట బ్యాటింగ్‌లో, ఆ తర్వాత బౌలింగ్ లో ఓ ఆటేసుకుంది. ఇషాన్ కిషన్ షాన్ ధార్ ఇన్నింగ్‌కు పాక్ బౌలింగ్ దాసోహం అంటే...బూమ్ బూమ్ బుమ్రా, హార్దిక్ మైసైల్స్‌కు పాక్ బ్యాట్స్‌మెన్ తోక ముడిచారు. ఇక స్పిన్నర్లు పాక్ చాపచుట్టేశారు.*

| భారత్ | ఓవర్లు | పాకిస్థాన్ |
|---|---|---|
| 1/1 | 1 | 0/1 |
| 16/1 | 2 | 13/3 |
| 25/1 | 3 | 21/3 |
| 30/1 | 4 | 25/3 |
| 41/1 | 5 | 34/4 |
| 52/1 | 6 | 38/4 |
| 65/1 | 7 | 47/4 |
| 82/1 | 8 | 57/4 |
| 89/2 | 9 | 66/4 |
| 92/2 | 10 | 71/4 |
| 98/2 | 11 | 73/5 |
| 108/2 | 12 | 78/5 |
| 118/2 | 13 | 84/7 |
| 125/2 | 14 | 89/7 |
| 127/4 | 15 | 94/7 |
| 136/4 | 16 | 97/9 |
| 140/4 | 17 | 106/9 |
| 154/5 | 18 | 114/10 |
| 159/5 | 19 | |
| 175/7 | 20 | |

**కొలంబో:** భారత అభిమానుల అంచనాలను నిలబెడుతూ టీ20 ప్రపంచకప్ హైవోల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా... చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 61పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 176 పరుగుల లక్ష్యఛేధనలో దాయాది జట్టు బ్యాటింగ్ పేకమేడలా కూలింది. భారత బౌలర్ల ధాటికి మరో రెండు ఓవర్లు ఉండగానే 114 పరుగులకు కుప్పకూలింది.

### బూమ్ బూమ్ బుమ్రా

176 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్థాన్‌ను భారత బౌలర్లు ఆడుకున్నారు. ఫర్హాన్‌ను డకౌట్ చేసి హార్దిక్ పాండ్య పాక్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఆ తర్వాతి ఓవర్లో యార్కర్ల కింగ్ బుమ్రా మ్యాజిక్ చేశాడు. మొదటి బంతికి అయూబ్‌కు లక్కీ సిక్స్ లభించినా, రెండో బంతికి పర్‌ఫెక్ట్ యార్కర్‌తో బోల్తా కొట్టించాడు. కెప్టెన్ సల్మాన్ ఆఘాను కూడా వచ్చిన దారినే పెవిలియన్‌కు పంపాడు. ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన అక్షర్ పటేల్ కూడా బాబర్ ఆజమ్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో పాకిస్థాన్ 34 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

### సరిపోని ఉస్మాన్ మెరుపులు

పాక్ శిబిరంలో కాసేపైనా ఆనందం ఉందంటే ఉస్మాన్ ఖాన్ ఆడినంతసేపే. అతని మెరుపులు కూడా పాక్‌ను గట్టెక్కించలేకపోయాయి. 34బంతుల్లో 6 బౌండరీలు, ఒక సిక్స్‌తో 44 పరుగులు చేసిన అతన్ని అక్షర్ పటేల్ తెరదించాడు. ఆ తర్వాత పాక్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. వచ్చిన బౌలర్ వచ్చినట్లే వికెట్లు తీస్తూ పోయారు. ఆఖరుకు తిలక్ వర్మకు కూడా వికెట్ దక్కింది. దీంతో పాకిస్తాన్ ఇన్నింగ్స్ 114 రన్స్‌కే కుప్పకూలింది. భారత బౌలర్లలో బుమ్రా, హార్దిక్, అక్షర్, వరుణ్ చక్రవర్తిలు రెండేసి వికెట్లు.. కుల్‌దీప్, తిలక్ ఒక్కో వికెట్‌తీశారు.

### నిరాశపరిచిన అభిషేక్

టాస్ నెగ్గి మొదట భారత్‌ను బ్యాటింగ్‌కు దింపిన పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా.. సర్‌ప్రైజింగ్‌గా తనే బౌలింగ్‌కు దిగాడు. జట్టులోకి వచ్చిన అభిషేక్‌తో కలిసి ఇషాన్ కిషన్ భారత్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. రెండో బంతికి సింగిల్ తీసి పరుగుల ఖాతా తెరిచాడు. తొలి బంతికే సిక్స్‌తో విరుచుకుపడే విధ్వంసకర ఓపెనర్ అభిషక్ తన శైలికి భిన్నంగా మొదటి మూడు బంతులు డాట్‌గా ఆడాడు. చివరి బంతికి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో మిడాన్‌లో షహీన్ అఫ్రిదికి తేలికైన క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో భారత్ ఒక పరుగుకే తొలి వికెట్ కోల్పోయింది.

### ఇషాన్‌ధార్ ఇన్నింగ్

క్రీజ్‌లోకి వచ్చిన తిలక్‌వర్మతో కలిసి ఇషాన్ కిషన్ షాన్‌ధార్ ఇన్నింగ్ ఆడాడు. స్పిన్‌నే నమ్ముకున్న పాక్‌పై చెలరేగాడు. శివరాత్రి నాడు శివతాండవం చేశాడు. షహీన్ అఫ్రిదిని సిక్స్‌తో ఆహ్వానించిన ఇషాన్.. ఆ ఓవర్లో మరో రెండు బౌండరీలు బాదాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపు ఇషాన్ విభిన్న షాట్లతో అలరించాడు. అయిదో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన అబ్రార్‌ను సిక్స్, ఫోర్‌తో వెల్‌కమ్ చెప్పిన ఇషాన్... అయూబ్ ఓవర్లో మరో రెండు ఫోర్లతో భారత్ స్కోరును 50 పరుగులు దాటించాడు.

### శివతాండవం

అబ్రార్ మరో ఓవర్‌లో ఇషాన్ వరుసగా మూడు ఫోర్లు కొట్టి టీ20ల్లో తొమ్మిదో హాఫ్ సెంచరీ నమోదుచేశాడు. ఆ తర్వాత కూడా ఇషాన్ జోరు తగ్గలేదు. షాదాబ్ వేసిన 8ఓవర్లో ఓ సిక్స్, ఓ ఫోర్‌తో సహా మొత్తం 17రన్స్ సాధించాడు. బౌలింగ్‌కు దిగిన మరో స్పిన్నర్ అయూబ్ ఓవర్లో రివర్స్‌షాట్ ఆడి బౌండరీ సాధించిన ఇషాన్.. తరువాతి బంతికి మరో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో బౌల్డ్ అయ్యాడు. 40 బంతుల్లో 10 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 77 పరుగుల ఇషాన్ మెరుపు ఇన్నింగ్ ఈ విధంగా ముగిసింది.

### ఒక్కసారిగా తడబాటు

ఇషాన్ ఇన్నింగ్స్ తర్వాత భారత్ ఒక్కసారిగా తడబడింది. సూర్యకుమార్, తిలక్ మధ్యమధ్యలో బౌండ రీలు బాదినా అనుకున్న రీతిలో పరుగుల వేగం పెంచలేకపోయారు. 36బంతుల్లో కేవలం 38 పరుగులే చేశారు. అయూబ్ ఈ దశలో ఒక్కసారిగా ఝలక్ ఇచ్చా డు. 25 రన్స్ చేసిన తిలక్‌ను ఎల్బీ చేసిన అయూబ్... తరువాతి బంతికే హార్దిక్‌ను డకౌట్ చేశాడు. హాట్రిక్ మీదున్న అయూబ్.. దూబేను కూడా దాదాపు అవుట్ చేసినంత పనిచేశాడు. 15ఓవర్లకు భారత్ స్కోరు 127 పరుగులే.

### దూబే మెరుపులు

స్లాగ్ ఓవర్లలో దూబే బ్యాట్‌కు పనిచెప్పాడు. 17 బంతుల్లోనే మూడు ఫోర్లు ఓ సిక్స్‌తో 27 రన్స్ చేశాడు. నిలకడగా ఆడిన సూర్యకుమార్ (29 బంతుల్లో 32) తారిక్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడి అవుటయ్యాడు. షహీన్ అఫ్రిది వేసిన చివరి ఓవర్లో రింకూ సింగ్ ఓ సిక్స్, బౌండరీ సాధించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 రన్స్ చేసింది. పాక్ బౌలర్లలో అయూబ్ మూడు వికెట్లు తీశాడు.

### స్పిన్‌నే నమ్ముకున్న పాక్

టీమిండియాతో మ్యాచ్‌లో పాకిస్థాన్ స్పిన్నర్లనే నమ్ముకుంది. ఎంతలా అంటే ఆజట్టు పేస్ అటాక్ షహీన్ అఫ్రిదిని కేవలం రెండు ఓవర్లకే పరిమితం చేసేంతగా. మిగతా 18 ఓవర్లంతా స్పిన్నర్లే. పాక్ ఏడుగురు బౌలర్లలో ఆరుగురు స్పిన్నర్లు.



## పాక్‌పై భారత్-ఎ విమెన్ టీమ్ ఘనవిజయం



తతతత **బ్యాంకాక్:** మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్‌లోనూ పాకిస్తాన్‌కు భారత్ షాకిచ్చింది. దాయాదిని భారత్-ఎ మహిళల టీమ్ చిత్తు చిత్తుగా ఓడించింది. 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాక్-ఎ జట్టు 18.5 ఓవర్లలో 93 రన్స్‌కే ఆలౌటైంది. భారత బౌలర్లు సైమా, రాధా, ప్రేమా రావత్ తలో రెండు వికెట్లు తీసి పాక్ పతనాన్ని శాసించారు. ఈ స్వల్ప లక్షాన్ని భారత-ఎ మహిళల జట్టు 10 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పయి అందుకుంది. పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ కోల్పోయినా.. బ్రిందా దినేష్ 55 రన్స్, అనుష్క శర్మ 24 రన్స్‌తో రాణించి విజయాన్ని అందించారు.

## సూపర్-8లో వెస్టిండీస్

**ముంబయి:** వెస్టిండీస్ హ్యాట్రిక్ విజయాలతో టీ20 ప్రపంచకప్ సూపర్8లో ప్రవే శించింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన గ్రూప్-సీ మ్యాచ్‌లో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజ యం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్‌ను విండీస్ బౌలర్లు కుప్పకూల్చారు. జాసన్ హోల్డర్ బౌలింగ్ ధాటికి నేపాల్ 46 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో దీపేంద్ర సింగ్ క్రీజ్‌లో నిలదొక్కుకుని 47 బంతుల్లో 58 రన్స్ చేశాడు. లోయర్ ఆర్డర్‌లో సోంపాల్ 26 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 133 రన్స్ చేసింది.

ఈ లక్ష్యాన్ని విండీస్ ఒక వికెట్ కోల్పోయి 15.2 ఓవర్లలోనే ఛేధించింది. బ్రాండమ్ కింగ్‌తో తొలి వికెట్‌కు 43 పరుగులు చేసిన షాయ్ హోప్... రెండో వికెట్‌కు హెట్మైర్‌తో కలిసి రెండో వికెట్ కు అజేయంగా 81 రన్స్ చేసి విండీస్‌కు విజయాన్ని అందించాడు.

## నమీబియాపై అమెరికా సూపర్ విక్టరీ



**చెన్నై:** క్రికెట్ కూనల మ్యాచ్‌లో అమెరికా సూపర్ విక్టరీ సాధించింది. గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై 31 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా బ్యాటింగ్‌లో ఇరగ దీసింది. ఓపెనర్ మోనాక్ పటేల్ మెరుపు ఆరంభం ఇచ్చాడు. 30 బంతుల్లో 52 రన్స్ చేశాడు. మిడిల్ ఆర్డర్‌లో సంజయ్ కృష్ణమూర్తి కూడా ధాటిగా ఆడడంతో అమెరికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 రన్స్ చేసింది. కృష్ణమూర్తి 33 బంతుల్లో వేగంగా 68 రన్స్ చేశాడు.

200 పరుగుల లక్ష్యాన్ని సాధించలేక నమీబియా చతికిలపడింది. 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 రన్స్ మాత్రమే సాధించగలిగింది. ఓపెనర్ స్టీన్‌కంప్ 58 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అమెరికా బౌలర్లలో షాండ్లేవాన్ రెండు వికెట్లు తీశాడు.

## వింటర్ ఒలింపిక్స్‌లో నార్వే పతకాల పంట



**మిలాన్:** ఇటలీలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో నార్వే దూసుకుపోతోంది. మొత్తం 22 మెడల్స్‌తో టాప్ ప్లేస్‌లో కొనసాగుతోంది. ఇందులో 11 స్వర్ణాలు, నాలుగు సిల్వర్, ఏడు బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. అతిథ్య ఇటలీ ఆరు స్వర్ణాలతో సహా 17 మెడల్స్‌తో రెండో స్థానంలో ఉంది. అమెరికాకు ఈసారి మెడల్స్ సాధించడంలో వెనకబడిది. కేవలం అయిదు స్వర్ణాలు మాత్రమే అమెరికా సాధించింది. నార్వేకు చెందిన క్రాస్ కంట్రీ స్కియర్ జోహాన్స్ క్లీబో ఏకంగా నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాడు. స్విట్జర్లాండ్ కు చెందిన ఫ్రాంజజో వాన్ అల్మైన్.. ఆల్మైన్ స్కీయర్ విభాగంలో మూడు స్వర్ణాలు గెలుపొందాడు. భారత్ నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొంటున్నా... ఇప్పటివరకు మెడల్స్ బోణీ చేయలేదు.




## టాప్ ఆరు కంపెనీల్లో రూ.3లక్షల కోట్ల ఎంక్యాప్ కోత

**ముంబయి, ఫిబ్రవరి 15:** మార్కెట్‌లోని టాప్ పదికంపెనీల్లో ఆరు కంపెనీల మార్కెట్‌విలువలు రూ.3 లక్షలకోట్లు కోతకు గురయ్యాయి. ఐటి మేజర్ కంపెనీలు టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి రెండు కంపెనీలు కూడా భారీగా మార్కెట్ విలువలు కోల్పోయాయి. ఈక్విటీల్లో నెలకొన్న మందగమనమే ఇందుకు కారణమని తెలుస్తోంది. టిసిఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతి ఎయిర్‌టెల్ వంటివి వాటి మార్కెట్‌విలువల్లో తగ్గుదలను చవిచూసాయి. స్టేట్‌బ్యాంకు, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఐసిఐసిఐబ్యాంకులు లాభాలు పొందినట్లుతెలుస్తోంది. టిసిఎస్ మార్కెట్ విలువలు 90,198.92 కోట్లు క్షీణించి రూ.9,74,043.43 కోట్లుగా ఉంది. ఇన్ఫోసిస్ విలువలు కూడా 70,780.23కోట్లు క్షీణించి రూ.5,55,287.72 కోట్లుగా ఉంది. ఇక హెచ్‌డిఎఫ్‌షిబ్యాంకు మారెనకట్ విలువలు రూ.54,627.71 కోట్లు క్షీణించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.41,883 కోట్లు క్షీణించి రూ.19,21,475.79 కోట్లకు చేరింది. జీవితబీమా సంస్థ మార్కెట్ విలువలు కూడా 23,971.74 కోట్లు క్షీణించి 5,46,226.80 కోట్లకుచేరితే భారతి ఎయిర్‌టెల్ మార్కెట్‌క్యాప్ రూ.19,244.61 కోట్లు క్షీణించి రూ.11,43,044,03 కోట్లుగాఉంది. ఇక ఎస్‌బిఐ విలువలుమాత్రం రూ.1,22,213.38 కోట్లుపెరిగి రూ.11,06,566.44 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్‌కూడా రూ.26,414.44కోట్లు పెరిగి రూ.6,37,244.64కోట్లకు చేరింది. ఎల్‌అండ్‌టి కూడా రూ.14,483.9కోట్లు పెరిగి రూ.5,74,028 కోట్లకు చేరింది. ఐసిఐసిఐ బ్యాంకు ఎంకాప్ కూడా 5719.95 కోట్లు పెరిగి రూ.10,11,978.77 కోట్లకు చేరినట్లు తేలింది. టాప్ పదికంపెనీల్లో ఇప్పటికీ రిలయన్స్ టాప్‌లోనే నిలిస్తే ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి ఇన్ఫోసిస్, ఎల్‌ఐసిలు నిలిచాయి.

## ఇండో యుఎస్ ట్రేడ్ డీల్‌తో ట్రాక్టర్ల ఎగుమతులకు మంచి ఛాన్స్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్‌తో అమెరికాకు ట్రాక్టర్ల ఎగుమతికి పుష్కల అవకాశాలున్నట్లు కంపెనీలు చెపుతున్నాయి. ఎస్కార్ట్స్ కుబోటా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ 2030 మధ్యంతర వృద్ధి ప్రణాళికలో కంపెనీకి ఎగుమతులు మార్కెట్‌పెరుగుతుందని అంచనా వేసింది. కంపెనీ మాతృసంస్థ కుబోటా జపాన్‌కు చెందిన కంపెనీ ఇప్పటివరకూ అమెరికాకు ఎగుమతులుచేయడంలేదని, ఇపుడు సుంకాల సమస్య పరిష్కారం కావడంతో ఎస్కార్ట్ కుబోటా ట్రాక్టర్లను ఇకపై అమెరికాకు సైతం ఎగుమతులుచేస్తామని కంపెనీ పూర్తికాలపు డైరెక్టర్ సిఎఫ్ఒ భారత్ మదన్ తెలిపారు. ఇప్పటివరకూ మా మాతృసంస్థ కుబోటా జపాన్‌నుంచి ఎగుమతులుచేస్తోందని, సుమారు 15శాతం ఎగుమతులు నమోదయినట్లు ఆయన తెలిపారు. అలాగే భారత్‌నుంచి కూడా 18శాతం ఎగుమతులు వెళతాయన్నారు. ఎక్కువ వృద్ధికారక మార్కెట్లపైనే కుబోటా ఫోకస్ పెంచిందని భారత్‌ను తమకు గ్లోబల్ హబ్‌గా మార్చుకుంటుందని కూడా చెప్పారు. అమెరికాకు ఎగుమతులు పెరిగితే కంపెనీకి వ్యయభారం కూడా ఆదా అవుతుందన్న భావనతో సిఎఫ్ఒ ఉన్నారు. ఇక ఇండియా ఈయూ ఎఫ్‌టిఎ పరంగా చూస్తే ఇప్పటికే ట్రాక్టర్లపై సుంకాలు లేవని, ఈ ఒప్పందం తర్వాత ట్రాక్టర్ల ఎగుమతులకు సంబంధించి పెద్దగా ప్రభావం ఉండబోదన్నారు. ఇప్పటికే తాము ఈయూకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. దేశీయ మార్కెట్ పరంగా ట్రాక్టర్ రంగం మంచి వృద్ధిపథంలోకి వస్తుందని, జీఎస్టీ రేట్ తగ్గింపుతో మూడోత్రైమాసికంలో 23శాతం వృద్ధిని నమోదుచేసినట్లు కంపెనీ డైరెక్టర్ తెలిపారు.

## లెనోవో నికరలాభం రూ.8145కోట్లు




**ముంబయి, ఫిబ్రవరి 15:** లెనోవో ఇండియా మూడో త్రైమాసికంలో తన నికరలాభాల్లో ఏడుశాతం నమోదుచేసింది. రూ.8145 కోట్లు లాభం ఆర్జించినట్లు ప్రకటించింది. భారత్‌లో ఎఐకి పెరుగుతున్న డిమాండ్, డిజిటైజేషన్‌వెల్లువల కారణంగాపటిష్టమైన పనితీరు చూపించగలిగామని మొబైల్; పిసి ఇతర మౌలికవనరుల బిజినెస్ విభాగాల్లో మంచి పనితీరుచూపింగలిగినట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎండి శైలేంద్ర కత్యాల్ తెలిపారు. దీనికితోడు తమ ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం కూడా కలిసొచ్చిందన్నారు. కంపెనీపరంగా మోటారోలా కీలక వృద్ధిని నమోదుచేసింది. మూడోత్రైమాసికంలో భారత్ లో 8.3శాతం మార్కెట్ వాటాను సాధించింది. ఇక కోర్ పిసి బిజినెస్; సర్వర్, ఇన్‌ఫ్రా విభాగాలు కూడా రెండంకెల వృద్ధిని నమోదుచేసాయి. గ్లోబల్ టెక్ జైంట్ అయిన లెనోవోకు భారత్ కీలక మార్కెట్ వనరుగా మారింది. నాలుగుశాం లెనెవో గ్లోబల్ రరెవెన్యూలు, మొత్తం ఆసియా పసిఫిక్ రీజియన్ ఆదాయంలో 24శాతం భారత్‌నుంచే వస్తుందని తెలుస్తోంది. 2005నుంచే భారత్‌లో లెనోవో ఉత్పత్తిచేస్తూ వస్తోంది. స్థానికంగానే అమ్ముడుపోతున్నాయి. మోటారోలా ఫోన్లు, పిసిలు, సర్వర్లు, ట్యాబ్‌లు దేశీయ మార్కెట్‌లో మంచి దూకుడుగా ఉన్నాయి. ఇక పిసిబిలు, మదర్‌బోర్డులపరంగా కూడా మరింత కృషిచేస్తున్నట్లు తెలిపారు. లెనోవో హైబ్రిడ్ ఎఐ వ్యూహాన్ని ప్రోత్సహిస్తున్నదని, పబ్లిక్ క్లౌడ్స్, ప్రైవేటు ఇన్‌ఫ్రా, ఎఐ పిసిలు వంటి వాటికి ఎక్కువ ప్రోత్సాహం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. భారత్‌లో కంపెనీకి ఆర్‌అండ్‌డి కూడా ఉంది మొత్తం 3400 మంది భారత్‌లోపనిచేస్తున్నారు. లెనోవో గ్రూప్ పరంగా చూస్తే 22.2 బిలియన్ డాలర్ల రాబడులు సాధించింది.

## మణప్పురం వాటాకొనుగోలులో బెయిన్ క్యాపిటల్స్‌కు ఆర్బీఐ ఆమోదం




**ముంబయి, ఫిబ్రవరి 15:** మణప్పురం ఫైనాన్స్‌లో 41.66శాతం వాటా కొనుగోలుచేయాలనుకన్న బెయిన్ క్యాపిటల్‌కు రిజర్వుబ్యాంకు ఆమోదం తెలిపింది. కంపెనీ అధీకృత మూలధనం, కన్వర్టిబుల్ ఉత్పత్తుల్లో బెయిన్ క్యాపిటల్ అనుబంధ సంస్థలు బిసి ఏసియా ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌ఎక్స్‌వి, బిసి ఏసియా ఇన్వెస్ట్‌మెంట్స్ ఎక్స్‌ఐవిలు పెట్టుబడులు పెడుతున్నాయి. గత ఏడాది మార్చిలోనే ఇందుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. గోల్డ్‌లోన్ మేజర్‌కంపెనీగా ఉనన మణప్పురానికి ఈ పెట్టుబడులతో యాజమాన్య వ్యవస్థకూడా పూర్తిగా మారుతుంది. కొన్ని షరతులకు లోబడి ఆర్బీఐ అనుతిచ్చింది. 26శాతానికి మించి అధీకృత మూలధనం, వారంట్లు మినహాయించి ఏడాది తర్వాత తీసుకోవాల నుకుంటే మళ్లీ ఆర్‌బిఐ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్, మణప్పురం హోమ్ ఫైనాన్స్ సంస్థలు కూడా దరఖాస్తులుచేసాయి. వీటి అనుమతులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఒకసారి ఈ డీల్‌పూర్తయితే భారత్‌లోని నాన్‌బ్యాంకింగ్ రంగంలో అతిపెద్దప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల డీల్‌గా నిలుస్తుంది. అంతేకాకుండా మణప్పురం క్యాపిటల్‌బేస్‌ను పెంచుతుంది. రిటైల్ రుణ విభాగంలో మరింతగా వృద్ధి ప్రణాళికలు అమలుచేసే వీలుంటుంది.

# అణు ఇంధన రంగంలోకి అదానీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అణు విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేటురంగానికి కేంద్రం మద్దతిస్తుండటంతో ఇతర సంస్థలతోపాటు ఆదానిగ్రూప్ కూడా అణువిద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తోంది. టాటా, జెఎస్‌డబ్ల్యు సంస్థలు ఇప్పటికే ఈ రంగంలో విద్యుత్ ఉత్పత్తికి ఆసక్తిచూపిస్తున్నాయి. గుజరాత్ కేంద్రంగాఉన్న ఆదాని గ్రూప్ కొత్త అనుబంధ సంస్థ ఆదాని ఆటమిక్ ఎనర్జీద్వారా ఈ రంగంలోకి వస్తోంది ఆదానిపవర్‌కు ఈ సంస్థ అనుబంధంగాపనిచేస్తుంది. ప్రభుత్వ విదాననిర్ణయాల్లో మార్పులు, సడలిం పులు చేర్పులు చేయడంతో ప్రైవేటురంగంలో కూడా అణు ఇంధన ఉత్పత్తికి అవకాశం వచ్చింది. దీర్ఘకా లిక స్వచ్ఛ ఇంధనం, ఇంధన భద్రత వ్యూహాలకు అనుగుణంగా కేంద్రం ఇపుడు ప్రైవేటు రంగాన్ని కూడా ప్రోత్సహిస్తోంది. బారత్‌కు ప్రస్తుతం 9 గిగావాట్ల అణుసామర్థ్యం ఉంది. మొత్తం విద్యుత్ ఉత్ప త్తిలో మూడుశాతం వాటాతో ఉంది. ప్రభుత్వం 2047 నాటికి 100 గిగావాట్ల అణువిద్యుత్ ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది. మొత్తం విద్యుత్‌లో పదిశాతానికిపైగా అణువిద్యుత్ మిక్స్ కూడా ఉంటుం దని అంచనా. ప్రైవేటు కంపెనీలు బిల్డ్, ఓన్, ఆపరేట్ న్యూక్లియర్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చు. చిన్నపాటి మాడ్యుల్ రియాక్టర్లను భాగస్వామ్య పద్ధతిలోకూడా ఏర్పాటుచేసుకోవచ్చు. విదేశీ పెట్టు బడుల్లో 49శాతం వాటాను అనుమతిస్తారు. యురేనియం తవ్వకాల్లో మాత్రం పూర్తిగా ప్రభుత్వ పట్టు కొనసాగుతుంది. ఇంధన మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వ కస్టడీలోనే ఉంటుంది. అణు ఇంధన రంగంలో చేసిన మార్పులు కేవలం మోడీ సన్నిహితులకు, ఎన్డీయే కార్పొరేట్లకు ప్రయోజనం కల్పిం చేందుకు చేసినవిగానే ఉన్నాయని కాంగ్రెస్ పక్షనేత జైరామ్‌రమేష్ అన్నారు. 2070 నాటికి నెట్‌జీరో ఉద్గారాలు సాధించే లక్ష్యంతో భారత్ అణు ఇంధన ఉత్పత్తిని కూడా భారీస్థాయిలో ప్రైవేటును ప్రోత్సహిస్తోంది.

## సాలిడ్‌రైజ్‌లో లోథా డెవలపర్స్‌కు 80%వాటా




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** రియాల్టీ సంస్థ లోథా డెవలపర్స పూణె కేంద్రంగా ఉన్న సాలిడ్‌రైజ్ రియాల్టీలో 80శాతం వాటాను రూ.294 కోట్లకు కొనుగోలు చేసింది. ముంబయి కేంద్రంగాపనిచేసే లోథా డెవలపర్స్ దేశంలోనే లీడింగ్ రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఒకటిగా కొనసాగింది. లోథా బ్రాండ్‌పై స్థిరాస్తులను విక్రయిస్తుంది. కంపెనీ సాలిడ్‌రూజ్ రియాల్టీనుంచి వాటాలకొనుగోలు ఒప్పందం చేసుకుందని వెల్లడించింది. ఈ డీల్‌పూర్తయితో సాలిడ్‌రైజ్ సంస్థ లోథా డవలపర్స్‌లో అనుబంధంగా కొనసాగుతుంది. గతనెలలోనే లోథా డవలపర్స్ ఒకటిశాతం నికరలాభాల్లో వృద్ధిని నమోదుచేసారు. నికరలాభం రూ.956.9 కోట్లు ఆర్జించినట్లు వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.944.4 కోట్లు సాధించింది. మొత్తం రాబడులు కూడా 4775.4 కోట్లు ఉంది. అదే గత ఏడాది 4146.6 కోట్లు మాత్రమే ఆర్జించింది. ముంబయి, డిల్లీ, ఎన్సీఆర్, బెంగళూరుల్లో ఈత్రైమాసికంలో ఐదు స్థలాలను సేకరించింది. ఈ స్థలాల్లోనే వృద్ధిచేస్తే రూ.34 వేల కోట్ల విలువలు నమోదవుతాయని కంపెనీ చెపు తోంది. లోథా డెవలపర్స్ 100 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని ఇప్పటివరకూ అభివృద్ధిచేసింది. ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్, పూణె, బెంగళూరు హౌసింగ్ మార్కెట్‌లలో మంచి డిమాండ్‌తో ఉంది. ఇటీవలే ఢిల్లీ ఎన్సీఆర్ రెసిడెన్షియల్ మార్కెట్‌లోకి ప్రవేశించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.